

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 297

మంగళవారం 11-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మిస్ నెదర్లాండ్స్‌గా ట్రాన్స్‌జెండర్

సరికొత్త చరిత్ర సృష్టించిన రిక్కీ వలేరి కొల్లే - 6లో



లక్ష్యసేన్ అదరహో..


కెనడా బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత క్రీడాకారుడు - 12లో



ఆ బాధ్యత అధికారులదే..

మణిపూర్‌లో హింసను అరికట్టేందుకు శాంతి భద్రతల యంత్రాంగాన్ని తాము చేతుల్లోకి తీసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



'ఆర్డినెన్స్'పై కేంద్రానికి నోటీసు

ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది.


వివరాలు 6లో ▸



ప్రిగోజిన్‌తో పుతిన్ భేటీ

రష్యాపై తిరుగుబాటు చేసిన ప్రైవేట్ సైన్యం 'వాగ్నర్' అధిపతి ప్రిగోజిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయినట్లు వెల్లడైంది.

వివరాలు 6లో ▸



చిలీలో వింత వైరస్

దక్షిణ అమెరికా దేశమైన చిలీలో గిలాన్ బరే అనే వింత వ్యాధి బారిన పడి జనం అల్లాడుతున్నారు.

వివరాలు 6లో ▸

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్ 'సంఘ విద్రోహ' వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ర్యాలీలు.. పలుచోట్ల దిష్టి బొమ్మలు, ఫొటోలకు నిప్పు



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను కాలితో తొక్కి ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళా వలంటీర్

- ఇళ్లల్లోకి దూరుతున్నారు.. సమాచారం ఎక్కడికో పోతోందంటూ మరోసారి పవన్ అనుచిత వ్యాఖ్యలు
- నల్ల రిబ్బన్లతో విధులకు వలంటీర్లు
- కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: గ్రామాల్లో ఆత్మీయులకు స్వచ్ఛందంగా సేవలందించే వలంటీర్లను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సంఘ విద్రోహ శక్తులతో పోల్చటంపై నిరసన జ్వాలలు భగ్గుమన్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఆప్యాయంగా పలుకరించే వలంటీర్ సోదరులకు దురుద్దేశాలను ఆపాదించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లుగా దాదాపు 53 శాతం మంది యువతులు సేవలందిస్తుండగా

మిగతా 2వ పేజీలో ▶



ఒంగోలులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్‌లు, స్థానిక ప్రజలు

క్షమాపణ చెప్పాల్సిందే..

వలంటీర్ల విషయంలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై నేతల మండిపాటు 3లో

'అదృశ్యం' అవాస్తవం!

ప్రజలకు సేవలు అందిస్తున్న వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయొద్దన్న పోలీసు శాఖ 2లో

10 రోజుల్లో ఆధారాలివ్వాలి

పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు 3లో

వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో అల్‌డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



'పారిశ్రామిక' పరుగులు

కొప్పర్తిలో అల్ డిక్సన్ నూతన యూనిట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- టెక్నోడోమ్ (టీవీ యూనిట్), వర్చువల్ మేజ్ సంస్థలకు శంకుస్థాపన
- టెక్నోడోమ్ (వాషింగ్ మెషీన్ యూనిట్), ఛానెల్ ప్లే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు
- కడప గడపలో సుందరమైన రాజీవ్ మార్గ్, పార్కుకూ ప్రారంభం
- ముగిసిన ముఖ్యమంత్రి మూడు రోజుల జిల్లా పర్యటన

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కడప సమీపంలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్క్ కేంద్రంగా పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే, సీఎం సమక్షంలో టెక్నోడోమ్ (టీవీ యూనిట్), వర్చువల్ మేజ్, సంస్థలకు సీఎం శంకుస్థాపన చేయగా.. టెక్నోడోమ్ (వాషింగ్ మెషీన్ యూనిట్), ఛానెల్ ప్లే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. అంతకుముందు.. కడప గడపలో రూ.5.61 కోట్లతో

మిగతా 10వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్



అన్ని మద్యం దుకాణాల్లోనూ

డిజిటల్ చెల్లింపులు

డిజిటల్ చెల్లింపులు లేవన్నది దుష్ప్రచారమే.. ఆరోపణలను ఖండించిన బెవరేజెస్ కార్పొరేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని బెవరేజెస్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ఓ పార్టీ నేత చేసిన ఆరోపణలను సోమవారం

మిగతా 5వ పేజీలో ▶

సోమవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూ జిల్లాలో మహోగ్రంగా ప్రవహిస్తున్న బియాస్ నది



ఉత్తరాది అతలాకుతలం

- మూడో రోజూ కొనసాగిన భారీ వర్షాలు
- హిమాచల్‌లో 18 మంది మృతి
- ప్రమాదస్థాయికి చేరుకున్న 'యమున'
- నేడు కూడా వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ
- హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రులతో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- అవసరమైన సాయం అందిస్తామని హామీ

6లో

ఏడు తరాల ఏడాకుల బీర



- ఇళ్లముందు మామిడి తోరణాలు కనిపించడం సహజం. కానీ.. కాకినాడ జిల్లా చిత్రాడలో బీరకాయల తోరణాలు కనిపిస్తాయి. ఆ గ్రామంలో లభించే బీర విత్తనాలకు అంతటి ప్రసిద్ధి మరి. మొలకెత్తిన బీరపాదుకు ఏడు ఆకులు రాగానే.. కాయలు కాయడం చిత్రాడ బీర ప్రత్యేకత. ఇక్కడి బీర విత్తనాలకు ఇతర రాష్ట్రాల్లోనూ మంచి డిమాండ్ ఉంది.

- వివరాలు 5లో

లెవల్-1 క్యాన్సర్ సెంటర్‌గా గుంటూరు



- క్యాన్సర్ వైద్యం కోసం బాధితులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే పనిలేకుండా అన్ని ప్రాంతాల్లో 50 కి.మీ పరిధిలోనే వైద్య సదుపాయాలను కల్పించేలా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రోడ్ మ్యాప్‌ను రాష్ట్ర వైద్య శాఖ రూపొందించింది. తొలిదశ కింద.. గుంటూరు జీజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగాన్ని లెవల్-1 సెంటర్‌గా, కర్నూలు, విశాఖలో లెవల్-2 క్యాన్సర్ సెంటర్లను అభివృద్ధి చేయనుంది.

- వివరాలు 10లో



ఎన్నో రాత్రులొస్తాయి గానీ..

రాదేం నిద్దురమ్మా!

నాణ్యమైన నిద్రకు దూరమవుతున్న మహిళలు

- పట్టణాల్లో పురుషుల కంటే మహిళల్లోనే నిద్ర రుగ్మతలు
- మహిళల్లో 36 శాతం.. పురుషుల్లో 21 శాతం నిద్రలేమి
- సౌరాష్ట్ర విశ్వవిద్యాలయం పరిశోధనలో గుర్తింపు

మనిషి ఆరోగ్యంగా జీవించడానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో.. నిద్ర కూడా అంతే అవసరం. తగినంత నాణ్యమైన నిద్ర లేకపోతే మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయి. ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానాలతో నిద్ర రుగ్మతలు ప్రజలను వేధిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే.. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా నిద్ర రుగ్మతలతో సతమతం అవుతున్నారు. ఈ విషయం గుజరాత్‌లోని సౌరాష్ట్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే 620 మంది పురుషులు, 644 మంది మహిళలు కలిపి 1,264 మందిపై నిద్ర జీవన విధానాలను అధ్యయనం చేశారు. సర్వేలో పాల్గొన్న వారిలో 30 నుంచి 55 ఏళ్లకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు ఇలా అన్నివర్గాల వారు ఉన్నారు.

-సాక్షి, అమరావతి

మహిళల్ని నిద్రకు దూరం చేస్తున్న కలహాలు

కాగా, మహిళల్లో నిద్రలేమి రుగ్మతకు కుటుంబ కలహాలే ప్రధాన కారణంగా ఉంటున్నాయి. సర్వేలో పాల్గొన్న 36 శాతం మంది మహిళలు నిద్ర లేమితో బాధపడుతున్నట్టు వెల్లడించారు. వీరిలో 45 శాతం మంది కుటుంబ కలహాల కారణంగా సరిగా నిద్ర పోలేకపోతున్నామని చెప్పారు. మహిళలు, పురుషుల్లో 36 శాతం మంది కరోనా వైరస్ నుంచి కోలుకున్న పరిణామాలతో నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్టు తెలిపారు.

36 శాతం మంది మహిళల్లో రుగ్మత

సర్వేలో పాల్గొన్న పురుషుల్లో 21 శాతం మంది నిద్ర రుగ్మతలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. పురుషులను మించి 36 శాతం మంది మహిళలు నిద్రలేమి సమస్యతో సతమతం అవుతున్నట్టు తేలింది. వ్యసనాలకు బానిసలు కావడం, ఒత్తిడితో కూడిన జీవనం కారణంగా నిద్రలేమి సమస్యతో పురుషులు బాధపడుతున్నట్టుగా నిర్ధారణ అయింది.

ఏ వయసు వారికి ఎంత నిద్ర అవసరం

వయసు	నిద్రించాల్సిన గంటలు
3-5	10-13
6-13	9-11
14-17	8-10
18-25	7-9
26-64	7-9

64 ఏళ్లు పైబడిన వారికి 7-8

నిద్రలేమితో వచ్చే సమస్యలివీ

- నిద్రలేమి వల్ల గుండె, నరాల సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం ఉంది.
- చిరాకు, కోపం ఎక్కువ కావడం, ఒత్తిడికి లోనవడం వంటి సమస్యలు వస్తాయి.
- సరిపడా నిద్ర లేకపోతే పిల్లలకు అలర్జీలు, చిరాకు వంటి సమస్యలు వస్తాయి.
- శ్వాస సంబంధిత సమస్యతో కొందరు అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియాతో బాధపడుతుంటారు. ఇది ప్రమాదకరమైనది. దీనికి సకాలంలో చికిత్స చేయించుకోవాలి.
- సెల్‌ఫోన్ వల్ల కూడా స్లీప్ అప్నియా వస్తుంది. దీనిని నియంత్రించకపోతే హైపర్ టెన్షన్, హఠాత్తుగా గుండెపోటు రావడం, జ్ఞాపక శక్తి కోల్పోవడం జరుగుతుంది.





శరవేగంగా భూముల రీ సర్వే

- రాష్ట్రంలో భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే శరవేగంగా జరుగుతోంది. తొలి దశలో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి డిజిటల్ రికార్డులను అందుబాటులోకి తెచ్చింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఒక్క గ్రామంలో కూడా భూముల రీ సర్వే పూర్తవ్వలేదు.

14లో



అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

- నంది నాటకోత్సవాలను అక్టోబర్‌లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార శాఖ కమిషనర్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఐదు విభాగాల్లో మొత్తం 73 అవార్డులను ప్రదానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

5లో



ముందు దీని రిపేరు కాస్త చూడండి సార్!

కమీషన్లు అందటం లేదనే..

రామోజీ నేలబారు రాతలు

ఏది నిజం?

- కేంద్రమే కట్టాల్సిన పోలవరాన్ని.. కమీషన్ల కోసం తనకు ఇమ్మన్న చంద్రబాబు
- అందుకోసం రాష్ట్ర ప్రయోజనాలతో రాజీ.. కేంద్రానికి ప్రత్యేక హోదా తాకట్టు
- ఇక ప్రత్యేక హోదాపై నోరెత్తబోమన్న హామీతో.. రాష్ట్రానికి పోలవరం నిర్మాణ బాధ్యత
- పనుల్ని నామినేషన్‌పై యనమల బావమరిదికి, రామోజీ వియ్యంకుడికి ఇచ్చేసిన బాబు
- 2013-14 ధరల ప్రకారం ఇరిగేషన్ పనులకయ్యే ఖర్చులో మిగిలింది ఇస్తామన్న కేంద్రం
- ఈ మేరకు 2017 మార్చి 15న కేబినెట్ తీర్మానం.. జై కొట్టిన టీడీపీ మంత్రులు
- అంతటి కఠిన షరతుకు సైతం ముందూ వెనకా చూడకుండా ఓకే అనేసిన బాబు
- సీఎం జగన్ కృషితో 2017లో ఆమోదించిన మొత్తం కంటే అధికంగా ఇవ్వడానికి కేంద్రం ఓకే

4లో


అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో పవన్ దిష్టిబొమ్మ దహనం


నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు తదితరులు


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వలంటీర్ల నిరసన


అనంతపురం జిల్లా సోమందేపల్లిలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం..

జనసేనానికి నిరసనల సెగ


గుంటూరు కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల నిరసన


వైఎస్సార్ జిల్లా కడపలో పవన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు


ప్రకాశం జిల్లా.. ఒంగోలు చర్చి సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు


విశాఖ జిల్లా ఇసుకతోట వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు తదితరులు


చిత్తూరు జిల్లా పుత్తూరులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు


శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో వలంటీర్ల మానవహారం


విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ప్లకార్డులతో వలంటీర్ల నిరసన ర్యాలీ


కర్నూలు జిల్లా ఉయ్యాలవాడలో పవన్ దిష్టిబొమ్మ దహనం..


పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పవన్ దిష్టిబొమ్మ దహనం..

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

▶ మొదటి పేజీ తరువాయి

సాటి మహిళలకు వారెందుకు చేటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే వెనుకాడినా వలంటీర్లు మానవత్వంతో అందించిన సేవలను గుర్తు చేస్తున్నారు. పవన్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుని వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. పలుచోట్ల వలంటీర్లు ఆగ్రహంతో ఊగిపోతూ పవన్‌కళ్యాణ్ ఫోటోలు, పోస్టర్లను చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. దిష్టి బొమ్మలు దహనం చేశారు. జనసేన అధ్యక్షుడి అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వలంటీర్లు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. 'సేవా భావంతో పనిచేసే మా వలంటీర్ల జోలికొస్తే తాట తీస్తాం..' అంటూ హెచ్చరించారు. నిన్న.. వలంటీర్లను మహిళల కిడ్నాప్‌లకు సహకరించే సంఘ విద్రోహులుగా అభివర్ణించిన పవన్‌కళ్యాణ్ తాజాగా వారు సేకరించే సమాచారం ఎక్కడెక్కడికో పోతోంది...! అది చాలా భయంకరమైన వ్యవస్థ.. ఇళ్లల్లోకి దూరుతున్నారు..! అవి ఊడిగం ఉద్యోగాలంటూ వలంటీర్ల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏపీలో మహిళల కిడ్నాప్‌లకు సంబంధించి తనకు కేంద్ర నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందని పవన్ చెబుతుండగా.. అదే నిజమైతే అలాంటి కీలక వివరాలను ఓ రాజకీయ నేతకు నిఘా వర్గాలు అందిస్తాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్ట్ సమకూర్చింది ఈనాడు రామోజీ కాగా చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్ యాక్టింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

- గత అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ పోటీ చేసిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పొంగుటూరులో వలంటీర్లు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు.
- ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీలో వలంటీర్లు షెహనాజ్, అశ్విని, లక్ష్మి, ఠాగూర్, దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా పాల్గొని సంఘీభావం తెలిపారు.
- విజయనగరం జిల్లా చీపురుపల్లిలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించి పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్ల, జామి మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.
- శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పవన్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టారు. కొత్తూరు తదితర చోట్ల పవన్ చిత్రపటాన్ని దహనం చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంతో పాటు మామిడికుదురు మండలం నగరం, రాయవరం మండలం పసలపూడిలో పవన్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అనపర్తి దేవీచౌక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో పవన్ చిత్ర పటాలకు నిప్పు అంటించారు.
- కరప మండలంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, నిరసన తెలిపారు.
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వాటర్ ట్యాంకు జంక్షను వద్ద పవన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.
- విశాఖ తాటిచెట్లపాలెం జంక్షన్ జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో పవన్‌పై వలంటీర్లు ఫిర్యాదు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు వలంటీర్లకు సంఘీభావం తెలిపారు. భీమిలిలో ర్యాలీ చేపట్టి పవన్ దిష్టిబొమ్మని దహనం చేశారు. గాజువాక, పెందుర్తి, మల్కాపురం జంక్షన్ల వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. అనకాపల్లిలో కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రాలు అందించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది ప్రాంతాల్లో వలంటీర్లు ఆందోళనలు నిర్వహించారు. పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.
- ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలు దగ్ధం చేసి మానవ హారాలు నిర్వహించారు. పెనమలూరు కామయ్యతోపు సెంటర్‌లో వలంటీర్ల సమాఖ్య అధ్యక్షుడు సమీర్ అహ్మద్ షాజాద్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.
- పవన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా గుడ్లూరు, ప్రకాశం జిల్లా మార్కాపురంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దగదర్తి, బిట్రగుంటలో వలంటీర్లు ప్రజాప్రతినిధులతో కలిసి పవన్ ఫొటోలకు నిప్పు అంటించారు. ఒంగోలులో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు. చీమకుర్తి, పొన్నలూరు, పెద్ద దోర్నాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా పలుచోట్ల పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. భట్టిప్రోలు, చెరుకుపల్లి, పర్చూరు, చీరాల, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారులపై దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహిళా వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మలను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉరవకొండ, బెళుగుప్ప, కనగానపల్లి, రామగిరి పోలీసుస్టేషన్లలో పవన్‌పై ఫిర్యాదు చేశారు. పుట్లూరు, గుత్తిలో నిరసన వ్యక్తం చేశారు. రాయదుర్గం, సోమందేపల్లి, ఆత్మకూరు, పరిగి, కళ్యాణదుర్గంలో పవన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పవన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం, పాత బస్టాండ్ వద్ద వలంటీర్లు నిరసన తెలిపారు. పత్తికొండలో పవన్‌పై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బనగానపల్లెలో దిష్టిబొమ్మ దహనం చేశారు.
- కడపలోని ఏడు రోడ్ల సర్కిల్ వద్ద పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. పులివెందుల, అన్నమయ్య జిల్లా రామసముద్రంలో నిరసన రేగాయి. ప్రొద్దుటూరులో పవన్ పై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నిరసనలు భగ్గుమన్నాయి. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి.
- చింతలపూడిలో వలంటీర్లు పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఈ కార్యక్రమంలో వలంటీర్లతో కలిసి పాల్గొన్నారు. ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పవన్‌కళ్యాణ్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. ఏలూరు, దెందులూరు, నూజివీడు, చింతలపూడి, ఉండి, తాడేపల్లిగూడెం, నర్సాపురం, పాలకొల్లు, ఆచంట తదితర నియోజకవర్గాల్లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మలను దహనం చేసి చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు.

రూ.5 వేలకు ఊడిగం చేసే ఉద్యోగం 'వలంటీరు'

- సున్నితమైన సమాచారాన్ని వలంటీర్లు సేకరిస్తున్నారు
- ప్రజలను అదుపు చేయడానికే ఈ వ్యవస్థ.. ఇది చాలా భయంకరమైనది
- వితంతువులు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి
- ఏలూరు జనసేన వీర మహిళల సమావేశంలో పవన్‌కళ్యాణ్



సాక్షి ప్రతినిధి, ఏలూరు : 'వలంటీరు పోస్టు అనేది రూ.ఐదు వేలకు ఊడిగం చేసే ఉద్యోగం. ఐదు లక్షల మంది వలంటీర్లకు ప్రజల డబ్బుతో జీతం ఇస్తున్నారు. వలంటీర్లు ప్రభుత్వోద్యోగులు కానప్పుడు.. ప్రభుత్వంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో అసలు పనేముంది?'.. అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీరు వ్యవస్థపై మరోసారి నోరుపారేసుకున్నారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, వీర మహిళల సమావేశంలో పవన్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

జనసైనికులు అవసరమైతే వలంటీర్లను నిలదీయాలి. ఏపీలో ఎంతమంది అమ్మాయిలు మిస్సవుతున్నారో ఆ డేటా మీ దగ్గర ఉందా అని, నిఘా వర్గాల్లో ముఖ్యులు నన్ను అడిగితే నా మతి పోయింది. ప్రతి గ్రామంలో పదిమంది యువకులు వలంటీర్ల పేరుతో ఇంటింటికీ తిరుగుతూ సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలున్నాయా.. వితంతు మహిళలున్నారా, భర్తలు బయటకు వెళ్లాక భార్యలు ఏం చేస్తున్నారు? ఇలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ పెట్టిన మొదట్లో జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ బలోపేతానికి అని అనుకున్నాం. కానీ, ఇది చాలాచాలా భయంకరమైన వ్యవస్థగా మారిపోయింది. ఇది అందరి వలంటీర్ల గురించి కాదు.. కొందరి గురించే. అయితే, డేటా మాత్రం కచ్చితంగా వెళ్తోంది. వలంటీర్లు తప్పుచేస్తే ఎవరికి చెప్పాలి. వారేమో ప్రభుత్వోద్యోగులు కాదంటారు. వలంటీర్లు ఇబ్బంది పెడుతుంటే టోల్‌ఫ్రీ నంబర్ ఉండాలి. ఇక రేషన్ డీలర్ల వ్యవస్థను చంపేసి 10 వేల వ్యాన్లు ఇచ్చారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణలేదు. వితంతు మహిళలు, ఒంటరి మహిళలు జాగ్రత్తగా ఉండాలి.

జనశ్రేణుల అత్యుత్సాహం.. అద్దాలు ధ్వంసం

ఏలూరులోని క్రాంతి కళ్యాణమండపంలో సోమవారం జనవాణి, కార్యకర్తలు, వీరమహిళల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్కువ పాసులు ఇచ్చి తక్కువ మందిని అనుమతించారు. దీంతో జనసేన కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించడంతో మండపం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇంత జరుగుతున్నా నాయకులెవరూ స్పందించలేదు.

ఇంతకీ ఏలూరు సభలో పవన్ ఏమన్నారంటే..

ఏపీ నుంచి 30 వేల మంది మిస్సయ్యారు.. నాకు ఎలా తెలిసింది.. కేంద్రం నిఘా వర్గాలు నాకు తెలిపాయి. నేషనల్ క్రైమ్ రిపోర్టు ప్రకారం.. 14 వేల మంది తిరిగొచ్చారని చెబుతున్నారు. మిగిలిన 18 వేల మంది ఎక్కడికి వెళ్లారు. దీనిపై దృష్టి పెట్టావా జగన్ నువ్వు. ఒక్క రివ్యూ మీటింగ్ కూడా ఎందుకు పెట్టలేదు. డీజీపీని అడుగుతున్నా.. ఎందుకు ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదు. ప్రతి ఊరిలో 18 వేల మంది అమ్మాయిలు ఇంటికి రాలేదంటే వైసీపీ వలంటీర్ స్కీమ్‌ను పెట్టారు ప్రతి ఊరిలో.. గ్రామంలో ఎవరు ఎవరి మనిషి, ఏ కుటుంబంలో ఎంతమంది ఉంటారు.. ఏ కుటుంబంలో ఆడపిల్లలు అక్కడ ఏమేమి ఉన్నాయి వాళ్లకి.. వాళ్లు ఎవరినైనా అబ్బాయిలను ప్రేమిస్తున్నారా, వాళ్లలో వితంతువులెవరైనా ఉన్నారా.. ఇట్లా ట్రాప్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతా ఉంది వీళ్ల ఇన్ఫర్మేషన్‌వల్ల. నేను మీడియాకు కూడా చెబుతున్నా, దయచేసి శోధించండి. నాకు కేంద్రం నిఘా వర్గాలు హెచ్చరించింది చెబుతున్నాను. ప్రతి గ్రామ వలంటీరు ఈ పార్టీలో ఈ గ్రామంలో ఎంతమంది ఉన్నారు.. ఎన్ని ఇళ్లు ఉన్నాయి? దీంట్లో ఎంతమంది ఆడవాళ్లు, ఎంతమంది మగవాళ్లు? ఎవరు ఏ పార్టీ, ఎవరిలో ఏ లోపాలు ఉన్నాయి.. ఎవరికి ఏ అలవాట్లున్నాయి? ఇవన్నీ చేసి.. దాంట్లో ఒంటరి మహిళలను వీళ్ల టార్గెట్ చేసి ఆ సమాచారాన్ని సంఘవిద్రోహ శక్తులకిస్తే వాళ్లు వీళ్లని కిడ్నాప్ చేయడంగానీ, ట్రాప్ చేయడంగానీ జరిగి ఇంతమంది మిస్సైపోయారు. ఇందులో వైసీపీ ప్రభుత్వంలోని చాలామంది పెద్దల హస్తం ఉంది. ఈ విషయం నాకు కేంద్ర నిఘా వర్గాలు చెప్పి ఏపీ ప్రజలకు చెప్పమన్నారు. అందుకే మీకు చెప్పాను. జగన్ ఇంతమంది ఉసురు తీసుకుంటున్నావు, నీకు ఉంటుంది చూడు..

- పవన్ కళ్యాణ్ ఆరోపణలు నిరాధారం
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వక్రీకరించి తప్పుడు ఆరోపణలు
- మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు
- ఒక్క వలంటీర్‌పైనా కేసు నమోదు కాలేదు
- ప్రజలకు సేవలు అందిస్తున్న వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయొద్దన్న పోలీసు శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారని, అందుకు వలంటీర్లే కారణమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే ప్రయత్నించారని ఓ ప్రకటనలో పేర్కొంది. మహిళల భద్రతకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోందని, రాష్ట్రంలో వారికి సంపూర్ణ రక్షణ లభిస్తోందని తెలిపింది. దిశ వ్యవస్థ, జీరో ఎఫ్ఐఆర్ లాంటి సంస్కరణలతో దేశంలోనే మహిళా భద్రతలో ఆంధ్ర ప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేసింది. 2019–21 మధ్య రాష్ట్రంలో 30 వేల మంది మహిళల అదృశ్యం కేసులు నమోదు కాగా 14 వేల మంది ఆచూకీ మాత్రమే కనుగొన్నట్లు పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని పేర్కొంది. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ఇంట్లో ఘర్షణలు, మానసిక రుగ్మతలు తదితర కారణాలతో ఆచూకీ తెలియని కేసులన్నింటినీ పోలీసులు మిస్సింగ్ కేసులుగానే నమోదు చేస్తారు.

'అదృశ్యం' అవాస్తవం!

2015-21 మధ్య రాష్ట్రంలో మహిళల అదృశ్యం కేసులు

ఏడాది	గతేడాది ఆచూకీ దొరకనివారు	ఈ ఏడాది అదృశ్యమైనవారు	మొత్తం అదృశ్యమైనవారు	ఆచూకీ కనుగొన్నవారు	ఆచూకీ లభించనివారు
2015	2,243	4,622	6,865	4,359	2,506
2016	2,506	4,454	6,865	4,359	2,990
2017	2,990	5,225	8,215	6,423	1,792
2018	1,792	5,792	7,584	6,042	1,542
ఈ ప్రభుత్వం వచ్చాక..					
2019	1,542	6,896	8,438	6,583	1,855
2020	1,855	7,576	9,431	7,195	2,236
2021	2,242	10,085	12,327	9,616	2,711

ఆచూకీ గుర్తించి సురక్షితంగా..

2019–21 మధ్య అదృశ్యమైన మహిళలు మొత్తం 24,557 మంది. 2019కు ముందు అదృశ్యమై ఆచూకీ లభించని మహిళలు 1,542 మంది. మొత్తం మీద 2021 నాటికి అదృశ్యమైన మహిళల సంఖ్య 26,099. వీరిలో 2021 డిసెంబర్ నాటికి 23,394 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. మిగిలిన 2,705 మందిలో 500 మంది ఆచూకీని 2022–23లో కనుగొని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు.

అన్ని కేసులు హ్యూమన్ ట్రాఫికింగ్ కాదు

18 ఏళ్ల లోపు బాలికలు ప్రేమ సంబంధ వ్యవహారాలతో ఇల్లు విడిచి వెళ్లిపోతే పోక్సో చట్టం కింద, మానవ అక్రమ రవాణా అయితే ఆ చట్టం కింద కేసు నమోదు చేస్తారు. అంతేగానీ కనిపించకుండా పోయిన మహిళలు అందరూ హ్యూమన్ ట్రాఫికింగ్‌కు గురైనట్లు కాదు. ఉపాధి పేరుతో మహిళలను మోసగించి ఇతర దేశాలకు పంపడం, డబ్బు ఆశ చూపి వ్యభిచార వృత్తిలోకి దించడం లాంటి వాటినే హ్యూమన్ ట్రాఫికింగ్‌గా పరిగణిస్తారు. అదృశ్యం, హ్యూమన్ ట్రాఫికింగ్ అనేవి వేర్వేరుగా చూడాలి. రెండింటినీ ఒకే గాటన కట్టేసి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు.

ఒక్క వలంటీర్‌పైనా కేసులు లేవు

హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా)కు పాల్పడినట్లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క వలంటీర్‌పైనా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. స్వచ్ఛంద సేవలో నిమగ్నమైన లక్షలాది మంది వలంటీర్లను కించపరుస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం గర్హనీయం. అసంబద్ధ ఆరోపణల ద్వారా సమాజంలో అలజడులు, శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలను సమర్థంగా తిప్పికొడతామని పోలీసు శాఖ స్పష్టం చేసింది.

నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లను చెడ్డవారిగా చిత్రీకరిస్తారా?

- తక్షణం పవన్ వారికి క్షమాపణ చెప్పాలి
- దమ్ముంటే వలంటీర్ల వ్యవస్థ రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాలి
- పవన్ చెప్పింది ఎన్సీఆర్బీ లెక్కలు కాదు.. నారా చంద్రబాబు లెక్కలు
- బాబు హయాంలో 16,765 మంది మిస్సింగ్.. ఏనాడైనా ప్రశ్నించావా?
- మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు భయంతో చలిజ్వరం పట్టుకుందని, ఇద్దరూ గజగజ వణుకుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'సీఎం జగన్‌ని ఏమీ చేయలేకపోతున్నారనే దుగ్ధతోనే చౌకబారు ఆరోపణలు చేస్తున్నారు. సీఎం జగన్ బలం పారదర్శకమైన పరిపాలన, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ. రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లు ప్రజలకు, ప్రత్యేకించి పేద, బలహీన వర్గాలకు ఎనలేని సేవ చేస్తున్నారు. వలంటీర్లలో సగానికి పైగా మహిళలే. నిస్వార్థంగా పని చేస్తున్న వలంటీర్లను చెడ్డవారిగా చిత్రీకరించడం ధర్మమా? ఇది రాజకీయ నీతా? తక్షణం పవన్ వారికి క్షమాపణ చెప్పాలి. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. దమ్ముంటే.. వారు అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ రద్దు చేసి జన్మభూమి కమిటీలను తెస్తామని మేనిఫెస్టోలో పెట్టాలి' అని సవాల్ విసిరారు. పవన్ తల్లి, భార్య, పిల్లల గురించి తమ పార్టీ ఏ రోజూ పల్లెత్తు మాట అనలేదని పేర్ని నాని చెప్పారు. కొల్లేరు విషతుల్యం అవుతుంటే మీ ప్రభుత్వంలో ఏం చేశావని పవన్‌ను ప్రశ్నించారు. జీవోలు బయటపెడితే కోర్టులకెళ్లి స్టేలు తెస్తారా అని అన్నారు. చంద్రబాబు నిధులు మళ్లిస్తే పవన్ నోరేమైందని నిలదీశారు. సీఎం జగన్‌ని ఏకవచనంతో పిలిస్తే తాము పవన్‌ని అనేక వచనాలతో పిలవగలమని చెప్పారు.

పవన్ చెప్పింది ఎన్సీఆర్బీ లెక్కలు కాదు.. ఎన్సీబీ లెక్కలు

రాష్ట్రంలో 30 వేల మంది ఒంటరి మహిళలు అదృశ్యమైనట్లు ఎన్సీబీ నుంచి వచ్చిందని పవన్ చెప్పారని, అది నిజమేనని, ఆ లెక్క ఆయనకు ఎన్సీబీ.. అంటే నారా చంద్రబాబునాయుడి నుంచే వచ్చిందన్నారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) లెక్కలు చేబితే పవన్ కరెక్టుగానే చెప్పేవారని, కానీ నారా చంద్రబాబు ఇచ్చిన లెక్కలు చెప్పారన్నారు. ఆయన 2 లక్షల పుస్తకాలు చదివానని చెబుతున్న లెక్క, ఈ 30 వేల లెక్క ఒకటేనన్నారు. చంద్రబాబు ఇచ్చే తప్పుడు లెక్కలతో సీఎం జగన్‌పై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. సాధారణంగా ప్రేమ వ్యవహారంలో లేదా పెళ్లి మీద పెళ్లి చేసుకునే వాడు అమ్మాయిల్ని మోసం చేసి తల్లిదండ్రులకు తెలియకుండా తీసుకెళ్తారన్నారు. బాబు హయాంలో 16,765 మంది కనిపించకుండా పోతే పవన్ ఏనాడైనా ప్రశ్నించారా అని నిలదీశారు. ఎవరి ప్రభుత్వంలో ఎన్ని కేసులు నమోదయ్యాయో తెలుసుకోవాలని చెప్పారు. ప్రెస్‌మీట్లు పెట్టి ఏదంటే అది మాట్లాడి పారిపోకుండా విలేకరులు డొక్క తీస్తుండటంతో కార్యకర్తలను పోగేసి చెప్పదలుచుకుంది చెప్పి, దాన్నే రికార్డు చేసేసి మీడియాకు పంపేస్తున్నారని చెప్పారు. ఇలాంటి పవన్ సీఎం జగన్ ప్రెస్‌మీట్ పెట్టలేదని అంటున్నారని మండిపడ్డారు. లెక్కలు కనిపించడంలేదని కాగ్ చెప్పిందని ఎవరన్నారని ప్రశ్నించారు.

పవన్‌ది సైకోయిజం

- వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్



సాక్షి, అమరావతి: పవన్ కళ్యాణ్‌ది సైకోయిజం, శాడిజమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ నందిగం సురేష్ విమర్శించారు. పవన్ వీధి కుక్కలా తయారయ్యారని, చాలా ప్రమాదకరమైన వ్యక్తి అని మండిపడ్డారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు రెండు చోట్ల ఓడించినా పవన్‌కు బుద్ధి రాలేదన్నారు. టీడీపీ ఆఫీస్ బాయ్‌లా పని చేస్తున్నారని, బిస్కెట్ల కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వలంటీర్లలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారని, పవన్ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని చెప్పారు. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే వలంటీర్ల సత్తా ఏమిటో చూపిస్తారని హెచ్చరించారు. 2024 తర్వాత పవన్ అడ్రస్ లేకుండా పోతారని చెప్పారు. ఒక రాజకీయ సిద్ధాంతం, లక్ష్యం లేకుండా వారాహి యాత్ర పేరుతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పవన్, బాబు పాలనలో చేసిన అప్పులకు లెక్కెక్కడని ప్రశ్నించారు. సీఎం జగన్ చేసే ప్రతి అప్పునకు, ప్రతి పైసాకి లెక్కా పత్రం ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఒక్క పోర్టు, ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించారా అని నిలదీశారు. ఆనాడు వారిద్దరూ కాపులను బీసీల్లో కలుపుతామని మోసం చేశారన్నారు. అధికంగా ఉన్న కాపు ఓటర్లు 2019లో కసితో సీఎం జగన్‌కి ఓట్లేస్తారని భయపడి కుయుక్తులతో విడివిడిగా పోటీచేశారని, చివరి ఆరు నెలలు చంద్రబాబుకు లబ్ధి చేకూరేలా పవన్ నడుచుకున్నారని అన్నారు. కాపులు ఇది పసిగట్టి, జగన్‌కి అండగా నిలిచారని తెలిపారు. పవన్ మళ్లీ ఇప్పుడు కులాల కుంపట్లు పెడుతూ సర్కస్‌లు చేస్తున్నారన్నారు.

దమ్ముంటే వలంటీర్ల వ్యవస్థ రద్దు చేస్తామని చెప్ప

- పవన్ కళ్యాణ్‌పై మంత్రి అమర్‌నాథ్ మండిపాటు
- హైదరాబాద్‌లో ఎంజాయ్ స్టార్, ఏపీలో గంజాయి స్టార్‌గా పవన్



సాక్షి, విశాఖపట్నం: ప్రజా రక్షణకు భరోసా కల్పిస్తూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంటరి మహిళలు మిస్సింగ్‌కు కారణం వలంటీర్లు అంటూ మహిళల భద్రతకు భంగం కలిగేలా పవన్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు. పవన్‌కు, ఆయన గురువు చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తామని, సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని చెప్పి ఎన్నికలకు వెళ్లగలరా? అని ప్రశ్నించారు. ఏలూరులో పవన్ ప్రసంగం వింటే ఓ తిరుగుబోతు సంసారం గురించి నీతులు బోధించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పవన్ వ్యాఖ్యలు ఆయన కిరాయి కార్యకర్తలకు, సైకో ఫ్యాన్స్‌కు నచ్చొచ్చేమో కానీ ప్రజలు ఛీకొడతారన్నారు. హైదరాబాద్‌లో ఎంజాయి చేస్తూ.. ఎంజాయ్ స్టార్‌గా.. అక్కడ నుంచి మత్తు పదార్థాలు, గంజాయి తెచ్చుకుంటూ ఏపీలో గంజాయి స్టార్‌గా పవన్ మారుతున్నాడని విమర్శించారు. ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో) నివేదిక ప్రకారం చూస్తే పవన్ మాటల్లో నిజం లేదన్నారు. అవి చంద్రబాబు లెక్కలన్నారు. కనిపిస్తే ఎక్కడ తాళికడతాడో అని పవన్‌ను చూసి ఆడపిల్లలు భయపడుతున్నారని చెప్పారు. పవన్ తల్లిని, భార్యను వైఎస్సార్‌సీపీ నేతలు పల్లెత్తు మాట కూడా అనలేదని, వారిని టీడీపీ నేతలు అవమానించినా, వారి అనుకూల పత్రికల్లో వార్తలు రాయించినా ఏమీ అనలేకపోయారన్నారు. ఐఏఎస్‌ల ట్రైనింగ్‌లో ఏపీ వలంటీర్ల వ్యవస్థ గురించి చెప్పుకుంటున్నారన్నారు.

పవన్‌పై కేసు నమోదు చేయాలి

డీజీపీకి ఎమ్మెల్సీ పోతుల సునీత వినతి



డీజీపీకి వినతిపత్రం అందిస్తున్న సునీత తదితరులు

సాక్షి, అమరావతి: ప్రజలకు మేలు చేస్తున్న వలంటీర్లను తప్పుడు ఆరోపణలతో కించపరిచిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వలంటీర్లలో ఎక్కువ భాగం మహిళలు ఉన్నారన్నారు. వారిలో ఒక రకమైన భయాందోళనలు కలిగించడమే కాకుండా విద్వేష పూరిత ప్రసంగాలతో ప్రజల మధ్య, ముఖ్యంగా మహిళల్లో కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. జనసేన పార్టీ రాజకీయ ప్రయోజనాలు ఆశించి తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. పవన్ పర్యటించి వెళ్లిన ప్రాంతాల్లో వివిధ కులాలు, వర్గాలు ఘర్షణలకు దిగే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. పవన్‌కల్యాణ్ వెంటనే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మహిళా నేతలు ఉన్నారు.

అంబేడ్కర్ సాక్షిగా పవన్ పచ్చి అబద్ధాలు

- పవిత్రమైన వలంటీర్ల పట్ల దారుణంగా మాట్లాడటం సిగ్గుచేటు
- వలంటీర్లకు కుటుంబాలు లేవా?.. వారు బాధపడరా?
- తుపాకుల సంస్కృతి వారిదే
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు టౌన్: అంబేడ్కర్ సాక్షిగా పవన్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మండిపడ్డారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థపై అవగాహన లేకుండా పవన్ నిస్సిగ్గుగా ఆరోపణలు చేశారని చెప్పారు. చంద్రబాబు హయాంలో పింఛను సహా ఏది కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వాల్సిన దుస్థితి ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్ పెట్టిన వలంటీర్లు నిస్వార్థంగా ప్రజలకు విశేష సేవలందిస్తున్నారని చెప్పారు. కోవిడ్ సమయంలో పవన్, చంద్రబాబు ఫామ్‌హౌస్‌లలో పడుకుంటే, వలంటీర్లు ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి సేవలందించారని తెలిపారు. అలాంటి పవిత్రమైన వలంటీర్ల పట్ల అత్యంత దారుణంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వలంటీర్లకు కుటుంబాలు లేవా.. వారు ఎంత బాధపడతారో తెలుసా అని నిలదీశారు. పాదయాత్ర చేస్తానని ప్రకటించిన పవన్.. నడిస్తే కమిలిపోతానని, సినిమా చాన్సులు రావేమోననే భయంతో కుంటిసాకులు చెప్పి తప్పించుకున్నారన్నారు. ఇలాంటి పవన్‌కు, 3,500 కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల సమస్యలన్నీ అవగాహన చేసుకుని, 99 శాతం పైగా హామీలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌తో ఏమైనా పోలిక ఉందా అని ప్రశ్నించారు. ప్రతి సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గద్దె దించాలంటున్న పవన్.. ఎవరిని సీఎంని చేస్తారో చెప్పాలని సవాల్ చేశారు. తుపాకుల సంస్కృతి వారిదేనని, వాళ్ల దగ్గర తుపాకులు ఉన్నాయని వారే చెప్పారని అన్నారు. వారి కుటుంబ సభ్యులు భయంతో పోలీసులకు చెబితే వెళ్లి తుపాకులు అప్పగించారు తప్ప మీవి క్రిమినల్ ఆలోచనలు పవన్ అని విరుచుకుపడ్డారు. పవన్ తీరు ఇలాగే సాగితే ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వరని, వారాహి యాత్రను కూడా అడ్డుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఏలూరు ప్రజలను అంతుచిక్కని వ్యాధి నుంచి కాపాడిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. ఏలూరు ప్రజలకు గోదావరి జలాలు అందించేందుకు రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రూ.525 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే..

- వలంటీర్ల విషయంలో పవన్ వ్యాఖ్యలపై నేతల మండిపాటు
- సేవలందిస్తున్న వలంటీర్లను కించపరుస్తారా?
- చంద్రబాబు స్క్రిప్టు ప్రకారమే పవన్ విమర్శలు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: ఒంటరి మహిళలను వలంటీర్లు ట్రాప్ చేసి, హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ కళ్యాణ్ ఏలూరు సభలో చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేతలు, పలువురు మంత్రులు మండిపడ్డారు. ఏ స్వార్థం లేకుండా సేవలందిస్తున్న వారిపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. జనసేన అధినేత వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చేదోడుగా ఉంటూ, ప్రభుత్వ పథకాలు ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్న వలంటీర్లను విమర్శిస్తే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. వలంటీర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన పవన్‌పై కేసు నమోదు చేయాలన్నారు. చంద్రబాబు స్క్రిప్టునే పవన్ చదువుతున్నారని, గతంలో చంద్రబాబు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు.

తప్పుగా మాట్లాడేవారికి బుద్ధిచెప్పాలి



ప్రజలకు నాలుగేళ్లుగా ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను కించపరిచేలా పవన్ కళ్యాణ్ మాట్లాడటం తగదు. రాజకీయమంటే సేవలందించాలే తప్ప తప్పుడు ఆరోపణలు చేయడం సబబుకాదు. గ్రామానికి చెందిన మన పిల్లలే వలంటీర్లుగా సేవలందిస్తుంటే.. ఆడ పిల్లలను ఆ వలంటీర్లు ఎత్తుకుపోతున్నారంటూ మాట్లాడటం సరికాదు. మన పిల్లల గురించి తప్పుగా మాట్లాడే వారికి తగిన బుద్ధిచెప్పడం మనందరి బాధ్యత.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

పవన్ పతనం మొదలైంది



వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన విమర్శలకు తక్షణమే క్షమాపణలు చెప్పాలి. నిస్వార్థంగా సేవలు చేస్తున్న వారిపై చేసిన ఆరోపణలతోనే పవన్, ఆయనకు మద్దతిస్తున్న టీడీపీ పతనం ప్రారంభమైంది. వలంటీర్ల దెబ్బ రుచి ఏమిటో ఇకపై పవన్ చూడనున్నాడు. చంద్రబాబు రాసిఇచ్చిందే పవన్ చదివే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు. పవన్‌కు మహిళల పట్ల ఉన్న ఉద్దేశం ఆయన మాటల్లో అర్థమైంది. ఆయన బారిన పడిన మహిళలు ఎంతమంది ఉన్నారో మొదట తెలుసుకోవాలి.

– చెల్లుబోయిన వేణు, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి

ఆడవాళ్లని ట్రాప్ చేసేది పవనే



ఆడవాళ్లను ట్రాప్ చేయడం.. వాళ్లను పెళ్లిళ్లు చేసుకోవడం, వదిలేయడం కేవలం పవన్ కళ్యాణ్‌కు మాత్రమే తెలుసు. తను చేసినట్టే వలంటీర్లు చేస్తున్నారనే భ్రమలో పవన్ ఉన్నాడు. ఎవరికి ఏ వృత్తిపై మక్కువ ఉంటుందో.. ఆ వృత్తిలో వారికి బాగా అనుభవం ఉంటుంది. వలంటీర్లను వృద్ధులు, లబ్ధిదారులు తమ సొంతబిడ్డగా చూసుకుంటున్నారు. ఎవరు ఏ పథకానికి అర్హులో గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

పవన్ చౌకబారు ఆరోపణలు



ప్రజలతో మమేకమైన వలంటీర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పవన్‌కళ్యాణ్ చౌకబారు ఆరోపణలు చేయడం దుర్మార్గం. చంద్రబాబు చెప్పినట్టు నడుచుకుంటున్న పవన్.. అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడటం మంచిదికాదు. ఉమెన్ ట్రాఫికింగ్ విషయంలో వలంటీర్లపై నిందలు వేయడం తగదన్నారు. ప్రభుత్వం చేపట్టిన నిఘా, తీసుకున్న నిర్ణయాలు, పోలీసుల పనితీరుతో కేసులు తగ్గిపోయాయి. పవన్‌కు ధైర్యం ఉంటే వలంటీర్ల వ్యవస్థను తీసి వేస్తాననే ప్రకటించాలి.

– మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ

బురద రాజకీయం చేయొద్దు



జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బురద రాజకీయాలు చేస్తున్నారు. మహిళల అదృశ్యం వెనుక వలంటీర్లు ఉన్నారంటూ ఆరోపించడం దుర్మార్గం. కేంద్ర నిఘా వర్గాల ద్వారా తనకు సమాచారం వస్తోందని పవన్ చెబుతున్నారు. అలాంటి సమాచారాన్ని అతనికి చేరవేస్తున్న కేంద్ర నిఘా అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలను పత్రికా ముఖంగా కోరుతున్నా. పోలీసులు సుమోటోగా పవన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.

– సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

గడ్డితినేవారే వలంటీర్లపై అభాండాలు వేస్తారు



గడ్డితిన్నవాళ్లే వలంటీర్ల సేవలపై అభాండాలు వేస్తున్నారు. కరోనా వంటి కష్టకాలంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి విశేష సేవలు అందించారు. వాళ్లే లేకపోతే రాష్ట్రంలో నాలుగో వంతు ఖాళీ అయిపోయేది. సేవలు చేస్తున్న వలంటీర్లపై ఇష్టానుసారం మాట్లాడటం తగదు. నాదెండ్ల మనోహర్‌తో చంద్రబాబు అందించే స్క్రిప్టునే పవన్ పలుకుతున్నారు.

– దాడిశెట్టి రాజా, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి

పవన్ ఓ గ్రామానికి వెళ్లి చూడు



కరోనా సమయంలో అడుగు బయటపెట్టడానికి ప్రజలు భయపడుతున్నప్పుడు ప్రాణాలకు తెగించి సేవలు చేసిన వలంటీర్ల త్యాగం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. భవిష్యత్‌లో ప్రతి రాష్ట్రం వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం ఖాయం. వలంటీర్ల సేవల గురించి తెలియకపోతే ఒక గ్రామానికి వెళ్లి తెలుసుకోవాలి. తప్పుడు మాటలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పడం విజ్ఞత అనిపించుకుంటుంది.

– కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

బాబు నాటకంలో పాత్రధారి పవన్



చంద్రబాబు నాటకంలో పాత్రధారిగా మారిపోయిన పవన్ కళ్యాణ్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. పవన్ ఎప్పటికీ నటుడే, రాజకీయ నాయకుడు కాలేడు. ఏపీ ప్రజలు తనను నమ్మరనే ఉక్రోషంతోనే వలంటీర్లు, మహిళలపై పవన్ అసభ్యకరంగా మాట్లాడినట్లు అర్థమవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్లను కించపరిచేలా మాట్లాడటానికి పవన్‌కు నోరెలా వచ్చింది. చంద్రబాబు హయాంలో మహిళలపై జరిగిన అకృత్యాలు కనిపించలేదా?

– అడపా శేషు, కాపు కార్పొరేషన్ చైర్మన్

దిశ చట్టం ప్రకారం అరెస్ట్ చేయాలి



మహిళలపై, వివాహ వ్యవస్థపై గౌరవం లేని మూర్ఖుడు పవన్. వివాహ వ్యవస్థకు భిన్న భాష్యం చెప్పే వ్యక్తి. మహిళల పట్ల నీచంగా మాట్లాడి కించపరుస్తున్న ఆయనపై దిశ చట్టం అమలుచేసి అరెస్ట్ చేయాలి. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు. అలాంటి వారిపై పిచ్చిపట్టిన వాడిలా మాట్లాడితే ప్రజలే పవన్‌కు తగిన గుణపాఠం చెప్తారు. గతంలో చంద్రబాబు కూడా వలంటీర్ల వ్యవస్థపై విమర్శలు చేసి తర్వాత ప్లేట్ మార్చారు. వలంటీరు వ్యవస్థను అర్థం చేసుకోవడంలో విఫలమైన మరొక మూర్ఖుడు పవన్ ఇంకా దిగజారుడు తనాన్ని ప్రదర్శిస్తున్నాడు. వారినిమహిళలు ఏ విధంగా క్షమిస్తారు?.

– ఆదిమూలపు సురేష్, రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి

కావాలని నిందలు వేస్తారా?



ఉమెన్ ట్రాఫికింగ్ విషయంలో పవన్ మాటలు అర్థరహితం. కావాలని నిందలు వేయడం తగదు. అవగాహనాలోపంతో మాట్లాడిన వ్యాఖ్యలపై కనీసం విచారమైనా పవన్ వ్యక్తం చేయాలి.

– పిల్లి సుభాష్ చంద్రబోస్, రాజ్యసభ సభ్యుడు

ఉన్మాదిలా మాట్లాడుతున్న పవన్



పవన్ కళ్యాణ్ ఉన్మాదిలా మాట్లాడుతున్నాడు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్ వ్యవస్థకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు వస్తుంటే మింగుడుపడటం లేదా?.

– శంకర్ నాయక్, ఎస్టీ కమిషన్ సభ్యుడు

వారియర్స్ వంటి వారిని అవమానిస్తావా



ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించడంలో వారియర్స్‌లా పని చేస్తున్న వలంటీర్లను అవమానించేలా మాట్లాడిన పవన్ తక్షణం వారికి క్షమాపణ చెప్పాలి. ఆధారాలు లేకుండా అబద్ధాలు చెప్పడం పవన్‌కు మంచిది కాదు.

– స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

నల్లతీగే జీవనాధారం

అటవీ ప్రాంతంలో చెట్లపైకి పాకే, పొదల్లో ఉండే నల్లతీగ సేకరణే నాయక్‌పోడు గిరిజనులకు జీవనాధారం. నల్లతీగ సేకరణ చాలా ప్రమాదంతో కూడుకున్నది. దట్టమైన అడవిలో క్రూరమృగాలకు చిక్కకుండా, విష సర్పాలను తప్పించుకుంటూ ఎంతో నేర్పుతో వ్యవహరించాలి. తీగ సేకరణలో అనేక మంది కళ్లు కూడా పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. అలాగే పాము కాటుకు గురైన వారు కూడా ఉన్నారు. ప్రమాదాల మాటున కష్టపడి సేకరించిన తీగను విక్రయిస్తే రోజుకు రూ.300 వస్తాయని నాయక్ పోడు గిరిజనులు చెబుతున్నారు. తీగ సేకరణపై వారు పడే శ్రమ, జీవనశైలిని తెలుసుకుందాం.

అడవిలో ప్రమాదాల మాటున నల్లతీగ సేకరణ

- నాయక్ పోడు గిరిజనులకు ఇదే జీవనాధారం
- చేపలు పట్టే మావుల తయారీకి వినియోగం



అడవిలో నల్లతీగ సేకరిస్తున్న గిరిజన మహిళలు

బుట్టాయగూడెం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం మండలంలోని లక్ష్మీపురం.. కొవ్వాడ ప్రాజెక్టు ముంపు పునరావాస గ్రామం. ఇక్కడ సుమారు 50 కుటుంబాలకు చెందిన నాయక్‌పోడు గిరిజనులు జీవిస్తున్నారు. వీరిలో 30 కుటుంబాలకు చెందిన వారు అడవిలో లభించే నల్లతీగ, చింతపండు, కుంకుళ్లు, వేప గింజలు వంటి ఉత్పత్తులను సేకరించి వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. నల్లతీగ సేకరణ కోసం సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వరకు అడవి వెంబడి కాలి నడకన నడుచుకుంటూ వెళ్లి పొదల్లో ఉన్న నల్ల తీగలను సేకరించి కట్టలుగా కట్టుకుని తలపై పెట్టుకుని ఇళ్లకు తీసుకువచ్చి చుట్టలుగా చుట్టి వ్యాపారులకు విక్రయిస్తారు.

రోజుకు రూ.500 మిగులు

అటవీ ప్రాంతంలో నల్ల తీగలను ఒక్కొక్కరూ 20 కట్టల వరకు సేకరిస్తారు. ఈ తీగలను ఇంటి వద్ద చిన్నసైజు కట్టలుగా చుట్టి ఒక్కొక్క కట్టను రూ.25 చొప్పున విక్రయిస్తారు. మొత్తం 25 కట్టలకు రూ.625 వస్తే వాటిలో రూ.125 ఖర్చులు పోను రూ.500 మిగులుతాయని నాయక్‌పోడు గిరిజన మహిళలు చెబుతున్నారు. ఒక్కొక్కసారి నల్ల తీగ దొరకపోతే ఖాళీ చేతులతో ఇంటి వస్తారు.

నల్లతీగతో ఉపయోగం

అడవిలో లభించే నల్ల తీగ చాలా దృఢంగా ఉంటుంది. ఈ తీగను జిల్లాలోని కొల్లేరు ప్రాంతంలో చేపలు పట్టేందుకు బుట్టలుగా తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. నల్ల తీగలను రెండు రోజుల పాటు నీటిలో నానబెట్టి అనంతరం వెదురు పుల్లలను కలిపి మావులను తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన మావులు సుమారు మూడు నెలల పాటు చేపలు పట్టేందుకు వినియోగిస్తారు. గిరిజన ప్రాంతంలో సేకరించిన నల్ల తీగల కట్టలను ఆటోల్లో కొల్లేరుకు తీసుకువెళతారు. ఆకివీడు సమీపంలోని దుంపగడపలో నల్లతీగను వ్యాపారులు అధికంగా కొనుగోలు చేస్తారని నాయక్‌పోడు గిరిజనులు చెబుతున్నారు.



సేకరించిన తీగలను తీసుకు వస్తున్న దృశ్యం



తీగలను కట్టలుగా చుడుతున్న మహిళ



నల్లతీగల కట్టలు

పూర్వీకుల నుంచి ఇదే వృత్తి



పూర్వీకుల నుంచి నల్లతీగ సేకరణే మా జీవనాధారం. ఏటా జూన్ చివరి వారం నుంచి నల్లతీగ సేకరణ ప్రారంభిస్తాం. 7 నెలల వరకు ఉపాధి ఉంటుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి కొల్లేరు నుంచి వ్యాపారులు వచ్చి నల్లతీగను కొనుగోలు చేసి తీసుకువెళతారు.

– తేనె జ్యోతి, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

సాహసం చేయక తప్పదు



నా చిన్నతనం నుంచి నల్లతీగ సేకరణకు వెళుతున్నా. కొన్నిసార్లు జంతువులను చూసి తీగలు వదిలేసి వచ్చేశాం. తీగ సేకరణ సమయంలో మా వాళ్లల్లో కొందరు కళ్లు కోల్పోయారు. అలాగే పాముకాటుకు గురైన వాళ్లు ఉన్నారు. ఇదే ప్రధాన వృత్తి వల్ల సాహసం చేయక తప్పదు.

– తోట మంగ, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

గతంతో పోలిస్తే కష్టంగా ఉంది



అడవిలో నల్లతీగల సేకరణ గతంలో పోల్చుకుంటే కష్టంగా ఉంది. మైళ్ల దూరం నడుచుకుంటూ వెళ్లినా నల్లతీగ దొరకడం లేదు. ఒకోసారి రోజంతా వెతికినా తీగలు దొరక్క ఇంటికి ఖాళీ చేతులతో వచ్చిన రోజులు ఉన్నాయి. కష్టమైన పనే అయినా మేము ఇష్టంగా చేస్తున్నాం.

– కుసినే వెంకటలక్ష్మి, లక్ష్మీపురం, బుట్టాయగూడెం

మావుల తయారీకి వినియోగం



అడవిలో సేరించిన నల్లతీగను కొల్లేరు పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో చేపలు, రొయ్యలు, పట్టుకోవడానికి ఉపయోగిస్తారు. తీగను రెండు రోజుల పాటు నీటిలో నానబెట్టి వెదురు పుల్లలతో మావులు తయారు చేస్తారు. వాటి ద్వారా చేపలు, రొయ్యలు పట్టుకుంటారు.

– కపిలివాయి హరి సూర్యనారాయణ, లక్ష్మీపురం, బుట్టాయగూడెం మండలం

● తెలంగాణ

ట్రిపుల్‌ఐటీ విద్యార్థి అదృశ్యం

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్‌ఐటీ విద్యార్థి బన్నీ(19) కనిపించడంలేదు. ఈ మేరకు బన్నీ తల్లిదండ్రులు బాసర పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన కత్తుల వెంకటేశ్, పద్మ దంపతుల రెండో కుమారుడైన బన్నీ ట్రిపుల్ ఐటీలో సెకండియర్ చదువుతున్నాడు. ఈ నెల 6న ఇంటికి వెళ్తున్నానని చెప్పి అతను అవుట్‌పాస్ తీసుకుని వెళ్లాడు. ట్రిపుల్ ఐటీ నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అయితే కుమారుడి నుంచి ఫోన్ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆదివారం బన్నీ మిత్రులకు ఫోన్‌చేసి తమ కుమారుడి గురించి అడిగారు. బన్నీ ఈ నెల 6వ తేదీనే అవుట్‌పాస్ తీసుకుని వెళ్లాడని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజులైనా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆదివారమే బన్నీ తల్లిదండ్రులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సంఘటన జరిగిన ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలని అక్కడ సూచించడంతో సోమవారం బాసర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాష్ట్ర వైపు ప్రయాణం!

పోలీసులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు బన్నీకి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. గురువారం బాసర రైల్వేస్టేషన్ వెళ్లిన బన్నీ, మహారాష్ట్రలోని పుణెవైపు వెళ్లే రైలులో ప్రయాణించినట్లు తెలుస్తోంది. బన్నీ సెల్ స్విచ్చాఫ్ వస్తోందని సమాచారం. అయితే అతను మరో నంబరు వాడుతున్నట్లు తెలుస్తోంది. కొత్త నంబరుకు మెసెజ్ చేయగా సోమవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారి ఆన్‌చేసి మళ్లీ వెంటనే ఆఫ్ చేశాడని చెబుతున్నారు. పర్బని ప్రాంతంలో అతను ఉన్నట్లు మొబైల్ సిగ్నల్స్ ద్వారా తెలుస్తోంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

10 రోజుల్లో ఆధారాలివ్వాలి

పవన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ పవన్ వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురు వలంటీర్లు, మహిళా సంఘాల నేతలు మహిళా కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తగిన ఆధారాలతో పది రోజుల్లోగా మహిళా కమిషన్‌కు వివరణ ఇవ్వాలని పవన్‌కు నోటీసులు ఇచ్చినట్లు వాసిరెడ్డి పద్మ తెలిపారు.

సాక్షి
మంగళవారం, 11 జూలై 2023

సరికొత్త 'డేటా పరిరక్షణ'

వ్యక్తిగత గోప్యత పౌరుల ప్రాథమిక హక్కని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పి ఆరేళ్లవుతుండగా మళ్లీ సరికొత్తగా ముస్తాబై డిజిటల్ పర్సనల్ డేటా పరిరక్షణ బిల్లు పార్లమెంటు ముందుకు రాబోతోంది. పట్టు వదలని విక్రమార్కుడి నుంచి పదే పదే తప్పించుకునే బేతాళుడి మాదిరి ఎప్పటికప్పుడు వెనక్కిపోతున్న బిల్లు ఈసారైనా ఈనెల 20 నుంచి మొదలయ్యే సమావేశాల్లో ఆమోదం పొందుతుందా లేదా అన్నది చూడాలి. అంతకన్నా ముఖ్యం– ముసాయిదా బిల్లుపై నిపుణుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకున్నారో తెలియాల్సివుంది. డేటా పరిరక్షణ ఎంతో సవాలుతో కూడుకున్న వ్యవహారం. దాన్ని రూపొందించేవారికి డిజిటల్ రంగంపైనా, అందులో వస్తున్న, రావడానికి ఆస్కారం ఉన్న మార్పులపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే నిజమైన పరిరక్షణ సాధ్యమవుతుంది.

మన దేశంలో డిజిటల్ యుగం ప్రవేశించి దాదాపు మూడు దశాబ్దాలవుతోంది. పేరుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–2000 చట్టం వచ్చినా అది పౌరుల గోప్యతకు సంబంధించి కొరగాని చట్టంగా మిగిలిపోయింది. వేలిముద్రలతో సహా పౌరుల సమస్త వివరాలూ సేకరించే ఆధార్‌ను ఆదరాబాదరాగా తీసుకొచ్చిన ఆనాటి యూపీఏ సర్కారు ఆ డేటా పరిరక్షణకు అనువైన చట్టం అవసరమన్న సంగతి మరిచింది. దానిపై నిపుణుల నుంచి విమర్శలు వెల్లువెత్తాక 2012లో జస్టిస్ ఏపీ షా నేతృత్వంలోని కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఒక సమగ్ర నివేదిక కూడా ఇచ్చింది. ఈలోగా యూపీఏ ఏలుబడి ముగిసిపోయింది. తగిన చట్టాలు లేకుండా ఆధార్ కోసం వ్యక్తిగత వివరాలు సేకరించడాన్ని సవాలు చేస్తూ 2017లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పుట్టస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టాక కేంద్రంలో కదలిక మొదలైంది. వ్యక్తిగత గోప్యత హక్కు పౌరుల జీవించే హక్కులో అంతర్భాగమని, అందుకు అనుగుణంగా చట్టం ఉండితీరాలని సర్వోన్నత న్యాయస్థానం ఆ కేసులో తీర్పునిచ్చాక జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నాయకత్వాన కమిటీ ఏర్పాటయింది. అన్ని వర్గాల ప్రజలతోనూ, నిపుణులతోనూ మాట్లాడి మరుసటేడాది జస్టిస్ శ్రీకృష్ణకమిటీ ముసాయిదా బిల్లు సమర్పించింది. మార్పులు, చేర్పులతో ఆ బిల్లు 2019లో పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆ తర్వాత దానిపై సంయుక్త పార్లమెంటరీ సంఘం(జేపీసీ) ఏర్పాటైంది. మరో రెండేళ్లకు జేపీసీ నివేదిక సమర్పించగా, దాని ఆధారంగా 2021లో కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. దానిపైనా అనేక అభ్యంతరాలు వ్యక్తం కావటంతో నిరుడు ఆగస్టులో ఆ బిల్లును ఉపసంహరించుకున్నారు. తర్వాత రూపొందిన మరో ముసాయిదా బిల్లును నిరుడు నవంబర్‌లో ప్రజల పరిశీలనకు విడుదల చేశారు. అందులో వ్యక్తమైన అభిప్రాయాలేమిటో, వేటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోబోతున్నదో చెప్పలేదు. మొత్తానికి ఆరేళ్లుగా సాగుతున్న కసరత్తు పర్యవసానంగా కొత్త బిల్లు రాబోతోంది. ఐరాస సభ్యదేశాల్లో ఇప్పటికే 137 దేశాలు డేటా పరిరక్షణ చట్టాలు తీసుకొచ్చాయి. చెప్పాలంటే ఆ విషయంలో మనం వెనకబడేవున్నాం.

దేశ పౌరుల డేటా బజారునపడుతున్న వైనం అప్పుడప్పుడు వెల్లడవుతూనే ఉంటోంది. ఎక్కడెక్కడో డేటా సంపాదించి పౌరుల బ్యాంకు ఖాతాలను దుండగులు ఖాళీ చేస్తున్న ఉదంతాలు పెరిగాయి. అయినా డేటా పరిరక్షణ బిల్లు తీసుకురావటంలో అలవిమాలిన జాప్యం జరిగింది. ఏమైతేనేం... బిల్లు రాబోతున్నది. సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్య వల్ల డేటా లీకైనపక్షంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు, చర్యలు తీసుకునేందుకు డేటా పరిరక్షణ ప్రాధికార సంస్థ(డీపీఏ) ఏర్పాటు చేయాలన్న బిల్లులోని ప్రతిపాదన మెచ్చదగిందే. ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించుకోవటం, నిఘా పెట్టడం ఇక తప్పనిసరవుతుంది. ఉద్దేశిత ప్రయోజనం నెరవేరగానే సేకరించిన డేటాను పూర్తిగా తొలగిస్తామన్న హామీ ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా చట్టంలో ఉంటుందంటున్నారు. అది మంచి ప్రతిపాదనే. డేటా లీక్ అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధించాలని ప్రతిపాదించారు. అవసరాన్నిబట్టి కేబినెట్ ఆమోదంతో ఈ జరిమానాను రూ. 500 కోట్ల వరకూ పెంచడానికి బిల్లులో ఏర్పాటుందని చెబుతున్నారు. ప్రతిపాదన కూడా అవసరమైనదే.

అయితే పౌరుల డేటా లీక్‌కు సంబంధించినంతవరకూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను సమంగా చూడాలి. పౌరుల అనుమతి లేకుండా వారి డేటాను సేకరించే ప్రభుత్వ సంస్థలకు కూడా వర్తించేలా చర్యలుండాలని, వాటికి కూడా కళ్లెం వేయాలని ఇంటర్నెట్ ఫ్రీడం ఫౌండేషన్ వంటి సంస్థల డిమాండ్. అమెరికా, యూరోప్ దేశాల్లో ప్రైవేటు సంస్థలకైనా, ప్రభుత్వ సంస్థలకైనా సమానంగా వర్తించేలా చట్టాలున్నాయి. దేశ భద్రత తదితర అంశాల్లో తన ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలకు కేంద్రం మినహాయింపు ఇవ్వొచ్చని తాజా బిల్లులో ఉన్నదంటున్నారు. కొన్ని సందర్భాల్లో అది అవసరమే కావొచ్చు కూడా. కానీ ఆ క్రమం పారదర్శకంగా ఉండాలి. మినహాయింపులిస్తే సరిపోదు. చట్టవిరుద్ధత చోటుచేసుకున్న పక్షంలో చర్యలేమిటో ప్రతిపాదించాలి. తప్పుడు ఫిర్యాదులని తేలితే రూ. 10,000 వరకూ జరిమానా విధించవచ్చన్న పాత ముసాయిదా నిబంధన కూడా మార్చలేదంటున్నారు. సాధారణ పౌరులు ఫిర్యాదు చేయాలంటేనే సవాలక్ష అడ్డంకులుంటాయి. ఈమాదిరి జరిమానాలు తోడైతే ఇక చెప్పేదేముంది? పౌరులను బెదరగొట్టే ఈ నిబంధనను పరిహరిస్తేనే మంచిది. డీపీఏ ఒక స్వతంత్ర సంస్థగా మనగలిగితేనే దాని పని తీరు ప్రభావవంతంగా ఉంటుందని పాలకులు గుర్తిస్తే అది దేశానికెంతో మేలు చేస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: బ.నవమి రా. 10.04 వరకు, తదుపరి దశమి
నక్షత్రం: అశ్వని రా.11.31 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా. 7.36 నుండి 9.11 వరకు, దుర్ముహూర్తం: ఉ. 8.10 నుండి 9.04 వరకు
తదుపరి రా. 10.58 నుండి 11.44 వరకు
అమృతఘడియలు: సా.4.32 నుండి 5.43 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఇది సరికొత్త అధ్యాయం

మన దేశ రాజకీయ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక సరికొత్త రాజకీయాన్ని చూడబోతున్నాం. ఇన్నాళ్ళు దేశంలోని రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు తాము ఇచ్చిన హామీలను మర్చిపోతూ, ఎన్నికలప్పుడు మళ్ళీ కొత్త వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతూ వస్తున్నారు. అంతే కానీ ఎవ్వరూ కూడా తాము ఇచ్చిన హామీలు నెరవేర్చాము కాబట్టి తమకు ఓటు వెయ్యమని అడిగిన వాళ్ళు లేరు. కాని ఇందుకు విరుద్ధంగా ఒక సరికొత్త రాజకీయానికి తెర తీస్తూ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం 'మీ కుటుంబాలకు నా ప్రభుత్వం వల్ల ఏదన్నా మేలు జరిగితేనే ఓటు వెయ్యండి' అని ధైర్యంగా అడుగుతున్నారు. తన పరిపాలన మీద, తాను రాష్ట్రానికి చేసిన అభివృద్ధిపై ఎంత నమ్మకం ఉంటే ఆయన అలా అడగగలుగుతారు! రాజకీయ నేతలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చెయ్యటం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించటం షరా మామూలైంది. ఇచ్చిన హామీలను కనీసం 50 శాతం అయినా నెరవేర్చిన రాజకీయ పార్టీలను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. కాని మొట్టమొదటి సారిగా ఇచ్చిన హామీలలో 95 శాతం నెరవేర్చిన పార్టీ వైసీపీ మాత్రమే. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చడానికి నడుం బిగించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా, ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ వస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.



రాజకీయం నేడు వ్యాపారంగా మారిపోయింది. ఎన్నికలప్పుడు ఓట్లను కొనడానికి మంచినీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చుబెట్టడం, తరువాత ఆ డబ్బులు తిరిగి రాబట్టుకోవడానికి ప్రభుత్వనిధులు, ప్రకృతి వనరులను దోచుకోవడం పరిపాటిగా మారింది. దశాబ్దాల కాలంగా ఇదే విధమైన మూస రాజకీయానికి అలవాటుపడిన రాజకీయ పార్టీలు ఇదే (ఓట్లు కొనడం) 'గెలుపు సూత్రం' అని భ్రమపడుతున్నాయి. ఇందుకు విరుద్ధంగా, సరికొత్త రాజకీయానికి తెర తీస్తూ సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి, ఆ తేదీల ప్రకారం ప్రతి పథకాన్ని అమలు చేస్తున్న పార్టీ ప్రభుత్వం ఏదన్నా ఉందంటే అది ఒక్క వైసీపీది మాత్రమే. తాము చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ, మేలు జరిగితేనే మళ్ళీ ఓట్లు వేయండని ముందుకు వెళుతోంది ఆ పార్టీ. అంతేకాక, కొత్తగా 'జగనన్న సురక్ష' ద్వారా ప్రతి గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించటానికి ప్రతి గ్రామంలో అధికారులతో వేల క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఇంకా ఎవరైనా అర్హులైన వారు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారేమో పరిశీలించి వారికి కూడా ప్రయోజనం చేకూరుస్తున్నారు.

అనుక్షణం ప్రజలతో మమేకమై వారి సంక్షేమం కోసం పని చేసే ఏ రాజకీయ పార్టీకి కూడా ఎన్నికల సమయంలో డబ్బుతో ఓట్లు కొనుగోలు చెయ్యాల్సిన అవసరం ఉండదు. ప్రజలు కూడా ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను ఎప్పుడు పూర్తి చేస్తాయో చెప్పాలని నిలదీయాలి. ఓట్లు కొనుగోలు చేసే పార్టీలను దూరంగా పెట్టి, నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటు పడే పార్టీలకు పట్టం కడితే ప్రజాస్వామ్యం అర్థవంతం అవుతుంది.

– ప్రొఫెసర్ ఈదర శ్రీనివాస రెడ్డి



కమీషన్లు అందడం లేదనే..
రామోజీ నేలబారు రాతలు

- నిర్వాసితుల పునరావాసం, భూసేకరణకే రూ.33 వేల కోట్లు అవసరం
- అలాంటప్పుడు ప్రాజెక్టును రూ.15 వేల కోట్లతో ఎలా పూర్తి చేస్తారని నిలదీసిన ప్రతిపక్ష నేత జగన్
- తాను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతిసారీ.. సవరించిన వ్యయాన్ని ఇవ్వాలని అడుగుతున్న జగన్
- బాబు తప్పిదాలను సరిదిద్దుతూ ప్రణాళికాయుతంగా పోలవరం పూర్తికి అడుగులు
- నిధుల రీయింబర్స్‌లో విభాగాలవారీ పరిమితులను ఎత్తేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ ఓకే
- ఈ క్రమంలోనే తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు ఇస్తామంటూ జూన్ 5న ఆర్థిక శాఖ నోట్
- కొత్తగా నిర్మించే ఏ ప్రాజెక్టులోనైనా ఐఎస్ గైడ్‌లైన్స్, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకే నీటి నిల్వ
- తొలుత పోలవరం 41.15 మీటర్లలో నీటి నిల్వ.. ఏవైనా లోపాలు ఉత్పన్నమైతే దిద్దుబాటు
- ఆ తర్వాత నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ 44.. ఆనక 45.72 మీటర్లలో నీటి నిల్వ
- శాసనసభలో సీఎం జగన్.. పార్లమెంట్‌లో కేంద్ర జల్ శక్తి మంత్రి ఇదే అంశంపై స్పష్టీకరణ
- తొలుత 41.15 మీటర్ల కాంటూర్ వరకూ పూర్తి చేసి, రైతులకు నీరందించే చర్యలు
- అయినా సరే... బాబు పాపాలను జగన్‌కు ఆపాదిస్తూ పదే పదే రామోజీ తప్పుడు రాతలు

అసలింతకీ రామోజీరావుకు ఏం కావాలి? పోలవరం ప్రాజెక్టు పూర్తికావటమా... లేక ఎక్కడికక్కడ పనులు ఆగిపోవటమా? దీనికి ఆగిపోవటమే ఆయనకు కావాలన్న సమాధానం తేలిగ్గానే వచ్చేస్తుంది. ఎందుకంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచీ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రామోజీ రావు 'ఈనాడు'లో అచ్చోసిన దుర్మార్గపు కథనాలు అన్నీఇన్నీ కావు. ఇంకేముంది ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు పడే అవకాశం లేదని కొన్నాళ్లు... కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇచ్చే అవకాశం లేదని కొన్నాళ్లు... ఎత్తు తగ్గించి కట్టేస్తున్నారని కొన్నాళ్లు... ఇలా పదేపదే విషాన్ని చిమ్ముతూనే వస్తున్నారు. చిత్రమేంటంటే... రామోజీ అంచనాలకు భిన్నంగా పోలవరం వేగంగా ముందు కెళుతోంది. చంద్రబాబు వీసమెత్తయినా పట్టించుకోని పునరావాసాన్ని కూడా వైఎస్ జగన్ భుజాలకెత్తుకుని ప్రాజెక్టును నడిపిస్తున్నారు. కేంద్రాన్ని పదేపదే అభ్యర్థిస్తూ... రావాల్సిన నిధుల్ని రాబట్టుకుంటున్నారు. ఇదిగో... ఇదే 'ఈనాడు' కడుపు మంటను పెంచేస్తోంది. కాంట్రాక్టరుగా తన వియ్యంకుడిని తప్పించేసి మరీ ప్రాజెక్టును పూర్తి చేస్తుండటాన్ని రామోజీరావు జీర్ణించుకోలేకపోతున్నారు. 'పోలవరం నిధుల కోసం... జగన్ నేల చూపులు– బేల మాటలు' అంటూ సోమవారం ప్రచురించిన కథనం కూడా ఇలాంటిదే!!. మరి దీన్లో నిజానిజాలెంత? ఏది నిజం?

ఈనాడు ఆరోపణ: పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చేది ఇక రూ.12,911.15 కోట్లేనని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కేంద్ర కేబినెట్‌లో 2017లో ఆమోదించిన మొత్తానికి అదనంగా... రూ.12,911.15 కోట్లే ఇస్తామని పేర్కొంది. దీనికన్నా పైసా ఎక్కువరాదు.

వాస్తవం: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర జల్ శక్తి, ఆర్థిక శాఖ మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, నిర్మలాసీతారామన్‌లను కలుస్తూనే ఉన్నారు. కలిసిన ప్రతి సందర్భంలోనూ పోలవరం ప్రాజెక్టుకు 2017–18 ధరల ప్రకారం కేంద్ర జలసంఘం ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి.. ఆ మేరకు నిధులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే గతేడాది జనవరి 3న ప్రధాని మోదీతో సమావేశమైనపుడు... ప్రాజెక్టు తొలి దశను సత్వరమే పూర్తి చేసి, రైతులకు ముందస్తు ఫలాలు అందించడానికి తాత్కాలికంగా రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. దీనికి మోదీ సానుకూలంగా స్పందించి... జల్ శక్తి, ఆర్థిక శాఖలకు తగు ఆదేశాలిచ్చారు. కేంద్ర జల్ శక్తి శాఖ సూచన మేరకు తొలి దశ పూర్తికి రూ.10,911.15 కోట్లు అవసరమని పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. వాటిని జల్ శక్తి శాఖ ఆమోదించింది. అయితే చంద్రబాబు ఘోర తప్పిదం వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడానికి, ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చటానికి రూ.2 వేల కోట్లు ఖర్చవుతుందని గత మార్చి 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తేల్చింది. దాంతో తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు (10,911 ప్లస్ 2వేలు) విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ పంపిన ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ జూన్ 5న అంగీకరించింది. అదీ కథ.

వాస్తవానికి పోలవరం ప్రాజెక్టుకు 2013–14 ధరల ప్రకారం.. 2014, ఏప్రిల్ 1 నాటికి ఇరిగేషన్ కాంపొనెంట్ ఖర్చులో మిగిలిన మొత్తం అంటే రూ.15,667.9 కోట్లకు మించి ఇచ్చేది లేదని, ఆ తర్వాత పడే అదనపు భారంతో కేంద్రానికి సంబంధం లేదని 2017 మార్చి 15న కేంద్రం ఒక తీర్మానాన్ని ప్రతిపాదించగా... దాన్ని కేబినెట్ ఆమోదించింది కూడా. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16,128.78 కోట్లు ఖర్చు చేయగా.. కేంద్రం రూ.14,418.39 కోట్లు రీయింబర్స్ చేసింది. అంటే 2017, మార్చి 15న కేంద్ర కేబినెట్ ఆమోదించిన ప్రకారం పోలవరానికి ఇక విడుదల చేయాల్సింది రూ.1249.51 కోట్లే. ఈ నేపథ్యంలో... తొలి దశ పూర్తిచేయడానికి అవసరమైన రూ.12,911.15 కోట్లు విడుదల చేయాలంటే.. 2017, మార్చి 15 నాటి కేబినెట్ తీర్మానాన్ని సవరించాలి. ఆ మేరకు ప్రతిపాదన పంపాలని కేంద్ర జల్ శక్తి శాఖకు కేంద్ర ఆర్థిక శాఖ సూచించిందే తప్ప ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఇవ్వబోమని గానీ.. ఇచ్చేది ఇక ఇంతేననిగానీ ఆర్థిక శాఖ నోట్‌లో ఎక్కడా లేదు. రామోజీరావు మాత్రం ఇచ్చేది ఇక ఇంతేనని కేంద్ర ఆర్థిక శాఖ నోట్‌లో పేర్కొన్నట్లు తప్పుడురాతలు రాసేశారు. చంద్రబాబులా రామోజీది కూడా చంద్రబాబు తరహా బ్రీఫ్డ్ మీ ఇంగ్లీషే అయితే.. ట్యూషన్ పెట్టించుకోవాలి గానీ తనకు అర్థమైనదే వాస్తవమన్న రీతిలో రాసేస్తే ఎలా? అజ్ఞానంతో తప్పుడురాతలు అచ్చేస్తే ఎలా?

Cabinet decision. However this additional funding shall be limited to a maximum of Rs 12,911.15 crore or such lower amount as may be recommended by the Department of Water Resources for completion of project up to 41.15 metre. For providing additional funds for the Polavaram Irrigation Project, the Department of Water Resources, River Development and Ganga Rejuvenation is requested to draft a

2017 మార్చి 15న కేంద్ర కేబినేట్ ఆమోదించిన మొత్తం కన్నా పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన రూ.12911.15 కోట్లను అదనంగా ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఈ ఏడాది జూన్ 5న కేంద్ర ఆర్థికశాఖ జారీ చేసిన నోట్

(i) As per request of GoAP and recommendations of Department of Water Resources, RD & GR vide their e-file No.P-30027/2/2022-O/o SJC(SPR-II)-MOWR received in the Department of Expenditure on 6th February, 2023, this Department has no objection to remove the component wise ceiling.

టిడిపి సర్కార్ హయాంలో రీయింబర్స్ చేయడానికి విభాగాల వారీగా విధించిన పరిమితులను ఎత్తివేయడానికి అంగీకరిస్తూ కేంద్ర ఆర్థికశాఖ జారీ చేసిన నోట్

ఈనాడు ఆరోపణ: పోలవరం ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులివ్వబోమని కేంద్రం చెప్పినా సీఎం వైఎస్ జగన్ నోరెత్తడం లేదు. లోక్‌సభలో బీజేపీకి కావాల్సినంత బలం ఉన్నా రాజ్యసభలో లేదు. రాజ్యసభలో ఉన్న రాజకీయ బలాన్ని పోలవరం నిధులు, ప్రత్యేక హోదా సాధనకు సీఎం వైఎస్ జగన్ ఎందుకు ఉపయోగించుకోలేకపోయారు?

వాస్తవం: విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని కేంద్రమే నిర్మించాలి. కానీ.. పోలవరం ప్రాజెక్టు పనుల్లో కమీషన్ల కోసం రాష్ట్రానికి హక్కుగా దక్కిన ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ... దాని నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని 2014, జూన్ నుంచి 2016, సెప్టెంబరు 6 వరకూ నాటి సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. చివరకు కేంద్రం మంజూరు చేశాక యనమల రామకృష్ణుడు బావమరిదికి, రామోజీరావు వియ్యంకుడికి ఈ కాంట్రాక్టు పనులు నామినేషన్‌పై కట్టబెట్టేశారు. భారీగా కమీషన్లు దండుకున్నారు.

- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న క్రమంలో చంద్రబాబు చేసిన ఇంకో ఘోరమైన తప్పిదమేంటంటే... 2013–14 నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని 2016, సెప్టెంబరు 7న అంగీకరించడం. మరి ఆ మూడేళ్లలో ధరలు పెరిగి ఉండవా? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుంటే ఎలా?
- 2016, సెప్టెంబరు 26న పోలవరానికి నాబార్డు నుంచి రూ.1981.54 కోట్ల రుణాన్ని విడుదల చేస్తూ.. ఇకపై బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు రుణం రూపంలోనే నిధులు విడుదల చేస్తామని.. 2018, డిసెంబర్‌లోగా ప్రాజెక్టును పూర్తి చేయలేకపోతే.. విడుదల చేసిన నిధులను రుణంగా పరిగణిస్తామంటూ కేంద్రం పెట్టిన మెలికకు సైతం చంద్రబాబు తల ఊపేశారు.
- 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ.. కేంద్ర జలశక్తి శాఖకు పంపిన మెమొరాండంలో 2014, ఏప్రిల్ 1 నాటికి నాటికి పోలవరం ప్రాజెక్టులో మిగిలిపోయిన నీటిపారుదల విభాగం పనులకు అయ్యే (ఇరిగేషన్ కాంపొనెంట్) వంద శాతం వ్యయాన్ని మాత్రమే ఇస్తామని పునరుద్ఘాటించింది.
- ఆ తర్వాత ఐదున్నర నెలలకు 2017, మార్చి 15న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో.. 2014, ఏప్రిల్ 1 నాటికి పోలవరం ప్రాజెక్టు పనుల్లో మిగిలిపోయిన నీటిపారుదల విభాగం పనులకయ్యే వంద శాతం వ్యయాన్ని మాత్రమే ఇస్తామని.. అది ఎంతన్నది పోలవరం ప్రాజెక్టు అథారిటీ మదింపు చేస్తుందని.. ఆ ప్రకారమే నిధులిస్తామని స్పష్టం చేసింది. ఆ సమావేశంలో ఉన్న టీడీపీకి చెందిన మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి నోరు మెదపలేదు.
- 2014, ఏప్రిల్ 1 నాటికి నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని.. అంతకంటే అంచనా వ్యయం పెరిగితే .. దాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని 2017, మే 8న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల్ శక్తి శాఖ లేఖ రాసినా సరే... చంద్రబాబు స్పందించలేదు.
- 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన మెమొరాండం ప్రకారం... 2014, ఏప్రిల్ 1 నాటి ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలను సీడబ్ల్యూసీకి పంపామని.. వాటిని ఆమోదించి.. నిధులిస్తే ప్రాజెక్టును పూర్తి చేస్తామని 2018, జనవరి 12న నాటి సీఎం చంద్రబాబు ప్రధానికి లేఖ రాశారు.
- 2013–14 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ ఆమోదించిన నీటిపారుదల విభాగం వ్యయం రూ.20,398.61 కోట్లు. ఇందులో ఏప్రిల్ 1, 2014 నాటికి చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లను మినహాయిస్తే కేవలం రూ.15,667.9 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసినా.. చంద్రబాబు దానికి అంగీకరించారు. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయమే రూ. 33,168.23 కోట్లు. అలాంటిది కేవలం రూ.15,667.9 కోట్లు ఇస్తే పోలవరాన్ని పూర్తి చేస్తామని చంద్రబాబు ఎలా అంగీకరించారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.
- ఇదే అంశాన్ని నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ శాసనసభలో పలు మార్లు ఎత్తిచూపుతూ.. భూసేకరణ చట్టం 2013 ప్రకారం పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33,168.23 కోట్లని.. అలాంటిది కేంద్రం ఇస్తామన్న రూ.15,667.9 కోట్లతో ఎలా పూర్తి చేస్తారని నిలదీస్తే.. నాటి సీఎం చంద్రబాబు వాటిని తోసిపుచ్చుతూ వచ్చారు. అంటే చంద్రబాబుకు కావాల్సింది కమీషన్లు తప్ప ప్రాజెక్టు పూర్తవటం కాదు. అందుకే రాష్ట్రమే చేపట్టేలా ఆదేశాలివ్వాలని కోరుతూ... ప్రత్యేక హోదా అడగబోమని తాకట్టుపెట్టేశారు. అంచనా వ్యయాన్ని సవరించకున్నా నోరు మెదపలేదు. ఆఖరికి పునరావాసం ఊసెత్తకుండా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే ఇస్తామన్నా... సై అనేశారు. అసలు పునరావాసం లేకుంటే ప్రాజెక్టు ఉంటుందా? ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే పేదలకు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి, వారికి తగిన పరిహారం ఇవ్వకుంటే వారు అక్కడి నుంచి వెళతారా? వారు వెళ్లకపోతే ప్రాజెక్టు పూర్తి చేసినా నీటిని నిల్వ చేయగలరా? నీటిని నిల్వ చేసే పరిస్థితి లేనపుడు ఎంత ఎత్తు కడితే లాభమేంటి? మరి పునరావాస నిధుల ఊసెత్తకుండా చంద్రబాబు ఎందుకు నోరుమూసుకున్నారు?
- నిజానికి ఎలాంటి ప్రాజెక్టు అయినా... ఎంత ప్రతిష్ఠాత్మకమైనది అయినా కాలం గడుస్తున్న కొద్దీ ముందుగా వేసిన అంచనా వ్యయం పెరుగుతుంది. అది నాగార్జున సాగర్‌కైనా.. శ్రీశైలానికైనా కూడా!!. పోలవరానికైనా అంతే. 2013–14లో ఉన్న ధరలు ఇప్పుడెందుకు ఉంటాయి? అన్నిరకాల సామగ్రి, లేబర్ చార్జీలు అప్పటితో పోలిస్తే రెట్టింపుకన్నా ఎక్కువే పెరిగాయి. కానీ చంద్రబాబు నాయుడు నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని ఏకంగా లేఖ రాసేయటంతో... ఇప్పుడు తాజా ధరల ప్రకారం నిధులడిగిన ప్రతిసారీ కేంద్రం సవాలక్ష కొర్రీలు పెడుతోంది. అసలు చంద్రబాబు ఇలా ఎందుకు చేశారంటే... ఆయనకు కమీషన్లు వస్తే చాలనుకున్నారు కనక.
- చంద్రబాబు నిర్వాకం వల్ల పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర నిధుల కొరత ఎదురవుతోందన్నది నిజం. 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చి.. నిధులు విడుదల చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ, జల్ శక్తి శాఖ మంత్రులను సీఎం వైఎస్ జగన్ కోరుతూ వస్తున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ.. పోలవరం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌తోపాటు సీఎం వైఎస్ జగన్ లేవనెత్తిన అంశాలను పరిష్కరించడానికి కేంద్ర కేబినెట్ కార్యదర్శి, కేంద్ర ఆర్థిక, జల్ శక్తి శాఖ అధికారులతో కమిటీ వేశారు. ఆ కమిటీ చర్చల వల్ల 2014–15 నాటి రెవెన్యూ లోటు రూ.10,421 కోట్లను ఇటీవల కేంద్రం విడుదల చేసింది. పోలవరం తొలి దశ పూర్తికి అవసరమైన రూ.12,911.15 కోట్లను విడుదల చేయడానికి అంగీకరించింది. ప్రత్యేక హోదాను ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలకు సీఎం వైఎస్ జగన్ పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అంశంపై అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు పోరాటం చేస్తున్నారు. ఇవేవీ కన్పించడం లేదా రామోజీ?



ఈనాడు ఆరోపణ
రెండో దశ పునరావాసానికి రాష్ట్రం ఏమీ చేయలేదని సీఎం స్వయంగా ప్రకటించారు. రాష్ట్రం నిధులు ఇచ్చే పరిస్థితుల్లో లేదని చెప్పారు.

ఏది నిజం?

వాస్తవం: కొత్తగా నిర్మించే ఏ ప్రాజెక్టులోనైనా నీటిని నిల్వ చేయాలంటే.. ఐఎస్(ఇండియన్ స్టాండర్డ్) ఆపరేషన్ ఆఫ్ రిజర్వాయర్స్ గైడ్ లైన్స్, కేంద్ర జలసంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఒకేసారి గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేయకుండా.. మూడు దఫాలుగా నిల్వ చేసుకుంటూ పోవాలి. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక తొలి ఏడాది 41.15 మీటర్ల వరకూ నీటిని నింపి.. ప్రాజెక్టులో అన్ని భాగాలను పరిశీలిస్తారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుతారు. ఆ తర్వాత 44 మీటర్ల కాంటూర్ వరకూ నీటిని నింపి, లోటుపాట్లు ఏవైనా ఉత్పన్నమైతే వాటిని సరిదిద్దుతారు. ఆనక 45.72 మీటర్లలో అంటే గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తారు. ఇదే అంశాన్ని సీఎం వైఎస్ జగన్ పలు మార్లు శాసనసభ వేదికగా స్పష్టం చేశారు. తొలుత 41.15 మీటర్ల వరకూ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని.. ఆ తర్వాత దశల వారీగా పునరావాసం కల్పించి 45.72 మీటర్ల వరకూ నీటిని నిల్వ చేస్తామని ఉద్ఘాటించారు. ప్రాజెక్టు ఎత్తు ఏమాత్రం తగ్గదని.. కావాలంటే పూర్తయ్యాక టేపు తెచ్చుకుని కొలుచుకోవాలని చంద్రబాబు, రామోజీ రావు ఎల్లో మీడియాకు సవాల్ విసిరారు. ఇదే అంశంపై అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పందిస్తూ.. పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి ఒక్క ఇంచు కూడా తగ్గదని, నిర్వాసితులు అందరికీ పునరావాసం కల్పించే బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన లైడార్ సర్వేలో పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూర్ పరిధిలో అదనంగా 36 గ్రామాలు ముంపునకు గురవుతాయని తేలటంతో ఆ గ్రామాల ప్రజలకూ పునరావాసం కల్పించడానికి రూ.5,122 కోట్ల నిధులివ్వాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు అభ్యర్థించారు. దీనికీ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్ సానుకూలంగా స్పందించారు. దీన్ని బట్టి చూస్తే ప్రాజెక్టు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని స్పష్టమవుతుంది. అయినా సరే.. రామోజీరావు పదే పదే విషం చిమ్ముతున్నారు.

క్లుప్తంగా...

శ్రీవాణి ట్రస్ట్‌పై రాజకీయం వద్దు : అంబికా కృష్ణ



తిరుమల: శ్రీవాణి ట్రస్ట్‌పై రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావని బీజేపీ నాయకుడు అంబికా కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆయనకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పురాతన ఆలయాలు టీటీడీ నిర్మిస్తోందని తెలిపారు. అంతేకాకుండా ధూప దీప నైవేద్యంతో పాటు ఆలయాలను పునరుద్ధరణ చేయాలని టీటీడీకి విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 88,836 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా, తిరుమలలో చిరుజల్లులు కురిశాయి. శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీశారు.

ఎస్‌ఐ పరీక్ష 'కీ'లో తప్పులున్నాయన్న పిటిషన్ కొట్టివేత



సాక్షి అమరావతి : ఎస్‌ఐ నియామక ప్రాథమిక పరీక్ష 'కీ'లో తప్పులున్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకుని తమను దేహదారుఢ్య పరీక్షకు అనుమతించేలా ఆదేశాలివ్వాలంటూ ఎస్ నిత్యానందం, మరికొందరు దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేష్ సోమవారం తీర్పు వెలువరించారు.

సునీల్‌కుమార్ సింగ్ కేసు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీ సీఎం వైఎస్ జగన్ సీజేఐకు రాసిన లేఖను మీడియా ముందు బహిర్గతం చేశారంటూ ఆరోపిస్తూ న్యాయవాది సునీల్‌కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఎదుట సోమవారం ఈ పిటిషన్ విచారణకొచ్చింది. విచారణ వాయిదా కావాలంటూ పిటిషనర్ కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణ సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది.

రాజధాని పనులపై నేడు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: రాజధాని అమరావతిలో పనులకు సంబంధించి దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం, హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ పలువురు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను గతేడాది నవంబర్‌లో జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీనాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. జస్టిస్ కేఎం జోసెఫ్ పదవీ విరమణ చేయడంతో ఈ పిటిషన్‌ను తాజాగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందు జాబితాలో చేర్చారు. రాజధాని అమరావతిలో పనులు పూర్తిచేయడానికి కాలపరిమితి విధిస్తూ ఏపీ హైకోర్టు ఆదేశాలివ్వగా.. వాటిపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం విదితమే.

ఆలయాలపై ప్రభుత్వ ఉత్తర్వులు హర్షణీయం

- రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతాచార్యులు



మాట్లాడుతున్న తమిరిశ అనంతాచార్యులు

తెనాలి: దేవదాయశాఖ పరిధిలో ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన ఆలయాల నిర్వహణ బాధ్యతను వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులు, ఏదైనా ఆలయ నిర్వహణ కమిటీలకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి తమిరిశ అనంతాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఐదేళ్ల కాలానికి ఆ దేవాలయాలకు దేవదాయశాఖ ట్రస్ట్ బోర్డులు లేదా కార్యనిర్వహణ అధికారిని గాని నియమించబోమని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొనట్టు తెలిపారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సమాఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 43బి రిజిస్టరులో అర్చకుల పేర్లు నమోదు చేయాల్సిందిగా దేవదాయశాఖ ఉత్తర్వులిచ్చి చాలాకాలమైనా ఇంతవరకు పలుచోట్ల నమోదు కాలేదని చెబుతూ, దేవదాయశాఖ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్చక సమాఖ్య జిల్లా ప్రతినిధి తమిరిశ రఘు, నాయకులు వేదాంతం మాధవకుమార్, జంధ్యాల గురునాథప్రసాద్, తమిరిశ హరిబాబు, పెనుమూడి సుబ్బారావు, తమిరిశ లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఏడు తరాల ఏడాకుల బీర

విత్తనాభివృద్ధి సంస్థలుగా వెలుగొందుతున్న చిత్రాడ గ్రామంలోని గృహాలు



చిత్రాడ గ్రామంలో ఇళ్లవద్ద వేలాడదీసిన విత్తన బీరకాయలు

> విత్తన బీర సాగులో 300 మందికి పైగా రైతులు
>
> ఏడు తరాలుగా ఏడాకుల బీర సాగులోనే..
>
> ఇక్కడి విత్తనాలకు ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్

పిఠాపురం: ఇళ్లముందు మామిడి తోరణాలు కనిపించడం సహజం. కానీ.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని చిత్రాడ గ్రామంలో మాత్రం బీరకాయల తోరణాలు కనిపిస్తాయి. ఆ గ్రామంలో లభించే బీర విత్తనాలకు అంతటి ప్రసిద్ధి మరి. మొలకెత్తిన బీరపాదుకు ఏడు ఆకులు రాగానే.. కాయలు కాయడం చిత్రాడ బీర ప్రత్యేకత. అందుకే.. దీనిని ఏడాకుల బీర అని పిలుస్తుంటారు. పూర్వం ఇక్కడ ఒక ఇంట్లో సాగు చేసిన బీరపాదుకు ఏడాకులు రాగానే కాయలు కాయడం ప్రారంభించడంతో దాని నుంచి విత్తనాలు సేకరించి విత్తనాభివృద్ధి చేసినట్టు పెద్దలు చెబుతుంటారు. గ్రామంలో ఏడు తరాలుగా రైతులు ఏడాకుల బీరను సాగు చేస్తున్నారు.

ఇక్కడి పాదులన్నీ విత్తనాలకే..

చిత్రాడలో సాగు చేసే బీర పాదులకు కాసే కాయల్ని ఇంటి అవసరాలకు వినియోగించకుండా కేవలం విత్తనాలకు మాత్రమే కేటాయించడం ప్రత్యేకత. ఇక్కడ పండిన బీర నుంచి తీసిన విత్తనాలు మంచి దిగుబడి వస్తుందనే నమ్మకంతో గుంటూరు, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు తదితర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల రైతులు కూడా చిత్రాడ వచ్చి విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. ఈ విత్తనంతో వేరే ప్రాంతాల్లో సాగు చేసి.. ఆ పంట నుంచి విత్తనాలను సేకరించినా ఆశించిన ఫలితాలు కనిపించకపోవడంతో రైతులు ఈ గ్రామంలో పండిన విత్తనాలపైనే ఆసక్తి చూపుతారు. గ్రామంలో 300 మందికి పైగా రైతులు చిత్రాడ, పరిసర పొలాల్లో బీర పంట సాగు చేస్తున్నారు. బీర పాదుల నుంచి సేకరించిన కాయలను ఇళ్లవద్ద చూరులకు తోరణాలుగా కట్టి నీడలోనే ఆరబెడతారు. పెద్ద రైతులైతే స్థానికంగా ఇళ్లను అద్దెకు తీసుకుని వాటిలో విత్తన బీరను నిల్వ ఉంచుతారు. పిఠాపురం–కాకినాడ ప్రధాన రహదారికి ఇరువైపులా విత్తన బీరకాయలను వేలాడదీసిన ఇళ్లే కనిపిస్తుంటాయి. ఇతర జిల్లాల నుంచి రైతులకు అక్కడికక్కడే ఎండిన బీరకాయల నుంచి విత్తనాలను తీసి ఇస్తారు. ప్రస్తుతం కేజీ విత్తనాలు రూ.1,600 వరకు ధర పలుకుతుంది. విత్తన బీరను పండించిన రైతులందరూ తమ ఇళ్లవద్ద మాత్రమే విత్తనాలు విక్రయిస్తుంటారు. సుమారు 600 ఎకరాల్లో రైతులు ఏడాకుల బీరను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఎకరాకు 200 కేజీల వరకు విత్తన దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.



విక్రయానికి సిద్ధం చేసిన ఏడాకుల బీర రకం విత్తనాలు

తరతరాలుగా బీర విత్తనాలే



మా తాతల కాలం నుంచీ బీర తోటలు సాగు చేస్తూ విత్తనాల్ని విక్రయిస్తున్నాం. అధికారులు, శాస్త్రవేత్తలు వచ్చి వీటి ప్రాముఖ్యతను గుర్తించారు. ఎన్ని హైబ్రీడ్ రకాలు వచ్చినా ఏడాకుల బీర విత్తనాలను కొట్టలేవు. ఎందుకంటే ఈ బీర రుచి, పోషకాలలో ఎంతో గొప్పది. మిగిలిన రకాల బీర కాయలు చేదు వస్తాయి. ఇక్కడ చేదు అనే మాట ఉండదు. చిత్రాడ అంటే ఏడాకుల బీర గ్రామం అనే పేరుంది.

– పేర్నీడి నాగ సత్యవతి, మహిళా రైతు, చిత్రాడ

హైబ్రీడ్ రాకతో మానేయాల్సి వచ్చింది



ఒకప్పుడు సీజన్‌లో 2 టన్నుల వరకు విత్తనాలు విక్రయించేవాళ్లం. వందల ఎకరాల్లో బీర సాగు జరిగేది. 90 శాతం మంది రైతులు ఇదే వ్యవసాయం చేసే వారు. పదేళ్లుగా హైబ్రీడ్ విత్తనాలు రావడంతో రైతులు వాటిపై మొగ్గు చూపుతున్నారు. దీంతో అమ్మకాలు తగ్గిపోయాయి. ఒకప్పుడు 90 శాతం మంది రైతులు బీర సాగు చేస్తే.. 10 శాతం మంది మాత్రమే బీర వేస్తున్నారు. వీటి విలువ తెలిసిన రైతులు ఇప్పటికీ ఇక్కడకు వచ్చి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఎన్ని హైబ్రీడ్ విత్తనాలు వచ్చినా చిత్రాడ ఏడాకుల బీరను మించి ఉండవు.

– పి.కృష్ణ, రైతు, చిత్రాడ

30 కేజీల చేప లభ్యం



రామసముద్రం: అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని చొక్కాండ్లపల్లి పంచాయతీలోని కనగాని చెరువులో 30 కేజీల అతి పెద్ద చేప లభ్యమైంది. చెరువులో నీరు ఎండిపోయే దశకు చేరడంతో చెరువు పాడుకున్న మత్స్యకారుడు శ్రీధర్ ఆదివారం చేపలు పట్టే పని చేపట్టారు. ఓ వలకు సుమారు 30 కేజీల చేప పట్టుబడింది. దీంతో ఆనందం వ్యక్తం చేసిన శ్రీధర్ ఆ చేపను అమ్మి సొమ్ము చేసుకోవడానికి మండల కేంద్రమైన రామసముద్రం సోమవారం తీసుకువచ్చాడు. ఆ పెద్ద చేపను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. ఈ చేప సుమారు రూ.4,500కు అమ్ముడుపోయినట్లు తెలిసింది.

ఇసుక పుష్కలం



కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం సమీపంలో కరకట్ట దిగువ రేవులో ఇసుక పుష్కలంగా లభిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన స్థానికులు ఎడ్ల బండ్లపై ఉచితంగా ఇసుక తీసుకెళ్తున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు సోమవారం చిక్కింది.

–కందుల చక్రపాణి, సాక్షి ఫొటో గ్రాఫర్, విజయవాడ

రూ.5 లక్షలిస్తే.. రూ.20లక్షల దీనార్లిస్తామని..

- ఘరానా మోసం
- లబోదిబోమంటున్న బాధితులు

పొదిలి: రూ. 5లక్షల భారతీయ కరెన్సీ ఇస్తే.. రూ.20 లక్షల విలువజేసే సౌదీ దీనార్‌లు ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో సోమవారం వెలుగుజూసింది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురానికి చెందిన షేక్ రహిమాన్, షేక్ ఖాశీంవలికి బీహారీలమని చెప్పి, ఓ మహిళ, ఒక పురుషుడు సెల్‌ఫోన్‌లో పరిచయం చేసుకున్నారు. ఒకటికి నాలుగు రెట్లు సంపాదించుకోవచ్చని నమ్మించారు. అనంతరం మార్కాపురంలో ఒక దీనార్ నోటును బాధితులకు ఇచ్చి.. కావాలంటే పరీక్ష చేయించుకోవచ్చని సూచించారు. ఖాశీంవలి ఆ నోటును తీసుకుని హైదరాబాదు వెళ్లి పరీక్ష చేయించాడు. అక్కడి వారు అది నిజమైన నోటేనని చెప్పడంతో నమ్మారు. ఈ నేపథ్యంలో రూ.20 లక్షల విలువైన దీనార్‌లు అందజేస్తామని, రూ.5 లక్షల నగదుతో రమ్మని బాధితులకు సూచించారు. దీంతో వారు రూ.5 లక్షలతో పొదిలి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీ కన్యా లాడ్జి దగ్గరకు వచ్చారు. అప్పటికే అక్కడ ఓ మహిళ, పురుషుడు ఓ ప్యాకెట్‌తో వేచి ఉన్నారు. మరొక వ్యక్తి మోటారు సైకిల్‌పై సిద్ధంగా ఉన్నాడు. బాధితుల వద్ద ఉన్న రూ.ఐదు లక్షల నగదు తీసుకుని, వారి వద్ద ఉన్న ప్యాకెట్‌ను వీరి చేతిలో పెట్టి, వెంటనే మోటారు సైకిల్‌పై పలాయనం చిత్తగించారు. ఆ ప్యాకెట్ తెరిచి చూడగా వట్టి కాగితాలు దర్శనమిచ్చాయి. దీంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోర్టు ధిక్కార కేసులో ప్రవీణ్‌కుమార్‌కు జైలు శిక్ష, జరిమానా

అప్పీల్ నిమిత్తం తీర్పు అమలును 4 వారాలు నిలుపుదల: హైకోర్టు

సాక్షి అమరావతి : కోర్టు ధిక్కార కేసులో విశాఖ జిల్లా అప్పటి కలెక్టర్, ఏపీ ఐఐసీ ప్రస్తుత ఎండీ ప్రవీణ్‌కుమార్‌కు హైకోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారన్న హైకోర్టు ఇందుకు గాను ఆయనకు రెండు వారాల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు సోమవారం తీర్పు చెప్పారు. దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు వీలుగా తీర్పు అమలును నాలుగు వారాల పాటు నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా కాపులుప్పాడలోని ఏడెకరాల భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చడాన్ని సవాలు చేస్తూ శ్రీనివాసరావు మరో నలుగురు 2017లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు ఆ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయలేదంటూ పిటిషనర్లు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని, ఇందుకు అప్పటి కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌ను బాధ్యుడిగా చేశారు.

రైలు పట్టాలపై జారిపడిన కొండ చరియలు

కొత్తవలస–కిరండూల్ మార్గంలో పలు రైళ్ల రద్దు



బొర్రా, కరకవలస మధ్య కటికి సమీపంలోని రైలు పట్టాలపై పడిన కొండచరియలు

అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని కొత్తవలస–కిరండూల్ రైల్వేలైన్‌లో బొర్రా, కరకవలస మధ్య (82వ కిలోమీటర్ వద్ద) కొండ చరియలు జారిపడటంతో ఓహెచ్‌సీ విద్యుత్ స్తంభం, రైలు పట్టాలు దెబ్బతిన్నాయి. కేకే లైన్‌లో రెండోలైన్‌కు సంబంధించిన పనులు జరుగుతుండటంతో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో 82వ కిలోమీటర్ వద్ద ఒక్కసారిగా కొండచరియలు జారిపడ్డాయి. దీంతో ఓహెచ్‌సీ విద్యుత్‌లైన్ స్తంభం విరిగిపడింది. పట్టాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సాంకేతిక సమస్య కారణంగా విశాఖపట్నం వెళుతున్న కిరండూల్ పాసింజర్ రైలును కొంతసేపు బొర్రా రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. సాంకేతిక సమస్య పరిష్కరించిన అనంతరం కిరండూల్ పాసింజర్ రైలు విశాఖపట్నం బయలుదేరింది. ఈ కారణంగా సోమవారం రాత్రి విశాఖ నుంచి కిరండూల్ వెళ్లే నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. మంగళవారం కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళ్లే నైట్ ఎక్స్‌ప్రెస్, అదే రోజు విశాఖ నుంచి కిరండూల్ వెళ్లే పాసింజర్, బుధవారం కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళ్లే పాసింజర్ రైళ్ల రద్దు చేశారు. సోమవారం రాత్రి కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళ్లే నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు కోరాపుట్, దమంజోడి, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకుంటుందని సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

పోలీస్ కమిషనర్‌కు చేనేత సంఘం ఫిర్యాదు

విజయవాడ స్పోర్ట్స్: అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన వస్త్ర వ్యాపారి, అతని స్నేహితుడిపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ రాణాకు ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని ఆలయ సిల్క్స్ యజమానికి ధర్మవరానికి చెందిన హోల్‌సేల్ వ్యాపారి వస్త్రాలను సరఫరా చేసేవారని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన నగదు కోసం వచ్చిన ధర్మవరం వ్యాపారిని ఆలయ సిల్క్స్ యజమాని గొడవర్తి అవినాష్‌గుప్తా, మరో ఇద్దరు కలిసి బంధించి దాడి చేశారని వివరించారు.

ఆలయ ఆస్తులకు రక్షణ కవచం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు
- ఆక్రమణదారుల నుంచి స్వాధీనానికి కొత్త ఆర్డినెన్సు



పిఠాపురంలో రొయ్యల చెరువులుగా మారిన ఆదికేశవ పెరుమాళ్ భాస్కరాచార్యస్వామి ఆలయ భూములు

కాకినాడ జిల్లాలో ఆలయాలు	
ఏ కేటగిరి ఆలయాలు	– 18
బి కేటగిరి ఆలయాలు	– 109
సీ కేటగిరి ఆలయాలు	– 309
డీ కేటగిరి ఆలయాలు	– 340
దుకాణాలు	– 240
ఆలయాలకు ఉన్న భూములు	– 1,190 ఎకరాలు

పిఠాపురం: దేవుడి భూములకు రక్షణ లభించింది. దేవదాయ, ధర్మాదాయశాఖ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక దేవుడి భూములను ఆక్రమించడం కుదరదు. దేవుడు ఊరుకున్నా ప్రభుత్వం ఊరుకోదు. దేవుడి ఆస్తి దేవుడికే చెందాలి అదే ప్రభుత్వం సంకల్పం. తమిళనాడులోని పెరంబుదూర్ అరుణ్మగు ఆదికేశవ పెరుమాళ్ భాస్కరాచార్య స్వామి ఆలయానికి చెందిన సుమారు 26 ఎకరాల (సుమారు రూ 50 కోట్ల విలువైన) పంట భూమి పిఠాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 802–2లో ఉంది. పూర్వ ఒక దాత తనకు వారసులు లేకపోవడంతో తమ కులదైవమైన ఆదికేశవస్వామి ఆలయానికి ఇక్కడి భూములను విరాళంగా ఇచ్చారు. ఆ భూములను స్థానిక రైతులకు తమిళ దేవదాయశాఖాధికారులు లీజుకు ఇచ్చారు.

టీడీపీ నాయకుల కబ్జా

పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుడి అనుచరులైన ఇద్దరు అన్నదమ్ములు ఆ భూములపై కన్నేసి, వాటిని సొంతం చేసుకున్నారు. లీజుకు తీసుకున్న భూముల్లో ఏకంగా రొయ్యల చెరువులు తవ్వేశారు. ఆలయ షాపులు లీజుకు తీసుకుని నెలల తరబడి అద్దెలు చెల్లించక పోవడం, అడిగితే దౌర్జన్యం అంటూ గోల చేయడం ఇదీ ఇప్పటి వరకూ ఆలయ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్న తీరు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే ఇలా ఎన్నో వందల ఎకరాల భూములు, దుకాణాలు అన్యాక్రాంతంలో మగ్గుతున్నాయి. ఇలాంటి వాటి రక్షణకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో అన్యాక్రాంతంలో ఉన్న దేవుడి భూములు ఆస్తులు బయటపడనున్నాయి.

అధికారులకే అధికారం

ఇంతకు ముందు ఆలయ భూములు ఆస్తులను అనుభవించిన వాడికి అనుభవించినంత అన్నట్టుగా ఉండేది. అధికారులు ఉన్నా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసినా ఆక్రమణదారులు ఏదో ఒక వంక చూపించి తప్పించుకునేవారు. దీంతో అధికారులు ఏమీ చేయలేక వదిలేసేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితికి స్వస్తి పలుకుతూ దేవుడి ఆస్తులను అన్యాక్రాంతం నుంచి బయటకు తేవడానికి, వాటికి రక్షణ కల్పించే అధికారాలను దేవదాయ శాఖాధికారులకు కల్పిస్తూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త ఆర్డినెన్సును తీసుకు రావడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆక్రమణదారుల నుంచి భూములను విడిపించే బాధ్యత దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్, ఈఓలకు అప్పగించింది. తొలుత ఆక్రమణదారులకు అధికారులు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం నిర్ణీత సమయంలో ఆక్రమదారులు స్పందించక పోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదులు చేసి, వారి సహాయంతో ఆక్రమణదారుల నుంచి దేవుడి ఆస్తులను స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం ఆర్డినెన్సులో పేర్కొంది.

పక్కాగా వివరాలు

దేవదాయశాఖ ఆధ్వర్యంలోని భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేసింది. దీనిలో భాగంగా జిల్లా కమిటీని నియమించడానికి జీఓ నంబరు 60ను జారీ చేసింది. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, జేసీ, దేవదాయశాఖ ఏసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, డీపీఓ, ఆర్‌అండ్‌బీ ఈఈ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ, జిల్లా రిజిస్ట్రార్లను సభ్యులుగా నియమించనున్నారు. వీరి పర్యవేక్షణలో ప్రతి నెలా దేవాలయ ఆస్తుల పరిరక్షణకు సమావేశం నిర్వహించి, ఏఏ భూములు ఆక్రమణకు గురయ్యాయో వివరాలు తెలుసుకుని వాటి స్వాధీనానికి చర్యలు తీసుకుంటారు. ఆస్తులను గుర్తించి సర్వే నంబర్లతో సహా పక్కాగా వివరాలు నమోదు చేస్తారు. భూములు, షాపులు వేలం సక్రమంగా జరిగేలా చూడడంతో పాటు బకాయిలను కచ్చితంగా వసూలు చేసేలా చర్యలు తీసుకుంటారు. నిర్ణీత సమయంలో వేలం నిర్వహించేలా చూస్తారు. ఇప్పటికే కోర్టుల్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటారు.

ఆస్తులను కాపాడే అవకాశం

ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్డినెన్సు ఆలయ ఆస్తులకు రక్షణ కవచం. చట్టాల్లో లొసుగులను ఆసరాగా చేసుకుని రూ.కోట్లు విలువైన ఆలయ ఆస్తులను ఆక్రమణదారులు అనుభవిస్తున్నారు. అధికారులుగా మేము ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉండి పోవాల్సి వచ్చేది. ఆక్రమణ అని తెలిసినా గట్టిగా చర్యలు తీసుకునే అధికారం ఉండేది కాదు. కొత్త ఆర్డినెన్సుతో మాకు అధికారం రావడం వల్ల దేవుడి ఆస్తులను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల రూ.కోట్ల విలువైన ఆస్తులు దేవాలయాలకు సమకూరుతాయి.

– చందక దారబాబు, దేవదాయశాఖ రాష్ట్ర ఈఓల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, రాజమహేంద్రవరం

మంచి నిర్ణయం

ఆలయాల ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ఆర్డినెన్సు తీసుకురావడం చాలా మంచి నిర్ణయమని జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆక్రమణల్లో ఉన్న దేవుడి భూములకు మోక్షం కలుగుతుందని వివరించారు.

సీఆర్‌డీఏలో పేదల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు

గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : సీఆర్‌డీఏలో 47,017 పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులిచ్చారు. యూనిట్‌కు రూ.2.30 లక్షల చొప్పున పేదల ఇళ్ల నిర్మాణ ప్రాజెక్ట్ వ్యయం రూ.1081.39 కోట్లు అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఇళ్ల నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా ఆదేశాలిచ్చారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం సీఆర్‌డీఏలో 50 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మొత్తం లబ్ధిదారుల్లో 45,101 మంది ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చే ఆప్షన్–3 ఎంపిక చేసుకున్నారు.

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని నియోజకవర్గాల వారీగా ఇళ్లు మంజూరు ఇలా

నియోజకవర్గం	ఇళ్లు
విజయవాడ సెంట్రల్	8,504
విజయవాడ ఈస్ట్	7,963
విజయవాడ వెస్ట్	7,354
మంగళగిరి	19,397
తాడికొండ	1,749
పొన్నూరు	2,050

అన్ని మద్యం దుకాణాల్లోనూ డిజిటల్ చెల్లింపులు

▶ మొదటి పేజీ తరువాయి

ఓ ప్రకటనలో ఖండించింది. రాష్ట్రంలోని 2,934 మద్యం దుకాణాల్లోనూ ఇప్పటికే డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టామని.. సక్రమంగా అమలవుతోందని వెల్లడించింది. మద్యం నియంత్రణకు ప్రభుత్వం పూర్తి చర్యలు తీసుకుంటోందని కూడా పేర్కొంది. కొన్ని దుకాణాల్లో ఏపీ ఆన్‌లైన్ పేటీఎం ద్వారా డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను నిర్వహిస్తుండగా మరికొన్ని దుకాణాల్లో ఎస్‌బీఐ ఈజీ ట్యాప్ ద్వారా డిజిటల్ చెల్లింపులు నిర్వహిస్తున్నారు. అందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు. జూలై 8న ఒక్కరోజే అన్ని దుకాణాల్లో కలిపి మొత్తం 67,818 డిజిటల్ చెల్లింపులు చేశారు. దాదాపు రూ.1.81 కోట్ల విలువైన మద్యం అమ్మకాలను డిజిటల్ చెల్లింపుల ద్వారానే నిర్వహించారు.

> **నగదు చెల్లింపులకు అనుమతి**
>
> ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులతో పాటు నగదు చెల్లింపులను కూడా అనుమతిస్తున్నారు. పేదలు తక్కువ ధర ఉన్న మద్యం కొనుగోలు చేసేందుకు గాను నగదు చెల్లింపులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఎందుకంటే వారి వద్ద డిజిటల్ చెల్లింపులు చేసేందుకు స్మార్ట్ ఫోన్లు, యూపీఐ యాప్‌లు ఉండవు. అందువల్ల నగదు చెల్లింపులను కూడా అనుమతిస్తున్నారు.

అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు

ఐదు విభాగాల్లో 73 నంది అవార్డులు ప్రదానం • సమాచార కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి



నాటక రంగ ప్రముఖులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ ఎండీ విజయ్‌కుమార్ రెడ్డి

సాక్షి, అమరావతి: నంది నాటకోత్సవాలను అక్టోబర్ నెలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో (రంగస్థల పురస్కారాలు) భాగంగా ఐదు విభాగాల్లో 73 అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నంది నాటకోత్సవాల నిర్వహణపై నాటక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల లఘు నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ లఘు నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో అవార్డులు అందజేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చామని, అనంతరం వారం రోజులు దరఖాస్తుల ఉపసంహరణకు కేటాయించామని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే ప్రాంతాన్ని నంది నాటకోత్సవాలకు వేదికగా ఎంపిక చేస్తామని తెలిపారు.

ప్రదర్శితమైన నాటకాలకే అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా 2018 నుంచి 2022 వరకు వివిధ నాటక సమాజాల ద్వారా ప్రదర్శించిన నాటకాలను ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో ఎంట్రీలకు అవకాశం కల్పిస్తున్నట్టు విజయ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంట్రీలను న్యాయ నిర్ణేతల ద్వారా పరిశీలించి తుది పోటీలకు 10 పద్య నాటకాలు, 6 సాంఘిక నాటకాలు, 12 సాంఘిక నాటికలు, 5 బాలల నాటికలు, 5 కళాశాల లేదా యూనివర్సిటీ యువత నాటికలను ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తుల సంఖ్యను బట్టి వీటి సంఖ్యను పెంచే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. బాలలు, యువతకు సంబంధించిన నాటకాలకు సంబంధించి ఈ ఏడాది కొత్తగా ప్రదర్శించిన వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ప్రదర్శన, ఎంపిక సమయంలో నాటకరంగ కళాకారులుండే ప్రాంతానికే వచ్చి తమ జ్యూరీ బృందం పరిశీలిస్తుందన్నారు. సరికొత్త కథాంశాలతో మన సంస్కృతి సంప్రదాయాలను, మానవతా విలువలను, ఉన్నతమైన జీవనాన్ని ప్రతిబింబించే అంశాలకు కళాకారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చివరిసారిగా 2017లో నంది నాటకోత్సవాలు నిర్వహించామని, అనంతరం కరోనా విపత్కర పరిస్థితులతో నిర్వహించలేకపోయామన్నారు. కళాకారులకు ఆర్టీసీ చార్జీల్లో రాయితీ ఇచ్చే విషయమై సంబంధిత విభాగంతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం ఎంవీఎల్ఎన్ శేషసాయి, కళారాధన సమితి కార్యదర్శి రవికృష్ణ నంద్యాల, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడారు. సమావేశం అనంతరం 'తెలుగు పద్యనాటక రంగం– సాంకేతికత–సమకాలీన అధ్యయనం' అంశంపై ఆర్.నిరుపమ సునేత్రి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

క్లుప్తంగా...

టమాటా లోడుతో పరారీ

యశవంతపుర: టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ.. బెంగళూరులో టమాటాలతో ఉన్న బొలెరో వ్యాన్‌తో దుండగులు పరారయ్యారు. చిత్రదుర్గకు చెందిన రైతులు బొలెరో వాహనంలో టమాటా లోడుతో బెంగళూరు ఆర్‌ఎంసీకి వచ్చారు. మార్కెట్ యార్డులో వాహనాన్ని నిలిపి టీ తాగడానికి వెళ్లారు. ఇదే అదనుగా ముగ్గురు వ్యక్తులు ఆ వ్యాన్‌ను స్టార్ట్ చేశారు. అడ్డగించగా రైతులే తమ వాహనాన్ని ఢీకొట్టారంటూ బుకాయించారు. దెబ్బతిన్న తమ వాహనం చూపిస్తామంటూ రైతులను కూడా బొలెరోలోకి ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక రైతులను బయటకు తోసేసి వాహనంతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంసీ యార్డ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బొలెరో వాహనంలో 250కి పైగా ట్రేల్లో టమాటాలున్నాయి. కిలో టమాటా ధర కనీసం రూ.100 లెక్కన 2 టన్నుల టమాటా విలువ రూ.2 లక్షలుంటుంది.

300 మంది శరణార్థులు సముద్రంలో గల్లంతు

దాకర్: ఆఫ్రికా దేశమైన సెనెగల్ నుంచి దాదాపు 300 మంది శరణార్థులతో స్పెయిన్‌కు బయలుదేరిన మూడు పడవలు అట్లాంటిక్ సముద్రంలో గల్లంతయ్యాయి. స్పెయిన్‌కు చెందిన వాకింగ్ బోర్డర్స్ అనే స్వచ్ఛంద సంస్థ సోమవారం ఈ విషయం వెల్లడించింది. రెండు పడవలు జూన్ 23న సెంట్రల్ సెనెగల్‌లోని కోస్తా తీర ప్రాంత నగరం ఎంబౌర్ నుంచి బయలుదేరింది. వీటిలో 100 మంది ఉన్నారు. 200 మందితో రెండో పడవ జూన్ 27న కఫాంటైన్ పట్టణం నుంచి బయలుదేరింది. తర్వాత మూడు పడవల నుంచి హఠాత్తుగా సంకేతాలు నిలిచిపోయాయి. అవి సముద్రంలో గల్లంతైనట్లు గుర్తించారు. స్పెయిన్ అధికారులు విమానాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

'ఆర్డినెన్స్'పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై వైఖరిని తెలియజేయాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఆర్డినెన్స్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పిటిషన్‌లో సవరణ చేయాలని, ఇందులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను కూడా ప్రతివాదిగా చేర్చాలని ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీకి సూచించింది.

చిలీని వణికిస్తున్న వింత వైరస్!


నరాలు, కండరాలు నిర్వీర్యం | పక్షవాతానికీ దారి తీయొచ్చు
దేశమంతా పెరుగుతున్న కేసులు | మూణ్నెల్లు నేషనల్ ఎమర్జెన్సీ!



కరోనాతోనూ వస్తుంది...!

జీబీ సిండ్రోమ్ ఎందుకు వస్తుందన్న దానిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. తరచూ ఇన్ఫెక్షన్లు, ముఖ్యంగా కాంపిలోబాక్టర్ జెజునీ బ్యాక్టీరియా ఈ సిండ్రోమ్‌కు కారణంగా మారుతున్నట్టు మాత్రం తేలింది. అయితే ఇన్‌ఫ్లుయెంజా, సైటోమెగలూ, ఎప్‌స్టెయిన్ బర్‌తో పాటు కోవిడ్ వైరస్ కూడా జీబీఎస్‌కు దారి తీసే ప్రమాదం పుష్కలంగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తుండటం కలవరానికి గురి చేస్తోంది!

శాంటియాగో: గిలాన్ బరే (జీబీఎస్) అని పిలిచే అరుదైన సిండ్రోమ్ ఒకటి దక్షిణ అమెరికా దేశం చిలీని నిలువునా వణికిస్తోంది. ఈ వింత వ్యాధి బారిన పడి జనం అల్లాడుతున్నారు. అసలేం చేయాలో ప్రభుత్వానికే పాలుపోవడం లేదు. చివరికి దేశవ్యాప్తంగా ఏకంగా మూడు నెలల పాటు ఎమర్జెన్సీ విధిం చాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది...



ఏమిటీ జీబీ సిండ్రోమ్?

ఒంట్లోని వ్యాధి నిరోధక శక్తే నరాల వ్యవస్థను శత్రువుగా భావించి దాడికి దిగే అత్యంత అరుదైన (ఆటో ఇమ్యూన్) సిండ్రోమ్ ఇది. నరాలపై ఈ దాడి చివరికి ఒంట్లోని కండరాల వ్యవస్థ మొత్తాన్నీ పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. దాంతో విపరీతమైన నిస్సత్తువ, అవయవాలు మొద్దుబారడం వంటి దుర్లక్షణాలు వేధిస్తాయి. ఇది సాధారణంగా కాళ్లలో మొదలై నెమ్మదిగా పైకి పాకుతూ ఒళ్లంతా ఆక్రమిస్తుంది. జీబీఎస్ బాగా ముదిరితే పక్షవాతానికి కూడా దారి తీస్తుందని జిన్ హువా వార్తా సంస్థ పేర్కొంది. పెద్దవాళ్లకు, ముఖ్యంగా మగవాళ్లకు ఇది ఎక్కువగా సంక్రమిస్తుంది. అయితే అన్ని వయసులవారికీ దీనితో రిస్కే!

గుర్తించడమెలా?

ప్రధానంగా రోగ లక్షణాలు, నరాల పరీక్ష ద్వారా జీబీఎస్ ఉనికి బయట పడుతుంది. ముఖ్యంగా స్పైనల్ టాప్, ఎలక్ట్రోమియోగ్రఫీ వంటివి దీన్ని కచ్చితంగా పట్టేస్తాయి.

ఇవీ లక్షణాలు...

జీబీఎస్ తాలూకు అత్యంత ప్రధాన లక్షణం విపరీతమైన నీరసమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరొలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్ వెల్లడించింది. తొలి దశలో మెట్లెక్కుతుంటేనో, నడుస్తుంటేనో కూడా విపరీతమైన నీరసం రావడాన్ని దీని తొలి లక్షణంగా భావించవచ్చు. తర్వాతి దశలో శ్వాసప్రక్రియను నియంత్రించే కండరాలు బాగా బలహీనపడతాయి. ఎంతలా అంటే, మెషీన్ సాయంతో ఊపిరి తీసుకోవాల్సి కూడా రావచ్చు! ఈ లక్షణాలు తలెత్తిన రెండే రెండు వారాల్లో సమస్య బాగా ముదిరి రోగిని కదల్లేని స్థితికి చేరుకుంటాడు! నరాలు బాగా దెబ్బ తింటాయి గనుక నరాల వ్యవస్థ నుంచి మెదడుకు అస్తవ్యస్త సంకేతాలు అందుతుంటాయి. దాంతో చర్మం లోపల పురుగులు పాకుతున్నట్టు చెప్పలేని బాధ సలుపుతుంటుంది.

ఇతర లక్షణాలు

- చూపు తగ్గడం, కంటి కండరాలు దెబ్బ తినడం.. మాట్లాడటం, నమలడం, మింగడం కష్టంగా మారడం
- చేతులు, అరికాళ్లలో సూదులతో గుచ్చుతున్నట్టు విపరీతమైన బాధ
- విపరీతమైన ఒళ్లు నొప్పులు, ముఖ్యంగా రాత్రిపూట
- శారీరక, మానసిక సమన్వయ లోపం, నిలకడలేమి
- హృదయస్పందన, రక్తపోటు విపరీతంగా పెరిగిపోవడం
- జీర్ణాశయ, పిత్తాశయ సంబంధిత సమస్యలు

చికిత్స ఉందా?

జీబీఎస్‌కు ఇప్పటికైతే ఇదమిత్థంగా చికిత్స అంటూ ఏమీ లేదు. సమస్య తీవ్రతను తగ్గించి, త్వరగా కోలుకునేందుకు సాయపడే మార్గాలు మాత్రమే ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. దీనికి ప్రధానంగా వాడుతున్న చికిత్స ఇంట్రావీనస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఐవీఐజీ). నరాలపై దాడికి దిగకుండా రోగ నిరోధక శక్తిని ఇది నియంత్రిస్తుంది.

సాక్షి, నేషనల్ డెస్క్

మణిపూర్‌లో హింసను అరికట్టాల్సింది అధికారులే



శాంతి భద్రతల యంత్రాంగాన్ని మా చేతుల్లోకి తీసుకోలేం
సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసాకాండను అరికట్టే విషయంలో శాంతి భద్రతల యంత్రాంగాన్ని తమ చేతుల్లోకి తీసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో హింస మరింత పెచ్చరిల్లడానికి న్యాయస్థానం ఒక వేదిక కాకూడదని పేర్కొంది. హింసను నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దాలని మాత్రమే అధికారులకు తాము సూచించగలమని వెల్లడించింది. మణిపూర్‌లో హింసకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ వివిధ సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనడానికి సానుకూల సూచనలు మంగళవారంలోగా ఇవ్వాలని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరవేస్తామని పిటిషనర్లకు తెలియజేసింది.

ఇప్పటిదాకా 142 మంది మృతి

రాష్ట్రంలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న హింసాకాండలో 142 మంది మరణించారని మణిపూర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు సోమవారం ఒక నివేదిక సమర్పించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటిదాకా 5,995 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని, 6,745 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామని మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషీ తెలియజేశారు. తదుపరి విచారణ కోసం ఆరు కేసులను సీబీఐకి బదిలీ చేశామన్నారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. సోమవారం ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పీ జిల్లాల సరిహద్దులోని రెండు గ్రామాల్లో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒక పౌరుడు మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పాయేంగ్, సింగ్‌డా గ్రామాల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఒకరు చనిపోయారు. ఇద్దరు గాయాలపాలయ్యారు. కాల్పులకు ఉపయోగించిన రైఫిల్‌ను పోలీసుల నుంచే దొంగిలించినట్లు అధికారులు గుర్తించారు. కాల్పుల ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దుకాణాలను, వ్యాపార సంస్థలను మూసివేశారు.

14న ఎల్‌వీఎం.. 23న పీఎస్‌ఎల్‌వీ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెలలో రెండు ప్రయోగాలు చేయనుంది. ఈనెల 14వ తేదీన ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ ద్వారా అత్యంత ముఖ్యమైన చంద్రయాన్–3 ప్రాజెక్టు ప్రయోగాన్ని, 23వ తేదీన పీఎస్‌ఎల్‌వీ సీ56 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇకపై ఏటా కనీసం 12 రాకెట్లు ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు.

ఒకేసారి ఐదు రాకెట్లను అనుసంధానం చేసే సత్తా

మొదటి ప్రయోగవేదికకు సంబంధించి పీఎస్‌ఎల్‌వీ ఇంటిగ్రేషన్ బిల్డింగ్ (పిఫ్), మొబైల్ సర్వీస్ టవర్‌ల ద్వారా ఒకేసారి రెండు రాకెట్లను అసెంబ్లింగ్ చేయొచ్చు. రెండో ప్రయోగవేదికకు సంబంధించి మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్, శాటిలైట్ ఇంటిగ్రేషన్ బిల్డింగ్, రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లూ అందుబాటులో ఉన్నాయి. అంటే శ్రీహరికోటలో ఒకేసారి వేర్వేరు వేదికలపై ఐదు రాకెట్లను అనుసంధానం చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. వీటికి తోడ్పాటుగా రెండు ప్రయోగవేదికలు ఉన్నాయి. మరోవైపు ప్రైవేట్ అంతరిక్ష సంస్థల రాకెట్ల ప్రయోగాల కోసం ఎస్‌ఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను ప్రైవేట్‌పరం చేయాలని ఇస్రో భావిస్తోంది.

చంద్రయాన్-3లో అధిక ఇంధనం, అత్యున్నత ప్రమాణాలు

న్యూఢిల్లీ: 14వ తేదీన ప్రయోగించబోయే ప్రతిష్టాత్మక చంద్రయాన్–3 రాకెట్‌లో అదనపు ఇంధనం నింపామని, అత్యున్నత 'ప్రమాణాలు' పాటిస్తున్నామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చంద్రయాన్–2 ప్రాజెక్టులో విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై కూలిపోయిన అంశంపై మాట్లాడారు. ' 2019 సెప్టెంబర్‌లో సెన్సార్ ఫెయిల్యూర్, ఇంజిన్ ఫెయిల్యూర్, ఆల్గారిథమ్ ఫెయిల్యూర్, కాలిక్యులేషన్ ఫెయిల్యూర్ ఇలా తొలి విఫలం నుంచి చాలా నేర్చుకున్నాం. గత విజయాల నుంచి స్ఫూర్తి పొంది చంద్రయాన్–2ను రూపొందించాం. చంద్రయాన్–2 వైఫల్యం నుంచి గుణపాఠాలు నేర్చుకుని చంద్రయాన్–3ని సిద్ధంచేశాం. ఈసారి ఒకవేళ పరిస్థితులు అదుపు తప్పితే ఎలా పరిష్కరించాలి, ల్యాండర్‌ను ఎలా భద్రంగా జాబిల్లిపై దించాలనే అంశాలపై మరింత దృష్టిపెట్టాం. ల్యాండింగ్ స్థలాన్ని పెద్దదిగా నిర్ణయించుకున్నాం' అని చెప్పారు.

మిస్ నెదర్లాండ్స్‌గా ట్రాన్స్‌జెండర్ మహిళ

అమ్‌స్టర్‌డ్యామ్: మిస్ నెదర్లాండ్స్ కిరీటాన్ని ఓ ట్రాన్స్‌జెండర్ మహిళ రిక్కీ వలేరి కొల్లే గెలుచుకుంది. అందగత్తెల పోటీలో ట్రాన్స్‌జెండర్ మహిళ ఈ ఘనత సాధించడం నెదర్లాండ్స్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ విధంగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించింది. 22 ఏళ్ల రిక్కీ వలేరి కొల్లే ప్రముఖ మోడల్స్ నుంచి ఎదురైన పోటీని అవలీలగా అధిగమించింది. విజేతగా నిలిచింది. మిస్ నెదర్లాండ్స్ టైటిల్ సాధించడం గర్వంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేసింది. మహిళలకు ఆదర్శం



కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. ఎల్‌సాల్వేడార్‌లో జరుగనున్న మిస్ యూనివర్స్ పోటీల్లో రిక్కీ నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహించనుంది.

మోదీకి తిలక్ జాతీయ అవార్డు

పుణే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోకమాన్య తిలక్ జాతీయ అవార్డు అందజేయనున్నట్లు తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్(హింద్ స్వరాజ్ సంఘ్) తెలిపింది. ఆయన అత్యున్నత నాయకత్వానికి గుర్తుగా, ప్రజల్లో దేశభక్తి భావాన్ని మేలుకొల్పుతున్నందుకు గాను ఆయన్ను ఎంపిక చేసినట్లు వివరించింది. అవార్డు కింద జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామంది. పుణేలో ఆగస్టు ఒకటో తేదీన లోకమాన్య తిలక్ 103వ వర్ధంతి సందర్భంగా జరిగే ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శరద్‌పవార్‌ను ఆహ్వానించారు.

ఉత్తరాది అతలాకుతలం

- మూడో రోజూ కొనసాగిన భారీ వర్షాలు
- ప్రమాదస్థాయికి చేరుకున్న యమున
- వరదల్లో ఇప్పటిదాకా 37 మంది మృత్యువాత



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో బియాస్ నది ఉధృతి ధాటికి కొట్టుకుపోయిన వంతెన



హరియాణాలోని పంచకులలో కోసుకుపోయిన రహదారి

న్యూఢిల్లీ/సిమ్లా/జైపూర్: ఉత్తరభారతంలో మూడో రోజూ వర్ష బీభత్సం కొనసాగింది. ఆకస్మిక వరదల్లో వాహనాలు, రహదారులు కొట్టుకుపోయాయి. పంటపొలాలు, నివాస ప్రాంతాలు నీటమునిగాయి. వానల ప్రభావం హిమాచల్ ప్రదేశ్‌పైనే ఎక్కువగా పడింది. ఇళ్లు కూలి, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఇప్పటి వరకు 18 మంది, పంజాబ్, హరియాణాల్లో 9 మంది, రాజస్తాన్‌లో ఏడుగురు, యూపీలో ముగ్గురు చనిపోయారు. దీంతో ఉత్తరాదిన వరదల్లో ఇప్పటిదాకా 37 మంది చనిపోయారు. హిమాచల్‌లోని వివిధ ప్రాంతాల్లో 200 మంది పర్యాటకులు చిక్కుబడిపోయారు. ఢిల్లీలో యమునా నది ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఆదివారం రికార్డు స్థాయిలో కురిసిన వర్షంతో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచిపోయింది. ప్రధాని మోదీ సోమవారం సీనియర్ మంత్రులు, అధికారులతో కలిసి ఉత్తరాదిన భారీ వర్షాలతో ఉత్పన్నమైన పరిస్థితులపై చర్చించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు స్థానిక యంత్రాంగాలతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, సహాయక కార్యక్రమాలను చేపట్టాలని ప్రధాని కోరారని పీఎంవో తెలిపింది. ప్రధాని మోదీ హిమాచల్, ఉత్తరాఖండ్ సీఎంలతో మాట్లాడి, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో కుండపోతగా వానలు కురుస్తున్నాయి. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో సోమవారం మరో నలుగురు చనిపోయారు. సిమ్లా–కాల్కా హైవేలో కొంత భాగం కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సిమ్లా–కాల్కా మార్గంలో పట్టాలపై కొండచరియలు విరిగిపడటంతో మంగళవారం వరకు రైళ్ల రాకపోకలను ఆపేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. వాతావరణ శాఖ రాగల 24 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా 120 రోడ్లపై రాకపోకలు బందయ్యాయని, 484 నీటి సరఫరా పథకాలపై ప్రభావం పడిందని అధికారులు తెలిపారు. జూలై 1–9 తేదీల మధ్య సాధారణ వర్షపాతం 160.6 మిల్లీమీటర్లకు మించి 69 శాతం ఎక్కువగా 271.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రాజ్‌పుర విద్యుత్‌ప్లాంట్‌లోకి చేరిన నీరు

ఎగువనున్న హరియాణాలోని హత్నికుండ్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఢిల్లీలో యమునా నదిలో వరద పెరుగుతోంది. సోమవారం మధ్యాహ్నానికి ప్రమాద స్థాయి దాటి 205.33 మీటర్లకు చేరింది. మంగళవారం మధ్యాహ్నానికి 206.65 మీటర్లకు చేరి, క్రమేపీ తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. నదిలో నీరు 206 మీటర్ల మార్కును దాటితే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని సీఎం కేజ్రీవాల్ చెప్పారు. యమునా నదికి అత్యంత సమీపంలో సుమారు 41 వేల మంది నివసిస్తున్నట్లు అంచనా. గత ఏడాది సెప్టెంబర్‌లో రెండుసార్లు యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహించింది. పంజాబ్, హరియాణాల్లో వానల తీవ్రత సోమవారమూ కొనసాగింది. పంజాబ్ రాష్ట్రం పటియాలా జిల్లాలోని రాజ్‌పుర విద్యుత్ ప్లాంట్‌లోకి వరద చేరడంతో 700 మెగావాట్ల యూనిట్‌ను అధికారులు మూసివేశారు. సట్లెజ్ యయునా లింక్ కెనాల్ పొంగిపొర్లి రాజ్‌పురలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలోకి నీరు చేరింది.

ఆస్పత్రుల్లోకి చేరిన వరద

రాజస్తాన్‌లోని 14 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అజ్మీర్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి, జేఎల్‌ఎన్ ఆస్పత్రి వార్డుల్లోకి వరద నీరు ప్రవేశించింది. టోంక్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్, బదౌన్ జిల్లాల్లో ఇళ్లు కూలిన ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. షహరాన్‌పూర్‌లో 15 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాదిన మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది.

విపక్షాల భేటీకి సోనియా గాంధీ!



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ నెల 17, 18న జరిగే ప్రతిపక్షాల కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సైతం హాజరయ్యే అవకాశం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సోమవారం చెప్పారు. ఈ భేటీలో పాల్గొనాలని సోనియాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారని తెలిపారు. ఆమె రాబోతున్నట్లు తమకు సమాచారం అందిందని అన్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఒక్కటి కావాలని సూచించారు. దేశంలో మార్పు కోసం జరుగుతున్న మహా యుద్ధంలో పాల్గొనేందుకు ఎవరు ముందుకు వచ్చినా స్వాగతిస్తామని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తొలి సమావేశం జూన్ 23న బిహార్ రాజధాని పాట్నాలో జరిగిన సంగతి తెలిసిందే.

కిండర్‌గార్టెన్ వద్ద కత్తిపోట్లు.. ఆరుగురు మృత్యువాత

బీజింగ్: తన కుమారుడు కారు ప్రమాదానికి గురయ్యాడని ఓ వ్యక్తి ఉన్మాదిలా మారాడు. అతడి కత్తి పోట్లకు గురై ఆరుగురు చనిపోయారు. ఈ ఘటన చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని లిబ్జియాంగ్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక కిండర్‌గార్టెన్ వద్ద ఉదయం 25 ఏళ్ల ఓ వ్యక్తి కత్తి చేతబట్టుకుని ఏడుగురిని పొడిచాడు. వీరిలో ఆరుగురు చనిపోయారు. మృతుల్లో ఒక టీచర్, ఇద్దరు చిన్నారులు, మరో ముగ్గురు ఉన్నారు. మరొకరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో నిందితుడి కుమారుడిని కారుతో గుద్దిన వ్యక్తి ఉన్నారని వార్తా వెబ్‌సైట్లు చెబుతున్నాయి. దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉద్ధవ్ 'ఈసీ ఉత్తర్వు' పిటిషన్ 31న విచారణ



న్యూఢిల్లీ: శివసేన పేరు, ధనస్సు, విల్లంబు గుర్తు ఏక్‌నాథ్ షిండే వర్గానికి దక్కుతుందంటూ కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ నెలాఖరున విచారించనుంది. 'మే 11వ తేదీన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు ఈసీ వెలువర్చిన ఉత్తర్వు పూర్తిగా చట్టవ్యతిరేకం. పార్టీ పేరు, గుర్తును షిండే అక్రమంగా వినియోగిస్తున్నారు. త్వరలో వచ్చే ఎన్నికలు ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి కీలకం. అందుకే ఈ అంశాన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించండి' అంటూ న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ సుప్రీంకోర్టుకు కోరారు. దీంతో ఆ పిటిషన్‌ను 31వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం తెలిపింది. కాగా ఈ అంశంపై మహారాష్ట్రలో పార్టీ కార్యకర్తలతో భేటీ సందర్భంగా ఉద్ధవ్ మాట్లాడారు.' ఒక రాజకీయపార్టీకి ఎన్నికల గుర్తును కేటాయించే అధికారం ఈసీకి ఉంది. కానీ పార్టీ పేరును మార్చే అధికారం ఈసీకి లేదు' అని వ్యాఖ్యానించారు.

రాజ్యసభ బరిలో ఆరుగురు టీఎంసీ అభ్యర్థులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులను బరిలోకి దించాలని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. తమ అభ్యర్థులుగా డెరెక్ ఓబ్రెయిన్, సుఖేందు శేఖర్ రే, డోలా సేన్, బంగ్లా సంస్కృతీ మాంచా అధ్యక్షుడు సమీరుల్ ఇస్లామ్, టీఎంసీ నేత ప్రకాశ్ చిక్ బెరాయిక్, సమాచార హక్కు చట్టం కార్యకర్త, టీఎంసీ సీనియర్ నాయకుడు సాకేత్ గోఖలే పేర్లను సోమవారం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో ఆరు రాజ్యసభ స్థానాలను భర్తీ చేయడానికి ఈ నెల 24న ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్, గోవాలో మొత్తం నాలుగు స్థానాలకు సైతం ఎన్నికలు జరుగుతాయి.

ఏడాది చివరికి పూర్తి 'ఆవాస్'..!

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించే లక్ష్యంతో చేపట్టిన ప్రధాని మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకాన్ని ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి ఆదేశాలిచ్చింది. పీఎంఏవై(అర్బన్) కింద పట్టణ ప్రాంతాల్లో మొత్తం రూ.2 లక్షల కోట్లతో 1.18 కోట్ల గృహాలు నిర్మించాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇందులో ఇప్పటికే 76 లక్షల గృహాలు పూర్తయినట్లు కేంద్రం వెల్లడించింది. మరో 42 లక్షల గృహాల నిర్మాణాలను ఈ ఏడాది డిసెంబర్ నాటికే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర గణాంకాల లెక్కల ప్రకారం తెలంగాణలో 2.50 లక్షల గృహాలకు మంజూరులివ్వగా, ఇందులో 2.23 లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికే కేంద్రం తన వాటాగా ఇవ్వాల్సిన



రూ.4,475 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.3,314 కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 21.32 లక్షల గృహాలకు మంజూరునివ్వగా, ఇందులో 7.95 లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీనికై కేంద్రం తన వాటాగా రూ.32,499 కోట్లకు గాను రూ.20,045 కోట్లు విడుదల చేసింది. ఇక పీఎంఏవై(గ్రామీణ్) కింద కేంద్రం మొత్తంగా 2.93 కోట్ల గృహాల నిర్మాణాలను మంజూరులివ్వగా, అందులో 2.40 కోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 53 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది.

విద్వేష మెగామాల్ నడిపిస్తున్న రాహుల్: నడ్డా

గోద్రా: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మరోసారి విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రేమ దుకాణం కాదు విద్వేష మెగా మాల్ నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్‌తోపాటు కాంగ్రెస్ నేతలంతా ప్రధాని నరేంద్ర మోదీపై ద్వేషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. నడ్డా సోమవారం గుజరాత్‌లోని గోద్రాలో ఓ ర్యాలీలో మాట్లాడారు. విపక్షాలు పూర్తిగా కుటుంబ పార్టీలుగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. ఆయా పార్టీలకు సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మన ప్రధానమంత్రిని వ్యతిరేకించేందుకు ప్రయత్నిస్తూ దేశాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని నడ్డా దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి మన దేశం గురించి అసత్యాలు ప్రచారం చేశారని ఆక్షేపించారు.

ప్రిగోజిన్‌తో పుతిన్ భేటీ!

కీవ్: ఉక్రెయిన్‌లో యుద్ధంలో అరాచకాలకు పాల్పడుతూ అనూహ్యంగా రష్యా సైనిక నాయకత్వంపై తిరుగుబాటు చేసిన ప్రైవేట్ సైన్యం వాగ్నర్ గ్రూప్ అధిపతి ప్రిగోజిన్ ఇటీవల రష్యా అధ్యక్షుడితో భేటీ అయినట్లు తాజాగా వెల్లడైంది. ఈ వివరాలను రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ సోమవారం బహిర్గతంచేశారు. ఈ భేటీలో ప్రిగోజిన్‌తోపాటు ఆయన ప్రైవేట్ సైన్యం కమాండర్లు పాల్గొని తిరుగుబాటునాటి పరిస్థితులను పుతిన్‌కు వివరించారు. ఈ భేటీ ఏకంగా మూడు గంటలపాటు కొనసాగింది. జూన్ 24వ తేదీన తిరుగుబాటు జరగ్గా ఐదు రోజుల తర్వాత అంటే జూన్ 29వ తేదీన ఈ భేటీ జరిగినట్లు దిమిత్రి వెల్లడించారు. తిరుగుబాటుకు దారితీసిన కారణాలు, ఘటనలన్నింటినీ పుతిన్‌కు వాగ్నర్ చీఫ్, కమాండర్లు వివరించారు. ఇకమీదటా యుద్ధంలో సాయపడే అంశాన్ని పరిశీలించాలని వారికి పుతిన్ సూచించారు. మాతృభూమి కోసం



పోరాటం చేసేందుకు, రష్యా అధినేత ఆజ్ఞానుసారం పనిచేసేందుకు సిద్ధమని వారు హామీ ఇచ్చారు. ఈ భేటీలో మొత్తంగా 35 మంది పాల్గొన్నారు. మరోవైపు ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఒరిఖీవ్ పట్టణంలో ఒక పాఠశాలలో మానవతా సాయం కార్యక్రమం జరుగుతున్నపుడు భవనంపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలుసహా నలుగురు మరణించారు. 11 మంది గాయపడ్డారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం ၊ 11 ၊ జూలై ၊ 2023

సిటీ నుంచి నర్సాపూర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్–బెంగళూరు యశ్వంతపుర మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ఈ నెల 11 నుంచి నర్సాపూర్ రైల్వే జంక్షన్ (రైలు నం.07151) నుంచి ప్రతి మంగళవారం సాయంత్రం 6.గంటలకు బయలుదేరి మరుసటి రోజు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు యశ్వంతపురకు చేరుతుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరంటౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనికొండ మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక మీదుగా గమ్యం చేరుతుంది. తిరిగి 12వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు యశ్వంతపుర జంక్షన్ (రైలు నంబరు 07152) బయలుదేరి గురువారం 8.30 గంటలకు నర్సాపూర్ కి చేరుతుందన్నారు.

న్యూస్‌రీల్

బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో



ఆర్టీసీ బస్సులను అడ్డగించిన విద్యార్థులు

దొడ్డబళ్లాపురం: సమయానికి తమ గ్రామాలకు బస్సులు రావడంలేదని ఆగ్రహించిన విద్యార్థులు కేఎస్‌ఆర్టీసీ బస్సులను అడ్డగించి రాస్తారోకో చేసిన సంఘటన దొడ్డ తాలూకా హులికుంటె మరియు బీడిగెరె గ్రామాల వద్ద చోటుచేసుకుంది. దొడ్డబళ్లాపురం–తుమకూరు మార్గంలో అతి తక్కువ బస్సులను నడుపుతుండడంతో పలు గ్రామాల విద్యార్థులు సమయానికి పాఠశాల, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. నిత్యం డిపో మేనేజర్‌కు, స్థానిక నాయకులకు మనవి చేసుకున్నా ఫలితం లేకపోవడంతో సోమవారంనాడు తాలూకాలో రెండు చోట్ల రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రకటించి, బస్సుల సంఖ్యను తగ్గించింది. అదే సమయంలో ప్రతి బస్సు ఫుల్లుగా వస్తోంది. దీంతో సమస్య మరింత జటిలమైంది. బస్సులకు దారి వదలాలని విద్యార్థులతో కండక్టర్‌లు, డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. పోలీసుల జోక్యంతో ధర్నా విరమించారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: అడవి ఏనుగు దాడిలో తండ్రి మృతి చెందగా, కుమారుడు తృటిలో తప్పించుకున్న సంఘటన చామరాజనగర తాలూకా పీజీ పాళ్య సమీపంలోని ఆలదకెరె అటవీ ప్రదేశంలో చోటుచేసుకుంది. మాళిగనత్త గ్రామానికి చెందిన ప్రభుస్వామి (55) ఏనుగు దాడిలో మృతి చెందిన వ్యక్తి. ప్రభుస్వామి తన కుమారుడు చంద్రుతో కలిసి అడవిలో పరక కడ్డీలు కోసుకురావడానికి వెళ్లారు. తండ్రి, ఒకవైపు, కుమారుడు మరోవైపు కడ్డీలు కోస్తుండగా హఠాత్తుగా అడవి ఏనుగు దాడి చేసింది. తప్పించుకోలేని ప్రభుస్వామి ఏనుగు చేతచిక్కి మృతి చెందగా కుమారుడు చంద్రు పరిగెత్తి ప్రాణాలు దక్కించుకున్నాడు.

భక్తిభావంతో నందిగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో భక్తాదులు

చిక్కబళ్లాపురం: ఆషాఢమాసం చివరి సోమవారం నందిగిరి ప్రదక్షిణ ఉత్సాహంగా సాగింది. తొలిగా నందిగ్రామంలోని భోగనందీశ్వర ఆలయంలో మహాశివునికి పూజలు చేసిన భక్తులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. దాదాపు 14 కిమీ దూరం ఉంటుంది. భారీగా భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. చిక్కబళ్లాపురం, బెంగళూరు, దేవనహళ్లి, దొడ్డబళ్లాపురం, గౌరిబిదనూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు స్థానికులు అన్నదానం, మజ్జిగ, అందజేశారు. భక్తులు నందికొండ చుట్టుకొని అక్కడ నుండి కోడిబసవణ్ణ ఆలయం చేరుకొని అక్కడ బృహత్ నందిని దర్శించుకొని, మళ్లీ భోగనందీశ్వర ఆలయం చేరుకొని స్వామివారినిన మొక్కి తిరుగు ప్రయాణం చేశారు.

తీరంలో వీడని వర్షం



యశవంతపుర: తీర ప్రాంతం, దక్షిణ కర్ణాటక ప్రాంతంలో ఈ నెల 16 వరకు భారీగా వానలు పడే అవకాశం ఉన్నట్లు బెంగళూరు వాతావారణశాఖ అధికారులు తెలిపారు. దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి, కొడగు, చిక్కమగళూరు జిల్లాల్లో జోరుగా పడవచ్చంటూ ఎల్లో అలర్ట్‌ను జారీచేశారు. కొన్నిచోట్ల ఉరుములు–మెరుపులతో కూడిన వాన పడనుంది. ఉడుపి జిల్లాలో వర్షాలకు కాపు తాలూకా ఇన్నంజె–కల్యా మధ్య వంతెన దెబ్బతింది. వందల ఎకరాల వరి పంట దెబ్బతింది. బెంగళూరులో అదివారం రాత్రి జడివాన కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి నగరం చుట్టుపక్కల వర్షం కురిసింది.

బెళగావిలో

వారం రోజుల నుంచి పశ్చిమ ఘాట్లలో భారీ వానల కారణంగా నదులు, వాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో జలాశయాలకు నీరు వచ్చి చేరుతోంది. మలెనాడు, కరావళి భాగంలో పడుతున్న వానలతో పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేశారు. జాతీయ రహదారి– 55లో కార్వార వద్దనున్న సారంగ మార్గంలో వాహనాల సంచారాన్ని నిషేధించారు. బెళగావి జిల్లా ఖానాపుర తాలూకాలోని పశ్చిమ ఘాట్లలో వానలు పడుతున్నాయి.

భయంకరం.. బాధాకరం

- జైనముని హత్యపై అసెంబ్లీలో అన్ని పార్టీల స్పందన
- సీబీఐ దర్యాప్తునకు బీజేపీ పట్టు
- కాంగ్రెస్ సర్కారుపై తీవ్ర విమర్శలు

శివాజీనగర: బెళగావి జిల్లా చిక్కోడి వద్ద ఉన్న నంది ఆశ్రమం జైనముని కామకుమార నంది హత్యపై సోమవారం విధానసౌధలో ఉభయ సభల్లో తీవ్ర చర్చ జరిగింది. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. విధానసభ మొదలు కాగానే బీజేపీ నేత బసవరాజ బొమ్మై వాయిదా తీర్మానం కింద జైనముని హత్యపై చర్చించాలని స్పీకర్ యూ.టీ.ఖాదర్‌కు విన్నవించారు. చివరకు జీరో అవర్‌లో చర్చ ఆరంభమైంది. బీజేపీ సభ్యులు అభయ్ పాటిల్, బసవనగౌడ పాటిల్ యత్నాళ్, శశికళా జొల్లె తదితరులు మాట్లాడుతూ జైనముని హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. చరిత్రలోనే మునుపెన్నడూ జరగని సంఘటన ఇదని అన్నారు. జైన సముదాయానికి భంగం వాటిల్లింది, పోలీసులు సక్రమంగా విచారణ జరపలేరు, సీబీఐకి అప్పగించాలని పట్టుబట్టారు. హత్యలో తొలి నిందితుడైన నారాయణ మాళియను అరెస్ట్ చేసి, రెండో నిందితుడు హసేన్‌ను తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యుడు లక్ష్మణ సవది ఈ హత్య కేసుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి హంతకులకు మరణశిక్ష విధించాలన్నారు. డబ్బు కోసమే హత్య జరిగిందనేది అవాస్తవమని వీరం దరూ అన్నారు. జైనముని హత్య జరిగి మూడు రోజులు గడిచినా కూడా ముఖ్యమంత్రి సంతాపం తెలపలేదు, వేరే మతాలవారైతే చూస్తూ మౌనంగా ఉండేవారా? హిందువులకు భద్రత లేదా అని యత్నాళ్ ఘాటుగా ప్రశ్నించారు.

నిందితులను దాచిపెడుతున్నారు

సభాపతి యూటీ ఖాదర్ జోక్యం చేసుకుంటూ, జైనముని హత్య భయంకరమైనది. నిందితులకు కఠిన శిక్ష విధించాలి. ఇందులో రాజకీయం చేయరాదని సలహానిచ్చారు. బీజేపీ సభ్యుడు సునీల్ కుమార్ మాట్లాడుతూ, ఈ భయంకరమైన హత్యతో రాష్ట్ర ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ కేసులో మిగతా నిందితుల పేర్లను ఎందుకు బహిరంగపరచటం లేదు. ఎందుకు నిందితులను కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఇదే మాదిరిగా విధాన పరిషత్‌లో కూడా జైనముని హత్య కేసుపై గందరగోళం నెలకొంది. మంత్రులు హెచ్‌కే పాటిల్, ప్రియాంక్ ఖర్గేలు మాట్లాడుతూ రాష్ట్ర పోలీసులే ఈ కేసును దర్యాప్తు చేస్తారని తెలిపారు. మరోవైపు హత్యను ఖండిస్తూ చిక్కోడిలో జైనసంఘాల వారు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.



సోమవారం ఉదయం విధానసభ సమావేశం



జైన ముని హత్యకు వ్యతిరేకంగా చిక్కోడిలో జైనుల ధర్నా



చిక్కోడిలో జెండాలు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న జైన మహిళలు

సీబీఐ దర్యాప్తు అవసరం లేదు: హోంమంత్రి

హుబ్లీ: బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా హిరేకోడి ఆశ్రమం జైనముని కామకుమార నంది మహారాజ హత్యోదంతంపై రాజకీయ చేయరాదని, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని హోంమంత్రి జీ.పరమేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన నగర విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఘటన జరిగినప్పుడు ఎవరూ కూడా పక్షపాతం చూపరని అన్నారు. జైనముని అదృశ్యంపై ఫిర్యాదు నమోదైన తక్షణమే పోలీసులు అన్వేషించారన్నారు. బావిలో వేసిన మృతదేహాన్ని కనుగొని చర్యలు తీసుకున్నారన్నారు, పోలీసులు బాగా పనిచేశారని అభినందిస్తున్నానన్నారు. హత్యపై నిరసనకు దిగిన జైనమునితో తాను కూడా మాట్లాడానని, వారి డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చానన్నారు. హత్య కేసును సీబీఐకు అప్పగించాలన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యలపై స్పందించిన ఆయన, ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించామని, ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

కరెంటు బిల్లు గొడవలో దాడి

దొడ్డబళ్లాపురం: కరెంట్ బిల్ ఇవ్వడానికి వెళ్లిన బెస్కాం సిబ్బందిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన రామనగర పట్టణ పరిధిలోని టిప్పునగర్ కాలనీలో జరిగింది. మామూలుగా వచ్చే బిల్ కంటే ఎక్కువ బిల్ వచ్చిందనే కోపంతో రఫిక్, చిన్మయ్ అనే ఇద్దరు వ్యక్తులు బెస్కాం సిబ్బందిపై దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఇస్తోందని, అయినా బిల్ ఇస్తావా అంటూ బెదిరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామనగర పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోస్టర్ల ప్రదర్శనపై స్పీకర్ వర్సెస్ బీజేపీ

శివాజీనగర: శాసనసభ సమావేశాల్లో పోస్టర్లు ప్రదర్శించరాదని సభాధ్యక్షుడు యూటీ ఖాదర్ శాసనసభలో సూచించారు. సోమవారం ఉదయం సమావేశాలు ఆరంభం కాగానే జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకుర్ ఓ పోస్టర్‌ను ప్రదర్శించి, తమ నియోజకవర్గంలో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ విషయంపై ప్రస్తావించేందుకు అవకాశం ఇవ్వాలని కోరటానికి సిద్ధమయ్యారు. సభాధ్యక్షుడు ఖాదర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాతపూర్వకంగాగా నోటీసు ఇస్తే చర్చకు అవకాశం ఇస్తామని, జీరో అవర్‌ను ఉపయోగించుకోవచ్చని సలహానిచ్చారు. పోస్టర్లు ప్రదర్శించరాదని అన్నందుకు బీజేపీ సీనియర్ సభ్యులు సీసీ పాటిల్, అశ్వత్థనారాయణ అభ్యంతరం వ్యక్తం చేసి, మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రదర్శించలేదా అని ప్రశ్నించారు. గతంలో ఉన్న సభాధ్యక్షుడు కూడా ఇదే విధంగా సూచించారని అన్నారు.

అన్నభాగ్య నగదు బదిలీ షురూ

బనశంకరి: అన్నభాగ్య పథకం నగదు బదిలీకి సోమవారం విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. ఇటీవల మేనిఫెస్టోలో కార్డుదారులకు ప్రతి కుటుంబానికి 10 కిలోల బియ్యం అందిస్తామని ప్రకటించింది. అయితే బియ్యం లభించని కారణంగా కార్డుదారులకు 5 కేజీలు మాత్రమే ఇస్తున్నారు. మిగతా 5 కేజీలకు ప్రతి కిలోకు రూ.34 చొప్పున లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లకు రూ.170 నగదు జమచేసే ప్రక్రియ ను సిద్దరామయ్య ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

జలావాసం వీడిన విఠలుడు



దేవాలయం వద్ద భక్తుల సందోహం

- కృష్ణా నదిలో బయటపడ్డ ఆలయం

రాయచూరు రూరల్: ప్రస్తుతం వానలు పడక కృష్ణా నదిలో నీరు కరువైంది. ఫలితంగా ఇప్పటివరకు బయటపడని దేవాలయాలు, ప్రాచీన కట్టడాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. బెళగావి జిల్లా హిడకల్ డ్యాంలో నీరు లేకపోవడంతో ఏళ్లతరబడి నీటిలో మునిగి ఉన్న విఠల్ ఆలయం బయటపడింది. దీంతో ప్రజలు ఆలయాన్ని చూడడానికి తరలివచ్చారు. వర్షాలు వచ్చి ఆల్మట్టి డ్యాం నుంచి నీరు వదిలితే తిరిగి విఠల దర్శన భాగ్యం లభించదనే భావనతో భక్తులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చి ఆలయ దర్శనం చేస్తున్నారు. సన్నతి, దుత్తరిగి భాగ్యమ్మ, యాదగిరి జిల్లా తింథిణి మౌనేశ్వర, రాయచూరు జిల్లాలో దేవదుర్గ తాలూకా గూగల్ అల్లమప్రభు, కొప్పర లక్ష్మీ నరసింహ ఆలయం, రాయచూరు తాలుకా నారదగుడ్డ దత్తాత్రేయ దేవస్థానం, కుర్వ కులకుర్ద చెన్న బసవేశ్వర ఆలయాలు ఎప్పుడూ కృష్ణా జలాల్లోనే మునిగి ఉంటాయి. ఇప్పుడు నదులలో నీరులేక చారిత్రక కట్టడాలు, దేవాలయాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఆక్రమిత అటవీ భూముల స్వాధీనానికి చర్యలు

శివాజీనగర: రాష్ట్రంలో వివిధ భాగాల్లో ఆక్రమణకు గురైన అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రభుత్వం చేపట్టిందని అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె విధాన పరిషత్‌లో తెలిపారు. ఇప్పటికే ఖాళీ చేయించేందుకు నోటీస్ ఇచ్చామని, అంతేకాకుండా హైకోర్టులో పెండింగ్‌లో కేసుల పరిష్కారానికి చట్టపరమైన కమిటీ ఏర్పాటు చేసి దానిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. బీజేపీ సభ్యుడు మునిరాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన మంత్రి, రాష్ట్ర వ్యాప్తంగా అటవీ భూముల ఆక్రమణలు తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. బెంగళూరు చుట్టుపక్కల 704 కేసుల్లో 2284 ఎకరాల అటవీ భూమి అక్రమణకు గురైందన్నారు. 2013 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కొత్త తాలూకాల ఏర్పాటుకు విధానాలు

శివాజీనగర: రాష్ట్రంలో కొత్త తాలూకాల ఏర్పాటుకు తగిన విధానాలను రూపొందిస్తామని, వాటిని కట్టుదిట్టంగా పాటిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. విధానసభలో మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు 63 కొత్త తాలూకాలను ఏర్పాటు చేయడమైనది. వాటిలో అనేక చోట్ల భవనాలు లేవు, పరిపాలనా ప్రక్రియలో వేగం పుంజుకోలేదు. తగిన విధానాలు లేకుండా కొత్త తాలూకాలను ఏర్పాటు చేశారని గత సర్కారుపై మండిపడ్డారు. ఎంబీ పాటిల్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఇకపై కొత్త తాలూకా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రఘుమూర్తి మాట్లాడుతూ చెళ్లకెర తాలూకాలోని పరశురామ ఫిర్కాను కొత్త తాలూకాగా ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి కోరుతున్నానని, అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు.

ప్రగతికి దోహదపడే విద్య కావాలి



స్నాతకోత్సవంలో పట్టాలు, బంగారు పతకాలు అందుకున్న ప్రతిభావంత పట్టభద్రులు

బనశంకరి: దేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాంకేతికాభివృద్ధికి దోహదపడే విద్యను అందించడం అవసరమని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అన్నారు. సోమవారం నగరంలోని సెంట్రల్‌కాలేజీలో బెంగళూరు నగర యూనివర్శిటీ రెండవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మానవ సమాజానికి వాతావరణ మార్పులతో ముప్పు తలెత్తిందని, దీంతో సరళమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతిభావంత విద్యార్థులు ఆదర్శ సమాజం ఏర్పాటుకు మూలస్తంభాలన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఆయన పట్టాలను, పతకాలను బహూకరించారు. వుడా కృష్ణ, నిస్సార్ అహ్మద్ తారిణి చిదానందలకు గౌరవ డాక్టరేట్లను బహూకరించారు.

పేలుడులో కూలీలకు గాయాలు

బనశంకరి: కట్టడ నిర్మాణ పనుల సమయంలో జిలెటిన్ స్టిక్స్ పేలి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన నగరంలో వైట్‌ఫీల్డ్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 6వ తేదీ రాత్రి 11.30 సమయంలో కట్టడం నిర్మాణం కోసం బండలను పేల్చేందుకు జిలెటిన్ స్టిక్స్‌ను సిద్ధం చేస్తుండగా హఠాత్తుగా పేలిపోయి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనివాస్, మణికంఠ అనేవారిని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా వీరి పరిస్థితి విషమంగా ఉంది. వైట్‌ఫీల్డ్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

బాంబు బెదిరింపు కేసులో నిందితుడి అరెస్ట్

శివాజీనగర: బాంబు బెదిరింపు ఘటనలో ఓ వ్యక్తిని శివాజీనగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని మహారాష్ట్రకు చెందిన సయ్యద్ మహ్మద్ అన్వర్ (37)గా గుర్తించారు. వివరాలు...ఈనెల 4న అన్వర్ నగరంలోని శివాజీనగర రసెల్ మార్కెట్ వెనుక ఉన్న అజాం మసీదుకు వచ్చాడు. చందా తీసుకుని రాత్రి అక్కడే బస చేయడానికి అనుమతి కోరగా మసీదు సిబ్బంది నిరాకరించారు. మెజెస్టిక్‌కు వెళ్లి కర్నూల్ బస్సు ఎక్కాడు. బస్సు దేవనహళ్లి దాటుతుండగానే పోలీస్ సహాయవాణికి కాల్ చేసి అజాం మసీదులో బాంబు పెట్టినట్లు చెప్పి ఫోన్ పెట్టేశాడు. పోలీసులు ఫోన్ నంబరు ఆధారంగా విచారించి అతన్ని అరెస్టు చేశారు.

13,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు

శివాజీనగర: కోర్టు తీర్పు అనంతరం విద్యాశాఖలో ఖాళీగా ఉన్న 13,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రాథమికోన్నత విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప విధాన పరిషత్‌లో సోమవారం తెలిపారు. సోమవారం కూడా రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో చర్చించామన్నారు. హైకోర్టులో ఉన్న స్టే తొలగించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అబ్దుల్ జబ్బార్, మంజునాథ్ భండారి లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన మంత్రి, ప్రభుత్వం 15 వేల ఉద్యోగాల మంజురు చేసిందని, అందులో 13,500 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ జరిగింది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాల పిల్లలకు యూనిఫారం, షూ పంపిణీ చేశామని మంత్రి తెలిపారు.

ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచలేం

యశవంతపుర: ఆశా కార్యకర్తల వేతనాలు పెంచటం సాధ్యంకాదని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. విధాన పరిషత్‌లో ప్రశ్నోత్తర సమయంలో జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచటంతో పాటు పింఛన్, కొత్త స్మార్ట్‌ఫోన్ ఇవ్వాలని అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వేతనాలు పెంచే విషయం ప్రభుత్వ దృష్టిలో లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఐదు వేలు గౌరవ ధనం, కేంద్రం నుంచి ఎనిమిదివేలు గౌరవధనం ఇస్తున్నట్లు తెలిపారు.

జయజనని చాముండేశ్వరీ

- వైభవంగా అమ్మవారి ఉత్సవాలు



చాముండిగిరులపై అమ్మవారి ఊరేగింపు



పల్లకీలో అమ్మవారి ఊరేగింపు వేడుక

మైసూరు: నాడిన శక్తిదేవత మైసూరు చాముండి కొండపైన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి సోమవారం పుట్టిన రోజు వేడుకలను వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. శ్వేత రంగు చీర అలంకరణలో అమ్మవారిని బంగారు పల్లకీ పైన కూర్చుండబెట్టి చాముండి కొండ పైన ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. రాజవంశీకులు యదువీర్, ఆయన భార్య త్రిషికాసింగ్, రాజమాత ప్రమోదాదేవి ఒడెయార్, దేవాదాయ శాఖ మంత్రి రామలింగా రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు తెల్లవారుజామున 3.30 గంటలకు గర్భగుడిలో విశేష పూజలు చేశారు. ఆలయం లోపల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలిరావడంతో చాముండిగిరులు కిక్కిరిశాయి.

విధానసౌధ.. అధిక భద్రత

- ఆగంతకుని చొరబాటుతో చర్యలు



సందర్శకులను తనిఖీ చేస్తున్న దృశ్యం

బనశంకరి: ఈ నెల 7వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో గుర్తుతెలియని వృద్ధుడు ఏకంగా విధానసభలోకి ప్రవేశించి ఎమ్మెల్యే కుర్చీలో కూర్చోవడం కలకలం రేకెత్తించడం తెలిసిందే. అసెంబ్లీలో భద్రతా వ్యవస్థ ఎలా పనిచేస్తోందో ఈ సంఘటన చాటిచెప్పింది. పోలీసులు విచారణ జరిపి ఆ వృద్ధుడు శివరుద్రప్ప అనే వ్యక్తిగా గుర్తించారు. మరోవైపు ఇటువంటి భద్రతా వైఫల్యాలు పునరావృతం కాకుండా సోమవారం విధానసౌధ గేట్ల వద్ద పటిష్ట బందోబస్తు కల్పించారు. విధానసౌధ ముఖద్వారం , ప్రవేశద్వారాల్లో అదనపు భద్రత కల్పించారు. ఎమ్మెల్యేల కలర్ ఫోటో, పేరు కలిగిన జాబితాలు పట్టుకుని పోలీసులు తనిఖీ చేసి లోనికి పంపారు.

స్పీకర్, కమిషనర్ తనిఖీ

విధానసౌధలో భద్రతను పెంచాలని అధికారులకు సూచించానని స్పీకర్ యటీ.ఖాదర్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ తో కలిసి భద్రతను పరిశీలించారు. రానున్న రోజుల్లో లోపం లేకుండా కొత్త విధానంలో భద్రత కల్పించాలని సూచించినట్లు తెలిపారు. విధానసౌధలో ప్రజలపై అధిక ఆంక్షలు విధించడం సాధ్యం కాదని, కొత్త ఎమ్మెల్యేలు, మంత్రులకు అవగాహన లేనందున కొంత గందరగోళం సహజమన్నారు.

కత్తితో వచ్చిన ఉద్యోగిని

తనిఖీల్లో మహిళా ఉద్యోగి వద్ద బ్యాగులో చాకు లభ్యమైంది. విధానసౌధ తూర్పు గేట్‌లో మహిళ బ్యాగ్‌ను స్కాన్ చేయగా, కత్తి కనిపించడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మహిళ విధానసౌధలో కన్నడ అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి ఆఫీసులో కాంట్రాక్టు ఉద్యోగినిగా గుర్తించారు. ఆ వెంటనే ఆమెను వెనక్కి పంపారు. కత్తి ఎందుకు తీసుకువచ్చిందో విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

తుంగభద్రకు స్వల్పంగా వరద

కంప్లి: గత ఏడాది ఈ పాటికే జలాశయం నిండి నదికి నీటిని విడుదల చేశారు. అయితే ఈ ఏడాది ఆలస్యంగా రుతుపవనాల రాకతో ఎగువ భాగంలో ఇటీవల పుష్కలంగా వర్షాలు కురవడంతో జలాశయంలోకి వరద ప్రారంభమైంది. తుంగభద్ర డ్యాంలోకి ఆదివారం ఒకే రోజు 2 అడుగుల మేర నీరు వచ్చి నిల్వ చేరింది. ఆదివారం డ్యాంలో నీటిమట్టం 1576.72 అడుగులు ఉండగా సోమవారానికి 1578.79 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం జలాశయానికి 9892 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయంలో నీటి నిల్వ సోమవారానికి 3.911 టీఎంసీలకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో నీటి నిల్వ 80.550 టీఎంసీలు ఉండగా నీటిమట్టం 1622.22 అడుగులుగా ఉండేది. రాబోయే రోజుల్లో జలాశయంలోకి మరింత నీరు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

జెడ్పీ సీఈఓ పర్యటన


చెరువును పరిశీలిస్తున్న శశిధర్

రాయచూరు రూరల్: గ్రామాల్లో పర్యటనకు జెడ్పీ సీఈఓ శశిధర్ శ్రీకారం చుట్టారు. సోమవారం సిరవార తాలూకా మల్లటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని ఇస్తున్నారా? అని ఆరా తీయడంతో పాటు నరేగ పథకంలో నిర్మించిన మధ్యాహ్న భోజనం గదులను, గ్రామంలో నిర్మించిన నీటి కొలనును పరిశీలించారు.

ఎమ్మెల్సీ పదవినివ్వాలి

శివాజీనగర: పారిశుద్ధ్య కార్మికుల, సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.విజయకుమార్ సింహను విధానపరిషత్‌కు నామినేట్ చేయాలని వివిధ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడిగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి సేవలందిస్తున్న ఆయనకు పదవినివ్వాలని కోరారు. ప్రెస్‌క్లబ్‌లో బీబీఎంపీ పారిశుద్ధ్య కార్మికుల, డీ గ్రూపు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.నారాయణ, కర్ణాటక ఆది జాంబ సంఘం కార్యదర్శుడు సిద్దరాజు, కర్ణాటక సఫాయి కర్మాచారి పరిషత్ ఉపాధ్యక్షుడు జై ప్రకాశ్, ఎం.ఎస్.గోపాల్, గంగాధర్ తదితరులు ఈ మేరకు డిమాండ్ చేశారు.

క్రూజర్ బోల్తా.. ఇద్దరు మృతి


నుజ్జునుజ్జయిన క్రూజర్

సాక్షిబళ్లారి: డ్రైవర్ అదుపు తప్పి క్రూజర్ బోల్తా పడడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన విజయపుర జిల్లాలో చోటు చేసుకుంది. ఆ జిల్లాలోని దేవర హిప్పరగి, బైరవాడి క్రాస్ సమీపంలో ఆదివారం సాయంత్రం విజయపుర నుంచి బింజలబావి గ్రామానికి చెందిన 12 మంది క్రూజర్ వాహనంలో వెళుతుండగా, వాహనం అదుపు తప్పడంతో హుస్సేన్ బాషా(40), అజ్జానందాఫ్(20) అనే ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి, పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా కొండయ్య జన్మదిన వేడుక


కేసీ కొండయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

బళ్లారిటౌన్: నగరంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కేసీ కొండయ్య జన్మదిన వేడుకను ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కోట మల్లేశ్వర, కనకదుర్గమ్మ దేవస్థానాలను దర్శించుకున్న తర్వాత ఆయన ఇంటికి భారీగా అభిమానులు తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపారు. మాజీ బుడా అధ్యక్షులు నారా ప్రతాప్‌రెడ్డి, డీసీసీ జిల్లాధ్యక్షులు మహ్మద్ రఫీక్, చంద్రశేఖర్, ఎన్.వీరారెడ్డి, మానయ్య, వెంకటేష్ హెగ్డే, కార్పొరేటర్లు గాదెప్ప, ముల్లంగి సందీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు కేటాయించండి

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమ సక్రమ పథకం కింద పేదలకు ఇళ్లు కేటాయించాలని భూమి పోరాట సమితి అధ్యక్షుడు ఆంజినేయ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు దున్నుకోడానికి భూములు, కట్టుకోడానికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బంజరు భూముల సాగుకు అవకాశం కల్పించాలని, అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమీక్షించి పొలాల హద్దులను వేయాలని కోరారు.

ఉజ్వల భవిష్యత్ కోసం కలిసి పనిచేద్దాం


హంపీలో జీ-20 సదస్సును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి


హంపీలోని పురాతన స్మారకాల వద్ద పూర్ణకుంభాలతో బంజారా మహిళలు

- హంపీలో మూడో రోజు జీ-20 సీడబ్ల్యూజీ సదస్సులో కేంద్రమంత్రి

హొసపేటె: హంపీలో మూడో రోజు జీ-20 కల్చరల్ వర్కింగ్ గ్రూప్(సీడబ్ల్యూజీ) సదస్సును సోమవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, ఉజ్వల భవిష్యత్ కోసం అందరూ కలిసికట్టుగా పని చేద్దాం అన్నారు. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ హంపీ గ్రూప్ ఆఫ్ మాన్యుమెంట్స్‌లో భాగమైన విజయ విఠల ఆలయం, రాయల్ ఎన్‌క్లోజర్, ఎదురు బసవణ్ణ వేదిక తదితర వారసత్వ ప్రదేశాలకు, తుంగభద్ర నది తెప్పల్లో ప్రతినిధులను విహారానికి తీసుకెళ్తామన్నారు. పట్టాభిరామస్వామి ఆలయంలో జరిగే యోగా కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. వివిధ దేశాల ప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అలరించిన లంబాణి చేనేత వస్తు ప్రదర్శన

సదస్సు సందర్భంగా సోమవారం సాయంత్రం హంపీలో ఎదురు బసవణ్ణ వేదిక వద్ద సండూరు కుశల కళా కేంద్రం ఆధ్వర్యంలో 450 మంది పైగా మహిళలు తయారు చేసిన చేనేత వస్త్రాల ఎంబ్రాయిడరీ వర్క్‌ను ప్రదర్శించారు. ఈ ఎంబ్రాయిడరీ వర్క్ దుస్తులు చూపరులను ఎంతో ఆకట్టుకొన్నాయి. బీదర్‌కు చెందిన సంప్రదాయ లంబాణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


హంపీలో ప్రధాన వీధిలో బంజారా మహిళల ర్యాలీ

ఫొటో గొడవలో యువకుడు హత్య

- టి.నరిసిపురలో ఉద్రిక్తత


హతుడు వేణుగోపాల్ నాయక

మైసూరు: చిన్నవిషయానికి రెండు గుంపుల మధ్య జరిగిన గొడవలో హిందూ యువ బ్రిగేడ్ కార్యకర్త హత్యకు గురైన ఘటన జిల్లాలోని టి. నరిసిపురలో సంతెమాదళ వద్ద చోటు చేసుకుంది. స్థానిక శ్రీరాంపుర కాలనీకి చెందిన వేణుగోపాల్ నాయక (30) హతుడు. రెండు రోజుల క్రితం జరిగిన హనుమాన్ జయంతి ఊరేగింపు నిర్వహించగా, అందులో వాహనంపై కొందరు భారతమాత ఫోటో ముందు దివంగత హీరో పునీత్ రాజ్‌కుమార్ చిత్రాన్ని ఉంచారు. దీనిని కొందరు వ్యతిరేకించారు. ఎవరి ఫోటోను పెట్టవద్దని వేణుగోపాల్ పునీత్ చిత్రాన్ని తీసేశాడు. ఇక ఆదివారం మధ్యాహ్నం దీనిపై రెండు గుంపుల మధ్య గొడవలు మొదలయ్యాయి, రాత్రికి రాజీ పంచాయతీలు కూడా జరిగాయి. కొందరు మాట్లాడాలని వేణుగోపాల్‌ను తీసుకెళ్లి సీసాలతో పొడిచి హత్య చేశారు. హతుని భార్య పూర్ణిమ పోలీసులకు ఫిర్యాదు చేయగా మణికంఠ, సందేష్, శంకరెగౌడ, అనిల్, మంజు, హ్యారిస్ అనేవారిపై కేసు నమోదు చేశారు. సోమవారం యువ బ్రిగేడ్ కార్యకర్తలు పట్టణంలో బంద్ నిర్వహించారు.

కరువు జిల్లాగా ప్రకటించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నేతలు

రాయచూరు రూరల్: ప్రభుత్వం రాయచూరును కరువు జిల్లాగా ప్రకటించాలని కర్ణాటక ప్రాంత రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు కరియప్ప మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించి ఆదుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పల్లెనిద్రలోనూ పరిష్కారం శూన్యం

నాలుగు నెలల క్రితం నిర్వహించిన జిల్లాధికారి నడక పల్లె దిశగా కార్యక్రమంలో వివరించినా సమస్యలు పరిష్కారం కాలేదని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు రమేష్ హీరా మాట్లాడారు. అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజల సమస్యలు విన్నా వాటిని పరిష్కరించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు జిల్లాధికారి దురుగేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

అధికారి బదిలీకి వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న శివకుమార్ యాదవ్

రాయచూరు రూరల్: జెడ్పీ ఆధీనంలోని గ్రామీణ నీటిపారుదల శాఖాధికారి సయ్యద్ ఫజల్‌ని బదిలీ చేయాలని జయ కర్ణాటక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను ద్దేశించి అధ్యక్షుడు శివకుమార్ యాదవ్ మాట్లాడారు. అక్రమ సంపాదనతో లోకాయుక్త అధికారుల వలలో చిక్కిన కొప్పళ ఇంజినీర్ ఫజల్‌ను రాయచూరు జిల్లాలో నియమించడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. కొప్పళలో ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆయన నిజస్వరూపం బయట పడడంతో ప్రభుత్వం సస్పెండ్ చేయకుండా కేవలం నాలుగు రోజులకే రాయచూరు కేటాయించిందని, ఆయన బదిలీని రద్దు చేయాలని స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో గోవిందరాజులు, కరుణాకర్‌రెడ్డి, బావస్ అలీ, రఫీక్, దేవరాజ్‌లున్నారు.

కేంద్ర కమిటీ సభ్యుల భేటీ

మైసూరు: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సామాజిక న్యాయం, సబలీకరణ పార్లమెంటరీ సమితి అధ్యక్షురాలు రమాదేవి, సభ్యులు సోమవారం మైసూరులో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎస్సీలు, ఓబీసీ, సఫాయి కర్మచారుల పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు, మత్తు పదార్థాలకు బానిసలుగా మారినవారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ఇతర సంక్షేమ పథకాలపై చర్చ జరిగింది. ఎస్సీ కార్పొరేషన్, సఫాయి కర్మచారి కమిషనర్, బీసీ మండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతివృష్టి పరిహారంలో అక్రమాలు: మంత్రి

శివాజీనగర: గతంలో అతివృష్టితో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం అందించడంలో నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై తనిఖీ చేపట్టి చర్యలు తీసుకొంటామని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ విధాన సభలో తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ అతివృష్టితో ఇల్లు కూలిపోయిన కుటుంబాలను గుర్తించి ఇళ్ల నిర్మాణానికి నిధులు అందించామన్నారు. ఈ నిధుల విడుదలలో అవినీతి జరిగితే అధికారులపై చర్యలు తప్పవన్నారు. గత ఫిర్యాదులపై పునస్సమీక్ష జరిపి 973 ఇళ్లకు గాను 243 ఇళ్లకు సహాయం రద్దు చేసి మిగతావారికి ఇళ్లు నిర్మించుకోవటానికి పరిహారం ఇచ్చామన్నారు. ఇందులో కూడా అనర్హులు ఉన్నట్లు ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే విచారణ జరుపుతామన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నిర్మించాలి


మాట్లాడుతున్న ఎం.భరత్

కంప్లి: కంప్లి షుగర్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితిలో ప్రైవేట్ పరంగా కొనసాగనివ్వబోమని ఫ్యాక్టరీ పోరాట సమితి సంచాలకుడు ఎం.భరత్ పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 176 ఎకరాల్లో చేపట్టిన కర్మాగార నిర్మాణాన్ని సీఎం సిద్ధరామయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేల సహకారంతో పూర్తి చేసి రైతులకు సహాయపడాలన్నారు. కర్మాగారం వల్ల నిరుద్యోగ సమస్య తీరి, వ్యాపార వ్యవహారాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయమై కర్మాగార పునశ్చేతన పోరాట సమితి, రైతుల ఆధ్వర్యంలో త్వరలో ఒక బృందంతో ముఖ్యమంత్రి మద్దతు వెళతామన్నారు. రైతు ప్రముఖులు చల్లా వెంకట నాయుడు, బి.నారాయణప్ప, హెచ్ఎం.లింగనగౌడ, బీ.అంబణ్ణ, డీ.యల్లప్ప, జీ.లింగనగౌడ, జగదీశ్‌గౌడ మల్లనగౌడ, భాస్కరరావు, రంగయ్య పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

హుబ్లీ: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త తన భార్యపై గొడ్డలితో దాడి చేసి దారుణంగా హతమార్చిన ఘటన హుబ్లీ ఆనంద్‌నగర బ్యాహట్టి ప్లాట్‌లో సోమవారం జరిగింది. భీమప్ప ముత్తగి అనే వ్యక్తి తన భార్య మంజులను హత్య చేసి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఘటన స్థలాన్ని ఏసీపీ ఆర్‌కే పాటిల్, పాత హుబ్లీ సీఐ సురేష్, ఎస్ఐ బన్నికొప్ప పరిశీలించారు. ఘటనపై పాత హుబ్లీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు పరిహారమేదీ?


వినతిపత్రాన్ని అందిస్తున్న చెన్న బసవ

రాయచూరు రూరల్: జిల్లాలో మరణించిన పాత్రికేయుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పరిహారం అందించాలని జిల్లా ప్రాంతీయ పత్రికల సంపాదకుల సంఘం అధ్యక్షుడు చెన్నబసవ డిమాండ్ చేశారు. సోమవారం బెంగళూరులో ముఖ్యమంత్రి మీడియా సలహాదారుడు ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మాన్విలో శ్రీనివాస్, ప్రమాదంలో మరణించిన కృష్ణ కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు.

ఉద్యోగ భద్రతకు డిమాండ్


మాట్లాడుతున్న అతిథి ఉపన్యాసకులు

బళ్లారిటౌన్: డిగ్రీ కళాశాల అతిథి ఉపన్యాసకులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేసి బకాయి వేతనాలను విడుదల చేయాలని అతిథి ఉపన్యాసకుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దుర్గప్ప తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం పత్రికాభవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాతికేళ్లుగా తక్కువ వేతనాలతో పని చేస్తున్న 11 వేల మంది అతిథి ఉపన్యాసకులను ప్రతి 10 నెలలకు ఒకసారి ఆన్‌లైన్‌లో నవీకరణ చేస్తూ తమ సీనియార్టీని ప్రభుత్వాలు దెబ్బ తీస్తున్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో అతిథి ఉపన్యాసకులకు రూ.30 వేల గౌరవ వేతనం ఇస్తున్నా కర్ణాటకలో మాత్రం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తమకు ఇవ్వాలని, సీనియార్టీ ఆధారంగా పర్మినెంట్ చేయాలని, తమ బాధలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. హెచ్.హనుమేష్, సిద్దేశ్, గోవిందు, ఎంఎస్.రఫీక్, రామచంద్రరావు, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయచూరు రూరల్: పని చేయని మొబైల్ ఫోన్లతో రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు విధులు నిర్వహించడం కష్టంగా మారిందని రాష్ట్ర అంగన్‌వాడీ కార్యకర్తల సమాఖ్య పేర్కొంది. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షురాలు పద్మ మాట్లాడారు. రాయచూరు డివిజన్‌లో కార్యకర్తల ఫోన్లు చెడిపోయినా వివిధ పథకాలను మొబైల్ ఫోన్లలో చేయాలని అధికారులు సూచించడాన్ని తప్పుబట్టారు. సత్వరం కార్యకర్తలకు కొత్త మొబైల్ ఫోన్లను అందించాలని మనవి చేశారు. కార్యకర్తలు తెచ్చిన మొబైల్ ఫోన్లను శిశు అభివృద్ధి అధికారి చేతన్ కుమార్‌కు అప్పగించారు. ఈసందర్భంగా శరణ బసవ, వరలక్ష్మి, వీరేష్, శాంతమ్మ, అన్నపూర్ణ, సరస్వతిలున్నారు.

కోలారు: వివిధ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు గాంధీనగర నారాయణస్వామి మాట్లాడుతూ శిశు అభివృద్ధి పథకంలో భాగంగా అన్ని సమాచారాల నమోదుకు ప్రభుత్వం అందించిన మొబైళ్లతో తక్కువ మెమోరి, నెట్‌వర్క్ సమస్యల వల్ల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆన్‌లైన్‌లో విధుల నిర్వహణ చాలా కష్టమవుతోందన్నారు. ఇచ్చిన మొబైళ్లను వాపసు తీసుకుని నాణ్యత కలిగిన మొబైళ్లను అందించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం స్త్రీశిశు సంక్షేమ శాఖా డీడీ ముద్దణ్ణకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సంఘం నాయకురాలు కల్పన, వి.మంజుల, లక్ష్మీదేవమ్మ, లోకేశ్వరి, జయలక్ష్మి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరుడికి విశేష పూజ

కంప్లి: వరుణుడి కృప కోసం మెట్రిలో భక్తులు పూజలు జరిపి భజనలు, నందాదీపార్చన చేపట్టారు. ఈశ్వరుడికి పూజ, గంగాస్నానం, పార్వతి పరమేశ్వరుడి చిత్రపటంతో ఊరేగించి దేవస్థానంలో అహోరాత్రులు పూజలు, భజనలు జరిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరు మృతి


ప్రమాదస్థలిలో బాధితులు

కృష్ణరాజపురం: వేగంగా వస్తున్న రెండు బైకులు ఢీకొనగా ఒకరు మృతి చెందారు. బెంగళూరులో బెళ్లందూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. బళ్లారికి చెందిన ఆనంద్ (26), మరో యువకుడు కుశాల్ సింగ్ దొడ్డకన్నెల్లి వద్ద ఎదురెదురుగా బైక్‌లతో ఢీకొన్నారు. కింద పడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆనంద్ తలకు గాయమై తీవ్రంగా రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు, పోలీసులు కలిసి మణిపాల్ ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు సిద్ధగంగ మఠంలో విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి సిద్ధలింగ స్వామి భూమి పూజ చేశారు. నాణ్యతతో పాటు అన్ని వసతులు ఉండేలా హాస్టల్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. సుమారు రూ. 9 కోట్ల 90 లక్షలతో కట్టిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీ.సురేష్‌గౌడ, జ్యోతి గణేష్, జీపీ అధ్యక్షురాలు మాలా మంజునాథ్ పాల్గొన్నారు.

23న బోవిసంఘం గురువందన

తుమకూరు జిల్లా బోవి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న చిక్కనాయకనహళ్ళి పట్టణంలో కన్నడ వేదిక సమావేశం హాల్లో ఇమ్మడి సిద్ధరామేశ్వర మహా స్వామి వారి 38వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సముదాయం నూతన ఎమ్మెల్యేలకు అభినందన, ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు.

కోలారు వార్తలు...

నాడు ఉన్నత విద్యాభ్యాసం కష్టతరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: 60వ దశకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించడం కష్టకరంగా ఉండేదని, అయితే ముడియనూరుకు చెందిన సుబ్బయ్య గ్రామ చుట్టుపక్కల వారితో కలిసి మహాత్మాగాంధీ నేషనల్ విద్యా సంస్థను ప్రారంభించారని ఆ సంస్థ అధ్యక్షుడు దక్షిణామూర్తి తెలిపారు. సోమవారం తాలూకాలోని ముడియనూరులోని ఉన్నత పాఠశాలలో పాత విద్యార్థుల తరఫున 2022-23వ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించి మాట్లాడారు. పాత విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి నివృత్తి పొందిన కెంచనహళ్లి బి.వెంకటేష్ మాట్లాడుతూ ఆ కాలానికి తమకు ప్రాథమిక విద్య తరువాత ఉన్నత పాఠశాల విద్య సౌకర్యం ఉండేది కాదన్నారు. అలాంటి సమయంలో తమకు నేషనల్ విద్యా సంస్థ ఆశాకిరణంగా కనిపించిందన్నారు. పాత విద్యార్థులు ఉత్తనూరు శ్రీనివాస్, జీపీ మాజీ అధ్యక్షుడు గుజ్జనహళ్లి జి.రమేష్, ఉపాధ్యాయుడు ఎం.నాగరాజ్, మంజుల, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలు పేదలకు వరం


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత ఆరోగ్య శిబిరాలు వరం అని ఇవాంజెలికల్ ట్రస్ట్ ఆఫ్ కర్ణాటక సంస్థాపక అధ్యక్షుడు పాస్టర్ సి.సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం హాళేహళ్లిలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరంలో రోగులకు ఆరోగ్య పరీక్షలను ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూత్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు సంస్థాపకుడు ఎస్ కె శాజహన్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు హెచ్‌టి తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కారటగిలో..

గంగావతి: కారటగిలోని ముత్యాలప్ప కాంప్లెక్స్‌లో సోమవారం ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో గుండె, నరాలు, మూత్రపిండాల్లో రాళ్లు తదితర సమస్యల రోగులను పరీక్షించారు. ఈసీజీ, ఏకో, స్కానింగ్, షుగర్ పరీక్షలను చేపట్టారు. రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. స్వామి వివేకానంద సేవా సంఘం అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, వైద్యులు విశ్వనాథ రెడ్డి, రాఘవేంద్ర, ప్రవీణ్, మెడికల్ స్టోర్ యజమాని నాగేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక మార్గదర్శి మహర్షి యాజ్ఞవల్క

మాలూరు: మిథిలానగర ఆస్థానంలో ఉంటూ సమాజానికి ధార్మిక మార్గదర్శనం చేసిన మహనీయుడు వైదిక భారత రుషి, తత్వజ్ఞాని యాజ్ఞవల్కుడు అని నాగరాజాచార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి విద్యా వికాస పాఠశాలలో తాలూకా యాజ్ఞవల్క సంఘం నిర్వహించిన గురు వందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాజ్ఞవల్కుడు తన పాండిత్యంతో శ్రేష్ఠ బ్రహ్మజ్ఞాని అనే బిరుదు పొందాడన్నారు. శివుడి నుంచి శాపగ్రస్త బ్రహ్మ యాజ్ఞవల్కగా అవడమే కాకుండా యుధిష్ఠరుడు చేసిన రాజసూయ యాగంలో ప్రధాన అర్చకుడిగా ఉన్నారన్నారు. ఇదే సమయంలో ప్రతిభావంత విప్ర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. సముదాయంలోని సీనియర్ దంపతులను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు విఠల్‌రావ్, శ్రీధరమూర్తి, సీతారామ పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

కోలారు: విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహనకు, వారిలో నాయకత్వ లక్షణాల వృద్ధికి మాక్ పార్లమెంట్ ఎన్నికలు దోహదపడతాయని బాలికల ఇంటర్ కళాశాల ఉన్నత పాఠశాలల విభాగం వైస్ ప్రిన్సిపాల్ కేవీ వెంకటేశప్ప తెలిపారు. సోమవారం పాఠశాల పార్లమెంట్ రచన కోసం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు నేతృత్వం వహించి ఆయన మాట్లాడారు. ఓటర్లు ఎన్నికలప్పుడు ఓటింగ్‌కు దూరంగా ఉండడం ప్రజాప్రభుత్వ వ్యవస్థకు విఘాతం అన్నారు. ఉపాధ్యాయులు ఎస్ ఎస్ భాగ్య, ఎంఎస్ మాధవరావు, అనీసా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యాధికారికి వీడ్కోలు



కోలారు: సాక్షరతా కార్యక్రమాలతో అక్షరాస్యత వృద్ధికి ప్రేరక్‌లు, స్వయం సేవకులు, సంఘ సంస్థలు కృషి చేయాలని జిల్లా వయోజన విద్యాధికారి సీఆర్ అశోక్ తెలిపారు. సోమవారం నగరంలోని కఠారుపాళ్యలో నివృత్తి పొందిన శిక్షణాధికారి నరసింహయ్యకు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజన విద్యా శాఖలో నరసింహయ్య చాలాకాలంగా ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. సన్మానం స్వీకరించి నరసింహయ్య మాట్లాడుతూ తాను జీవితంలో విద్యకు ఇచ్చిన ఎంతో ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. తన సేవా అవధి వృత్తి జీవితం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి డీఆర్ రాజప్ప, జిల్లా సాక్షరతా ప్రేరక్‌లు, సంయోజకుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

కేజీఎఫ్: మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం చేపల రైతుల దినోత్సవాన్ని ఆచరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి మత్స్యకారుల సహకార సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో విపులంగా జల వనరులు ఉన్నందున చేపల అభివృద్ధికి దోహద పడుతోందన్నారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మత్స్యశాఖ అమలు చేయడమేగాక శాఖ తరఫున చేప పిల్లలను తెచ్చి పెంచి అనంతరం రైతులకు అందిస్తోందన్నారు. రైతులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారుల సహాయక డైరెక్టర్ నారాయణస్వామి, మునిరాజు, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

కొన్ని జిల్లాలకే వర్షం.. మిగతాచోట్ల క్షామం!

- రాష్ట్రంలో విచిత్ర వాతావరణం
- తీర జిల్లాలు తప్ప అంతటా వర్షాభావం
- ముందుకు సాగని వ్యవసాయం


హంపీ వద్ద తుంగభద్ర నదిలో క్షీణించిన నీటిమట్టం


ధార్వాడలో సేద్యం పనుల్లో రైతులు

శివాజీనగర: గత ఒక వారం నుంచి మంగళూరు, ఉడుపి, ఉత్తర కన్నడ, కొడగు జిల్లాల్లో (కరావళి, మలెనాడు)లో మాత్రమే భారీ వర్షం కురుస్తోంది. కానీ మిగతా మెజారిటీ జిల్లాల్లో భారీ వర్షాల జాడ లేదు. కావేరి, ఉప నదుల మీదనున్న కొన్ని జలాశయాల ఇన్‌ఫ్లో మాత్రం కొద్దిగా పెరిగింది. వాతావరణం ముందస్తు సూచన ప్రకారం కరావళిలో, మలెనాడులో మరో వారంరోజులు వర్ష ఆర్భాటం కొనసాగనుంది.

సంతృప్తికరస్థాయిలో వర్షాలు లేవు

కానీ ఉత్తర కర్ణాటకతో పాటు బెంగళూరు రూరల్ సహా ఒళనాడులోని పలు చోట్లలో విత్తనాలు వేసేందుకు అనుకూలమైన వర్షాలు పడక రైతుల సతమతం అవుతున్నారు. రైతులు సంతృప్తి చెందేలా వాన పడలేదని కర్ణాటక ప్రకృతి వైపరీత్యాల ఇన్‌చార్జి కేంద్ర వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ప్రత్యేక డైరెక్టర్ వీ.ఎస్.ప్రకాశ్ తెలిపారు. మరో 10 రోజుల పాటు ఒళనాడులో 20–30 మి.మీ. వరకు సాధారణ వర్షాలు కురుస్తాయి. అదే సమయంలో మలెనాడులో వర్షాల వల్ల కావేరి, తుంభద్రానది నదీప్రాంత జలాశయాలకు కొద్దిమేరకు ఇన్‌ఫ్లో పెరిగినా కూడా గణనీయ స్థాయిలో పెరగదని చెప్పారు.

రాష్ట్రంలో 34 శాతం తక్కువ వానలు

ఉత్తర కర్ణాటకలో పలు ప్రాంతాల్లో క్షామం ఏర్పడగా, విత్తనం వేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. రాబోయే రోజుల్లోనూ పుష్కలమైన వర్షాలు కురుస్తాయన్న భరోసా లేదని అంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 34 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇప్పటికల్లా 266 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, 177 మి.మీ. వాన మాత్రమే పడింది. అనేక జిల్లాల్లో ఇప్పటికీ వర్షం కొరత ఉండగా, కరువు ఛాయలు ఆవరించాయి. ఇలాగే కొనసాగితే మరో వారం తరువాత ప్రభుత్వం కరువుపీడిత ప్రాంతాల జాబితాను ప్రకటించి సహాయక చర్యలను చేపట్టాల్సి వస్తుంది.

ఏ జిల్లాలో ఎంత తక్కువ అంటే

కోలారు జిల్లాలో 32 శాతం, మండ్య 36 శాతం, హాసన్- 30 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఈ సమయంలో అత్యధికంగా వర్షం కురవాల్సిన మలెనాడు భాగంలో వాడుక కంటే 6 శాతం వర్షం కొరత నెలకొంది. రామనగర- 42 శాతం, దావణగెర-21 శాతం, మైసూరు, చామరాజనగర-26 శాతం, మండ్య-22 శాతం, బళ్లారి, విజయనగర-37 శాతం, కొప్పళ-23 శాతం, రాయచురు-27 శాతం, కల్బుర్గి-33 శాతం, యాదగిరి- 26 శాతం వర్షం కొరత నెలకొంది. బెళగావి-51 శాతం, బాగలకోట-64, విజయపుర-49 శాతం, గదగ-27 శాతం, హావేరి-38 శాతం, ధారవాడ-44 శాతం, హాసన, శివమొగ్గ-52 శాతం, చిక్కమగళూరు-54 శాతం, కొడుగు- 57 శాతం, దక్షిణ కన్నడ- 28 శాతం, ఉత్తర కన్నడ- 25 శాతం తక్కువ వర్షం కురిసింది.


ఇటీవల ఉడుపిలో వర్షాలకు పోటెత్తిన వీధులు

క్లుప్తంగా

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలి


నిర్మాణ దశలో వున్న సెల్ టవర్

గౌరిబిదనూరు: నగరసభ పరిధిలోని 29వ వార్డు హీరేబిదనూరులో ఖాదర్ బాషా అనే వ్యక్తి స్థలంలో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను వెంటనే నిలిపివేయాలని రహంతుల్లాఖాన్ అనే వ్యక్తి పోలీసులకు, నగరసభకు సోమవారం ఫిర్యాదు చేశారు. టవర్ రేడియషన్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, వీటి వల్ల పక్షులకు కూడా ముప్పు వాటిల్లనుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంగనవాడీ కార్యకర్తల ధర్నా


ధర్నా చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం: పలు డిమాండ్ల సాధన కోసం సోమవారం అంగనవాడీ కార్యకర్తలు దొడ్డపట్టణంలో ధర్నా నిర్వహించారు. ఇక్కడి మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన అంగనవాడీ కార్యకర్తలు మొబైళ్లను ఇవ్వడానికి 2023 బడ్జెట్‌లో పెంచిన రూ.1000లను తక్షణం విడుదల చేయాలని, సోషల్ అభియాన్‌కు ఆధార్ లేదా మొబైల్ నంబర్ లింక్ చేయాలనే ఆదేశాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండు చేసారు. అనంతరం వినతిపత్రాన్ని సీడీపీఓ రవికుమార్‌కు అందజేసారు.

అధిక లోడు లారీలకు జరిమానా

హోసూరు: నిర్ణీత భారం కంటే ఎక్కువ టన్నేజ్‌తో ఎం. శాండ్ తరలిస్తున్న తొమ్మిది లారీలను ఆర్టీవో అధికారులు సీజ్ చేసి జరిమానా వేశారు. హోసూరు ఆర్టీవో అధికారి దురైస్వామి నేతృత్వంలో అధికార్లు హోసూరు-బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఎక్కువ భారం తీసుకెళుతున్న తొమ్మిది టిప్పర్ లారీలని స్వాధీనపరుచుకొని రూ. 4.76 లక్షల జరిమానా వసూలు చేశారు.

ఏనుగు దాడిలో పంటలు ధ్వంసం


ఏనుగు దాడిలో విరిగిపోయిన చెట్టు

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ తాలూకాలో అడవి ఏనుగుల బీభత్సం ఆగడంలేదు. ఆదివారం రాత్రి బీవీ హళ్లి చెరువులో నీరు తాగడానికి వచ్చిన అడవి ఏనుగు చెన్నపట్టణ తాలూకా బీవీ హళ్లి వద్ద పంటలపై పడి విధ్వంసం సృష్టించింది. శ్రీనివాస్ అనే రైతుకు చెందిన కొబ్బరి, వక్క, మామిడి తోటలో జొరబడి చెట్లను తొండతో విరిచేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు నష్టపోయిన తోటలను పరిశీలించారు.

ఇద్దరు మహిళల అరెస్ట్

మైసూరు: ఓ నగల దుకాణంలో కొనుగోలుదారులుగా వచ్చి ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఇద్దరు మహిళలను కుశాలనగర పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన మహిళలు చిత్రదుర్గ జిల్లా భరమసాగర పంచాయతీ పామరహళ్లి గ్రామానికి చెందిన కైరున్ (46), జైరాబి(36)గా గుర్తించారు. వీరి వద్ద నుంచి 22 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 5న వీరు కుశాలనగర పరిధిలో ఉన్న శీతల్ జ్యువెలరీ దుకాణంలో బుర్కా ధరించి నగలు కొనుగోలు చేయడానికి వచ్చారు. దుకాణం యజమాని దృష్టిని మళ్లించి నకిలీ ఆభరణాలు అక్కడ పెట్టి ఒరిజనల్ నగలను తీసుకుని వెళ్లిపోయారు. వీరు వెళ్లిన కొద్ది సేపటికి విషయం గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేసి ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు.

చెత్తమయమైన బీఇఎల్ రోడ్డు

యశవంతపుర: బెంగళూరు నగరంలోని న్యూబీఈఎల్ రోడ్డు దుర్వాసనతో కంపుకొడుతోంది. కువెంపు సర్కిల్ పొడవునా చెత్త పేరుకుపోయి భరించలేనంత వాసన వస్తోంది. దీంతో ప్రజలు ముక్కు ముసుకుని తిరుగుతున్నారు. కొన్నినెలలుగా రోడ్డుకిరువైపులా చెత్త రాసులు పేరుకుపోయాయి. ఈ విషయాన్ని స్థానికులు బీబీఎంపీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు మాత్రం మా పరిధిలోకి రాదని సాకులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో చెత్త వేయటానికి బీబీఎంపీ అధికారులు కారణమని స్థానికుడు నంజుండప్ప ఆరోపించారు. ఈరోడ్డు మార్గం డాలర్స్ కాలనీలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులున్న సమస్యను పట్టించుకోవటం లేదు.

ఇస్రో మాజీ అధ్యక్షుడు కస్తూరి రంగన్‌కు గుండెపోటు

బనశంకరి: ఇస్రో మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సైంటిస్ట్ కస్తూరి రంగన్ గుండెపోటుకు గురయ్యారు. శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్లిన సమయంలో సోమవారం కస్తూరిరంగన్‌కు గుండెపోటు వచ్చింది. హుటాహుటిన ఆయన్ను శ్రీలంక నుంచి బెంగళూరుకు ఎయిర్‌లిఫ్ట్ చేశారు. సాయంత్రానికి బెంగళూరు హెచ్‌ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో నారాయణ హృదయాలయ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ దేవిశెట్టి నేతృత్వంలో కస్తూరి రంగన్‌కు చికిత్స అందిస్తున్నారు. ప్రత్యేక డాక్టర్ల బృందం ఆయన్ను పర్యవేక్షిస్తోంది.

మంత్రి చెలువరాయకు మాట్లాడే అర్హత లేదు

మండ్య: మంత్రి చెలువరాయస్వామికి మాజీ సీఎం కుమారస్వామి గురించి మాట్లాడే అర్హత లేదని మాజీ మంత్రి రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం మండ్యలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...మండ్య జిల్లాకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపించాలని, అప్పుడు విమర్శిస్తే బాగుంటుందని అన్నారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న చెలువరాయ స్వామి ఒక థర్డ్ క్లాస్ కాంట్రాక్టర్ అని, ఆయనకు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన పార్టీని, ఆ పార్టీ నాయకులను ఇష్టానుసారం తిడుతున్నారని మండిపడ్డారు. పెద్దల పట్ల గౌరవభావం ఉండాలన్నారు.

తప్పు చేయలేదు : కిచ్చ

యశవంతపుర: కిచ్చా సుదీప్, నిర్మాతల మధ్య మాటల యుద్ధం ఆగేలా కనిపించలేదు. తాజాగా తన వద్ద అడ్వాన్స్ తీసుకుని కాల్‌షీట్లు ఇవ్వటం లేదని నిర్మాత ఎన్ఎం కుమార్ ఆరోపణపై సుదీప్ స్పందించారు. ఈ విషయంపై తాను ఎటువంటి తప్పు చేయలేదని, తాను నిర్మాతలపై పరువు నష్టం దావా వేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానన్నారు. తనపై అనవసరంగా ఆరోపణలు చేసి తన వ్యక్తిత్వానికి భంగం కలిగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తనకు జరిగిన పరువునష్టంపై ఒక్కోక్కరు రూ.10 కోట్లు చెల్లించాలని నోటీసులో వివరించారు. నోటీసు అందుకున్న నిర్మాత కుమార్ మళ్లీ మోసం జరిగిందని చెబుతూ మీడియా ముందుకు వచ్చారు.

విదేశీ మహిళ అరెస్ట్

యశవంతపుర: బెంగళూరు ఉంటూ గంజాయి, ఎస్‌డీఎంఎ మత్తు పదార్థాలను విక్రయిస్తున్న విదేశీ మహిళను కొత్తనూరు పోలీసులు అరెస్ట్ చేసి రూ.3.45 లక్షల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమె వీసా కాలం ముగిసినా బెంగళూరులోనే నివాసం ఉంటోంది.

అమర్‌నాథ్ యాత్రికులు క్షేమం

- వారి రక్షణకు చర్యలు: సీఎం


మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం తదితరులు

బొమ్మనహళ్లి: జమ్ముకశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి అక్కడ భారీ వర్షాల్లో చిక్కుకున్న కర్ణాటకకు చెందిన యాత్రికులు క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఇబ్బందులు రాకుండా ఐఏఎస్ అధికారి రశ్మి ఆధ్వర్యంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. నగరంలోని బొమ్మనహళ్లిలోని హెచ్‌ఎస్ఆర్ లేఔట్ వార్డులోఉన్న స్వాభిమాని పార్క్‌లో నమ్మ గిడ- హెమ్మె ససి అనే కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. తరువాత మాట్లాడుతూ ఉత్తరాదిలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల అక్కడకు వెళ్లిన అమర్‌నాథ్ యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు వారితో మాట్లాడుతూ బస, ఇతర ఏర్పాట్లు చూస్తున్నారని, వర్షాలు నిలిచిన వెంటనే వారిని ఇక్కడి రావడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ఎవరూ భయపడాల్సిన పని లేదని చెప్పారు. కుండపోత వానల వల్ల అక్కడకు విమానాలు, హెలికాప్టర్లు వెళ్ళడానికి ఆటంకాలు కలుగుతున్నాయని, యాత్రికులు దుర్గమమైన కొండ ప్రాంతాల్లో ఉన్నారని, వర్షాలు తగ్గిన వెంటనే వారిని సురక్షితంగా తరలిస్తామని అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి, మాజీ మంత్రి హెచ్.ఎం. రేవణ్ణ, ఉమాపతి శ్రీనివాస్‌గౌడ, వీఎస్ ఉగ్రప్ప, టి.వాసుదేవరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యత



బొమ్మనహళ్లి: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు భారీగా కేటాయించారని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప అన్నారు. సోమవారం నగరంలోని బీటీఎం లేఔట్ ఆడుగోడి వార్డులోని ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో యూనిఫారం, నోటు పుస్తకాలు, బ్యాగులను మంత్రి రామలింగారెడ్డితో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం భోజనంలో గుడ్డు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా తీసుకువచ్చామని, విద్యార్థుల ఎదుగుదలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆడుగోడిలో 22 ప్రభుత్వ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే, మంత్రి రామలింగారెడ్డి దత్తత తీసుకుని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగరాజు, ఆడుగోడి బీ మోహన్, జీ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని ఏపీఎంసీ గోడౌన్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం వినోబానగర సీఐ సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 11,320 నగదు, ఐదు మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు.

సిమ్‌కార్డ్ బ్లాక్ చేసి ఖాతాలో నగదు దోపిడీ

దొడ్డబళ్లాపురం: ఖాతాదారుడి సిమ్ కార్డు బ్లాక్ చేసిన సైబర్ నేరగాళ్లు అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 లక్షలు కాజేసిన సంఘటన సోలదేనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. బెంగళూరు చిక్కసంద్రకు చెందిన శివకుమార్ డబ్బు పోగొట్టుకున్న బాధితుడు. శివకుమార్ జిరాక్స్ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. అయితే ఇటీవల ఆయన సిమ్‌కార్డు హఠాత్తుగా సిగ్నల్ లేకుండా పోయింది. మొబైల్ కంపెనీకి కాల్ చేసి విచారిస్తే పాత సిమ్ కార్డు బ్లాక్ అయ్యిందని కొత్త సిమ్ కార్డు తీసుకోవాలని సూచించారు. కొత్త సిమ్‌కార్డు తీసుకుని యాక్టివేట్ చేసుకోగా తక్షణం అతడి బ్యాంక్ ఖాతా నుండి రూ.2 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కి వెళ్లి విచారించగా సైబర్ నేరగాళ్లు మొబైల్ నంబర్ ఉపయోగించుకుని డబ్బులు బదిలీ చేసుకున్నారని తెలిసింది. ఇందుకు సంబంధించి శివకుమార్ సోలదేనహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిరుపేద జంటకు వివాహం


దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

బనశంకరి: బనశంకరి సామూహిక వివాహ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్ ఓ నిరుపేద జంటకు వివాహం జరిపించారు. సోమవారం భవానీనగరలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వధూవరులు మంజు, కల్పనలు వేదమంత్రాల మధ్య ఒక్కటయ్యారు. బసవరాజ్ నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వెంకటేశ్, నారాయణస్వామి, విశ్వనాథ్, కృష్ణమూర్తి, బోరేగౌడ, సుందర్, శరవణ, ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి వీరభద్రయ్య భవాని

చిక్కబళ్లాపుర: బాల్య వివాహాలను అరికట్టాలని, 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం చట్టరీత్య నేరమని జిల్లా జడ్జి నేరళ వీరభద్రయ్య భవాని అన్నారు. సోమవారం నగరంలో బాల్య వివాహాలపై అవగాన కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. తల్లిదండ్రుల్లో ఉన్న మూఢ నమ్మకాలు, ఆర్థిక ఇబ్బందులతో పిల్లలు భవిష్యత్‌తో ఆడుకోవడం తగదన్నారు. ఈ సందర్భంగా జాగృతి జాతాను సివిల్ జడ్జి అరుణ కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్పీ నాగేశ్, డీడీపీఐ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరసభ కమిషనర్‌గా చలపతి


మాట్లాడుతున్న చలపతి

చింతామణి: చింతామణి నగర సభ కమిషనర్‌గా జెఎస్ చలపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కౌన్సిలర్లు, సహచర అధికారుల సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ తుగ్లక్ పాలన

శివాజీనగర: హిందూ దేవాలయాల్లో పూజలు చేసేందుకు బీబీఎంపీ అనుమతి తీసుకోవాలనే నియమం తుగ్లక్ పాలనను గుర్తు చేస్తోందని శికారిపుర ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర కాంగ్రెస్‌పై ట్విటర్‌లో మండిపడ్డారు. ఉప్పారపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆదివారం విడుదల చేసిన నోటీసుపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హిందూ దేవాలయాల్లో పూజలు చేసేందుకు అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏమిటని ట్విటర్‌లో విజయేంద్ర అసహనం వ్యక్తం చేశారు.

హెచ్‌ఎస్ గార్డెన్‌లో ఊరి జాతర


దీపాలు తీసుకువస్తున్న మహిళలు

చిక్కబళ్లాపురం: నగరంలోని హెచ్‌ఎస్ గార్డెన్‌లో సోమవారం ఊరి జాతర ప్రారంభమైంది. మహిళలు ఆంజనేయస్వామి, కోదండరామస్వామి వార్లకు ఊరేగింపుతో దీపాలను తీసుకువచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖులు మంజునాథ్, నారాయణస్వామి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

వేడుకగా గురువందనం


గురువు సంపిగె శ్రీనివాసమూర్తికి వందనం సమర్పిస్తున్న విద్యార్థులు

బనశంకరి: నగరంలోని గిరినగర, కెంగేరి, విజయనగరలలో ఉచితంగా వేద పాఠాలను నేర్పుతున్న వేదబ్రహ్మ సంపిగె శ్రీనివాసమూర్తికి ఆదివారం గవిపురం గుట్టహళ్లిలోని అంబా భవాని ఆలయంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని 150 మందికి పైబడి వేద విద్యార్థులు గురువందనం సమర్పించారు. గురువు సంపిగె శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ...23 ఏళ్లుగా వెయ్యి మంది విద్యార్థులకు వేద విద్యను నేర్పినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్యాంసుందర్ గైక్వాడ్, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

యశవంతపుర: బెంగళూరు నగరంలో బైక్‌లను అపహరిస్తున్న నిందితుడిని రాజరాజేశ్వరి నగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ. రెండు లక్షల విలువైన మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై ఫొటో ప్రదర్శన

హోసూరు: క్రిష్ణగిరి ప్రభుత్వ బాలుర ఉన్నతోన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న అఖిల భారత మామిడి ప్రదర్శనలో ప్రజా సంబంధ శాఖ ప్రభుత్వ పథకాలపై ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసింది. ప్రదర్శనలో తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజల వద్దకే వైద్యం, ఇంటి వద్దకే విద్య, పాఠశాలల్లో అల్పాహారం, అంబులెన్స్ సేవలు, పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా శిక్షణ, పెరటి తోటల పెంపకం, రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు, దివ్యాంగులకు సంక్షేమ ఫలాలు తదితర పథకాలపై ఫొటోలు ఏర్పాటు చేశారు.

హోసూరు వార్తలు..

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



కెలమంగలం: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని సోమవారం ఇరుదుకోట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం. నాగరాజ్ పిలుపునిచ్చారు. కెలమంగలం సమితి ఇరుదుకోట గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వంద మందికి పైగా బీజేపీలో చేరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదేష్, వెంకటేష్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో క్రిష్ణగిరి జిల్లా నుంచి పోటీ చేసే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి పార్టీ సత్తాను చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్, కురుమూర్తి, ఆనంద్, పార్థిభన్, భాస్కరరెడ్డి, మంజుల, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శరయు

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో వివిధ సమస్యలపై 366 వినతులు అందజేశారు. కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, ఇళ్ల పట్టాలు, వృద్ధాప్య పెన్షన్, కుట్టుయంత్రాలు, రోడ్లవసతి, విద్యా సహాయ నిధి తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఒకరికి వినికిడి యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, అధికారులు వేడియప్పన్, పద్మలత, మురుగేషన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. రైతు మృతి

హోసూరు: రెండు ద్విచక్ర వాహనాలు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన రాయకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి సమీపంలోని గుట్టకొల్‌లై గ్రామానికి చెందిన రైతు అళగేషన్ (39) ఆదివారం సొంతపనిపై ద్విచక్ర వాహనంలో రాయకోట వచ్చి తిరిగి వెళ్తుండగా సూళగిరి రోడ్డుపై మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అళగేషన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

హత్య కేసులో ఇద్దరి నిర్బంధం

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో గత మూడు రోజుల క్రితం దారుణహత్యకు గురైన రైతు హత్య కేసులో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. జూజువాడి ప్రాంతానికి చెందిన రైతు శివరామప్ప (53) గత మూడు రోజుల క్రితం పశువుల మేత తీసుకొని కారులో వెళుతుండగా గుర్తు తెలియని దుండగులు కళ్లలో కారంపొడి కొట్టి వేట కొడవళ్లతో నరికిచంపారు. ఈ ఘటనపై మృతుని కొడుకు మధుకుమార్ (26) సిప్‌కాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ బంధువులైన రామక్రిష్ణ, నారాయణస్వామిల మధ్య ఆస్తి తగాదాలుండేవని, వారే తమ తండ్రిని హత్య చేసి ఉంటారని ఆరోపించాడు. ఫిర్యాదు మేరకు సిప్‌కాట్ పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొన్నారు.

నీట మునిగి బాలుడు...

క్రిష్ణగిరి: కుంటలో ఈతకెళ్లిన బాలుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఉద్దనపల్లి ఆంజనేయస్వామి వీధికి చెందిన దిలీప్‌సింగ్ కొడుకు వరుణ్‌సింగ్ (12) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గోవిందాపురం సమీపంలోని ఓ నీటికుంటలో ఈతకెళ్లాడు. అకస్మాత్తుగా నీటిలో మునిగి మృతి చెందాడు. ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్‌లు ప్రారంభం


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని తొరపల్లి గ్రామ పంచాయతీలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందజేసేందుకు హోసూరు పీపుల్స్ క్లబ్, స్థానిక పరిశ్రమలు ముందుకొచ్చింది. అందులో భాగంగా హోసూరు పీపుల్స్ క్లబ్, ఏవీఎస్ టెక్ సంయుక్తంగా తొరపల్లి పంచాయతీలోని కుముదేపల్లి, గొల్లపల్లి ప్రాంతాల్లో రూ. 10 లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సామాజిక సేవాకర్తలు కుమార్, శ్రీనివాసన్‌లు నేతృత్వంలో స్థానిక ప్రజల వినియోగానికి తీసుకొచ్చారు. స్థానిక ప్రజలకు సురక్షిత తాగునీరు అందజేసేందుకు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశామని, రూ. 5 చెల్లించి తాగునీరు తీసుకెళ్లవచ్చని తెలిపారు.

పోలీసులమంటూ దోపిడీ

దొడ్డబళ్లాపురం: పోలీసులమని చెప్పుకున్న నలుగురు దుండగులు కారు నిలిపి కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడ్డ సంఘటన బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్ వే మార్గంలోని కన్నమంగల బ్రిడ్జ్ వద్ద చోటుచేసుకుంది. బెంగళూరు ఐటీసీ కంపెనీలో హ్యూమన్ రిసోర్స్ అధికారిగా పనిచేస్తున్న ధనుష్ దోపిడీకి గురైన బాధితుడు. ఈయన బెంగళూరు విశ్వేశ్వరయ్య లేఔట్ నివాసి. ఈనెల 7న ధనుష్ మైసూరులో సమీప బంధువు మృతి చెందడంతో వెళ్లి అంత్యక్రియలు ముగించుకుని రాత్రి సమయంలో ఎక్స్‌ప్రెస్‌వే పై కారులో వస్తుండగా వెనుక నుంచి ఫాలో అవుతూ రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు వ్యక్తులు కారు నిలిపి తాము పోలీసులమని చెప్పుకుని ధనుష్‌పై దాడి చేసారు. కత్తితో బెదిరించి ధనుష్ మెడలోని రూ.1.50 లక్షల విలువైన బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఘటనకు సంబంధించి రామనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు

క్లుప్తంగా...

ఏపీ ట్రాన్స్‌కోకు జాతీయస్థాయిలో ప్రశంసలు



ఏపీ ట్రాన్స్‌కోకు కేంద్రం ప్రశంసాపత్రం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీ ట్రాన్స్‌కో)కు మరోసారి జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. వస్తు సేవల పన్ను చెల్లింపులు, రిటర్నులను సకాలంలో దాఖలు చేయడంతో కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని పరోక్ష పన్నులు, కస్టమ్స్ విభాగం(సీబీఐసీ) నుంచి ప్రశంసాపత్రం లభించింది. వరుసగా 2021–22, 2022–23లకు దక్కిన ఈ ప్రశంసలతో.. ఆర్థిక అంశాల నిర్వహణలో ఏపీ ట్రాన్స్‌కో సమర్థత మరోసారి వెల్లడయ్యింది. రూరల్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ)తో ఏపీ ట్రాన్స్‌కో జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో ట్రాన్స్‌కో తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించేందుకు ఆర్‌ఈసీ అంగీకారం తెలిపింది.

5.77 లక్షల మందికి కౌలు కార్డులు



సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 5.77 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు (కౌలు కార్డులు) ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 3.83 లక్షల కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను రెవెన్యూ శాఖ జారీ చేసిందని పేర్కొన్నారు. మిగతా లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లకు సోమవారం సూచనలు జారీ చేశారు. కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేయడం వల్ల వారికి బ్యాంకుల నుంచి రుణాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తాయన్నారు. ఈ దృష్ట్యా వీలైనంత త్వరగా మిగిలిన కౌలు రైతులకు కూడా సీసీఆర్ కార్డులు జారీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కొత్తగా సీసీఆర్ కార్డులు జారీ, కార్డులను రెన్యువల్ చేయడం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.


పాత మిత్రులతో కలిసే ఎన్డీయే పోటీ

కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి నారాయణస్వామి



మడకశిర: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే పాత మిత్రులతో కలిసే పోటీ చేస్తుందని కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి నారాయణస్వామి చెప్పారు. ఆ దిశగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆయన సోమవారం బెంగళూరు నుంచి కర్ణాటకలోని పావగడ నియోజకవర్గానికి వెళుతూ మార్గమధ్యంలో కొద్దిసేపు మడకశిరలో ఆగారు. ఈ సందర్భంగా నారాయణస్వామిని స్థానిక బీజేపీ నాయకులు, దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు సన్మానించారు. నారాయణస్వామి మాట్లాడుతూ జనసేన తమతోనే ఉందని, టీడీపీ కూడా ఎన్డీయేతో కలిసి వస్తుందనే విశ్వాసం ఉందని తెలిపారు.

సీఐడీ ఇన్‌చార్జి చీఫ్‌గా ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులును ప్రభుత్వం సీఐడీ విభాగం ఇన్‌చార్జిగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. సీఐడీ విభాగం అదనపు డీజీగా ఉన్న సంజయ్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు. ఆయనకు ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ నిర్వహించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సీఐడీ విభాగం ఇన్‌చార్జిగా పీఎస్ఆర్ వ్యవహరిస్తారని ప్రభుత్వం సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉమ్మడి పౌర స్మృతికి వ్యతిరేకం : సీఎం కేసీఆర్

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: దేశాభివృద్ధిని విస్మరించి ఇప్పటికే పలు రకాలుగా దేశ ప్రజల నడుమ చిచ్చు పెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్) పేరుతో మరోమారు దేశ ప్రజలను విభజించేందుకు కుయుక్తులు పన్నుతోందని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ధ్వజమెత్తారు. విభిన్న ప్రాంతాలు, జాతులు, మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతులు కలిగి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన భారత ప్రజల ఐక్యతను చీల్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తాము నిర్ద్వందంగా తిరస్కరిస్తామని తెలిపారు. అందులో భాగంగా యూసీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఖాలీద్ సయీపుల్లా రెహ్మాని ఆధ్వర్యంలో బోర్డు కార్యవర్గం సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమైంది. యూసీసీ బిల్లును వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేసింది. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని కేసీఆర్ ప్రకటించారు.

మూడు రోజులు వానలు

ఉపరితల ఆవర్తనం ప్రభావమే కారణం

- పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఉరుములు, మెరుపుల తోపాటు పిడుగులకు ఆస్కారం



సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంపై ఉత్తర తమిళనాడు తీరాన్ని ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండవద్దని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

నేడు వానలు కురిసే జిల్లాలు

మంగళవారం నాడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

రేపు ఎక్కడెక్కడ కురుస్తాయంటే..

బుధవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉంది.

మూడో రోజు మోస్తరు వర్షాలు

గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, ఏఎస్ఆర్, కాకినాడ, తూర్పు గోదావరి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా.. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 9.3, విజయనగరం జిల్లా బొబ్బిలిలో 8.2, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేటలో 8.2, శ్రీకాకుళం జిల్లా పలాసలో 3.4 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.


టెక్నోడోమ్ సంస్థకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్


ఛానెల్ ప్లే సంస్థ ప్రతినిధులతో ప్రభుత్వం ఎంవోయూ


వర్చువల్ మేజ్ సాఫ్ట్‌స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేసిన సీఎం

'పారిశ్రామిక' పరుగులు

▶ మొదటి పేజీ తరువాయి

ఆధునికీకరించిన రాజీవ్‌మార్గ్, రూ.1.37 కోట్లతో ఏర్పాటుచేసిన రాజీవ్ పార్కునూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కొప్పర్తిలో పారిశ్రామికరంగం ఊపందుకుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్, జెడ్పీ చైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ సుధా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, మేడా మల్లికార్జున రెడ్డి నగర మేయర్ సురేష్‌బాబు, చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, జేసీ గణేష్‌కుమార్, ఎస్పీ అన్బురాజన్, ట్రెయినీ కలెక్టర్ రాహుల్ మీనా, జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయరెడ్డి, అల్ డిక్సన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన మూడ్రోజుల పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన జమ్మలమడుగు, పులివెందుల, కడపలలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరోవైపు.. సోమవారం మధ్యాహ్నం జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు జగన్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు. 2.05 గంటలకు కడప విమానాశ్రయం నుంచి గన్నవరానికి బయల్దేరి వెళ్లారు.


కడపలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సంస్థల వివరాలు..

అల్ డిక్సన్ టెక్నాలజీస్..

అల్ డిక్సన్ కంపెనీలో సీసీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డర్లు మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తారు. ఐదేళ్ల కాలవ్యవధిలో రూ.127 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ సంస్థలో 1,800 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. అలాగే, ఉత్పత్తి సామర్థ్యం పెంపులో భాగంగా మరో రూ.80 కోట్ల పెట్టుబడితో 'ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, సెక్యూరిటీ కెమెరాలు మొదలైన పరికరాలు తయారుచేస్తారు. తద్వారా మరో 1,100 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే, రూ.125.26 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసే మరో యూనిట్ ద్వారా 630 మందికి ఉద్యోగావకాశాలు అందించే లక్ష్యంతో అల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు సాగుతోంది. మొదటి దశలో ఉత్పత్తులు ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు కంపెనీ 860 మందికి ఉపాధి కల్పిస్తోంది.

వర్చువల్ మేజ్ సాఫ్ట్‌స్ ప్రైవేట్ లిమిటెడ్..

2007 నుంచి వర్చువల్ మ్యాప్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్న 'వర్చువల్ మేజ్ సాఫ్ట్‌స్ ప్రైవేట్ లిమిటెడ్' ఉత్పత్తులు ప్రారంభించేందుకు ముందుకొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలకు వాడే బ్యాటరీలు, జీపీఎస్ ట్రాకర్, స్మార్ట్ పీసీబీ వంటి అధునాతన డివైస్‌లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. రూ.71 కోట్ల పెట్టుబడితో పర్యావరణ హితమైన యూనిట్ ఏర్పాటుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. దీని ద్వారా సుమారు 1,350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

టెక్నోడోమ్ సంస్థ..

అరబ్ దేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఎలిస్టా కంపెనీకి అనుబంధంగా 'టెక్నోడోమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 'కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ కంపెనీ రూ.52 కోట్లతో ఏర్పాటవుతోంది. దుబాయ్‌లో వీరి ప్రధాన కార్యాలయం ఉండగా, నోయిడాలో భారత్ ప్రధాన కార్యాలయం ఉంది. ట్రేడింగ్ కంపెనీగా ఈ సంస్థ గుర్తింపు పొందుతోంది. బ్రాండెడ్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ప్రముఖ ఐటీ ఉత్పత్తుల సరఫరాదారులలో ఒకటిగా మారిన ఈ సంస్థ.. ఏపీ పారిశ్రామిక అభివృద్ధిలో భాగస్వామ్యమైంది. గృహోపకరణాలు, గృహ వినోదం, వంటగది ఉపకరణాలు, ఐటీ వస్తువులు, కార్ ఆడియో, గేమింగ్ ఉత్పత్తులు, స్మార్ట్ వాచీలను ఉత్పత్తి చేయనుంది. ప్రత్యక్షంగా 200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.


అల్ డిక్సన్ కంపెనీలో వర్కర్లతో మాట్లాడుతున్న సీఎం

ఛానెల్ ప్లే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ..

రూ.100 కోట్ల పెట్టుబడితో ఆడియో సిస్టం భాగాలను ఉత్పత్తి చేయనున్న ఛానెల్ ప్లే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కన్సల్టింగ్, రీసెర్చ్ సంస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఎగ్జిక్యూషన్‌లో నైపుణ్యం కలిగి 8,000 పైగా ప్రాజెక్టు సిబ్బందితో మంచి వార్షిక ఆదాయంతో పెద్ద సంస్థగా గుర్తింపు పొందింది. ఇక్కడ 2,000 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్ సేల్స్ ఫోర్స్ ఔట్‌సోర్సింగ్, విజువల్ మర్చండైజింగ్, లాయల్టీ ప్రోగ్రాంలు వున్నాయి. అలాగే, వీరి ముఖ్య ఉత్పత్తులు సౌండ్‌బార్లు, వూఫర్లు, మల్టీమీడియా స్పీకర్లు, పార్టీ స్పీకర్లు, టవర్లు వంటివి తయారుచేస్తారు.

ముగిసిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో భర్తీ కానున్న స్పెషలిస్ట్ వైద్య పోస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీకి చేపట్టిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలు సోమవారంతో ముగిశాయి. 14 స్పెషాలిటీల్లో 331 పోస్టుల భర్తీకి ఈ నెల 5వ తేదీ నుంచి రోజు మార్చి రోజు మూడు విడతలుగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలి రెండు రోజుల్లో తొమ్మిది స్పెషాలిటీల్లో 152కు పైగా పోస్టులు భర్తీ అయ్యాయి. చివరి రోజు ఐదు స్పెషాలిటీల్లో 104 పోస్టులను నోటిపై చేశారు. హాజరైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలన అనంతరం సోమవారం రాత్రి వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 40 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మరికొందరు అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ అవ్వకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 2019 నుంచి ఇప్పటికి 49 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు.

బహుజన హక్కులను తాకట్టు పెడుతున్న దళారులు

1,016వ రోజు రిలే దీక్షలో నేతలు

తాడికొండ: బాబు అండ్‌కో వద్ద ప్యాకేజీలు తీసుకుంటున్న దళిత దళారులు బహుజన హక్కులను తాకట్టు పెడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,016వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల వైఫల్యాలను, ప్రజలకు జరిగిన నష్టం, రాజధాని పేరిట రైతులకు జరిగిన మోసంపై నోరెత్తని పవన్‌కళ్యాణ్ వలంటీర్లను టార్గెట్ చేయడం దారుణమని చెప్పారు. బాబు, రామోజీల స్క్రిప్ట్‌ను చదువుతున్న పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని.. లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

లెవల్-1 క్యాన్సర్ సెంటర్‌గా గుంటూరు

లెవల్-2 కేంద్రాలుగా కర్నూలు, విశాఖపట్నం

- కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి
- రెండో దశలో కాకినాడ, అనంతపురం జీజీహెచ్‌లలో క్యాన్సర్ వైద్యసేవల బలోపేతం
- ఇందుకు రూ.119.50 కోట్లు మంజూరు
- ఇప్పటికే విశాఖలో భవనం సిద్ధం.. వచ్చేనెలలో కర్నూలులోను అందుబాటులోకి..
- డిసెంబర్ నెలాఖరులోగా అధునాతన పరికరాల సమకూర్పు
- ఇప్పటికే లినాక్ సహా పలు అధునాతన పరికరాల కొనుగోలుకు పీఓ జారీ

సాక్షి, అమరావతి : ప్రభుత్వరంగ ఆస్పత్రుల్లోనే క్యాన్సర్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ముమ్మరం చేసింది. వ్యాధి నియంత్రణ, నివారణకు సీఎం వైఎస్ జగన్ ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ వైద్యం కోసం బాధితులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే పనిలేకుండా అన్ని ప్రాంతాల్లో 50 కి.మీ పరిధిలోనే వైద్య సదుపాయాలను కల్పించేలా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ రోడ్ మ్యాప్‌ను రాష్ట్ర వైద్యశాఖ రూపొందించింది. తొలిదశ కింద.. గుంటూరు జీజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగాన్ని లెవల్-1 సెంటర్‌గా, కర్నూలు, విశాఖపట్నంలో లెవల్-2 క్యాన్సర్ సెంటర్లను అభివృద్ధి చేయనుంది. రెండో దశలో కాకినాడ, అనంతపురం జీజీహెచ్‌లలోని విభాగాలను లెవెల్-2 క్యాన్సర్ సెంటర్లుగా అభివృద్ధిచేస్తుంది. ఇందుకుగాను రూ.119.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

అధునాతన పరికరాల ఏర్పాటు

గుంటూరు, కర్నూలు, విశాఖ క్యాన్సర్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వైద్య పరికరాలను సమకూరుస్తోంది. నాట్కో సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ సెంటర్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రారంభించింది. క్యాన్సర్ బాధితులకు రేడియేషన్ థెరపీ అందించడానికి ఆధునిక వైద్య పరికరాల్లో ఒకటైన లీనియర్ యాక్సిలేటర్ (లినాక్) ఇక్కడ అందుబాటులో ఉంది. దీనిని లెవెల్-1 సెంటర్‌గా అభివృద్ధి చేపట్టడానికి వీలుగా పెట్ స్కాన్ మిషన్‌ను సర్కార్ సమకూరుస్తోంది. మరోవైపు.. రూ.120 కోట్లతో కర్నూలులో కొత్తగా ఏర్పాటుచేస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవన నిర్మాణ పనులు వచ్చేనెలలో పూర్తవుతాయి. విశాఖపట్నంలో ఇప్పటికే భవనం అందుబాటులో ఉంది. ఈ రెండు చోట్లకు లినాక్, హెచ్‌డీ ఆర్ బ్రాకీ, సీటీ సిమ్యులేటర్ పరికరాల కొనుగోలుకు అధికారులు పర్చేజింగ్ ఆర్డర్లు(పీఓ) ఇచ్చారు. అదే విధంగా.. సర్జికల్, మెడికల్, రేడియేషన్ అంకాలజీ పరికరాల కొనుగోలు ప్రక్రియ ముగిసింది. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా పరికరాలను సమకూర్చే ప్రక్రియ పూర్తిస్థాయిలో పూర్తవుతుంది. అనంతపురం, కాకినాడల్లో లినాక్, సీటీ సిమ్యులేటర్ పరికరాల ఏర్పాటుకు బంకర్ల నిర్మాణం, ఇతర పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.



ఆరోగ్యశ్రీ ద్వారా అండగా..

రాష్ట్ర విభజన నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స మౌలిక సదుపాయాలను ఏపీ కోల్పోయింది. దీనికితోడు.. టీడీపీ సర్కార్ హయాంలో ప్రభుత్వాస్పత్రులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా.. క్యాన్సర్ చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రులపైనే మెజారిటీ శాతం ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో.. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగిన సీఎం వైఎస్ జగన్.. ప్రభుత్వ రంగంలో క్యాన్సర్ చికిత్స సదుపాయాల కల్పన, ఆయా ఆస్పత్రుల బలోపేతం, వ్యాధి నియంత్రణ చర్యలపై దృష్టిసారించారు. అలాగే, క్యాన్సర్‌కు సంబంధించిన అన్ని రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చి బాధితులకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు. గత ఏడాది క్యాన్సర్ బాధితుల చికిత్స కోసం పథకం కింద ఏటా రూ.600 కోట్లు ఖర్చుచేశారు.

ప్రణాళికాబద్ధంగా క్యాన్సర్‌కు కళ్లెం

క్యాన్సర్‌కు వైద్యం, వ్యాధి నియంత్రణ చర్యల విషయంలో ప్రణాళికబద్ధంగా అడుగులు వేస్తున్నాం. ప్రభుత్వ రంగంలోనే ఇందుకు మెరుగైన వైద్యం అందాలని సీఎం జగన్ ఆదేశించారు. ఆ మేరకు చర్యలు ప్రారంభించాం. ఈ ఏడాది ఆఖరుకు లెవల్-1 సెంటర్‌గా గుంటూరు.. లెవల్-2 కేంద్రాలుగా కర్నూలు, విశాఖపట్నం క్యాన్సర్ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తాం. మరోవైపు.. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) ఏపీ చాప్టర్‌ను ప్రారంభించాం. దీని పరిధిలోకి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ క్యాన్సర్ ఆస్పత్రులను తీసుకొచ్చి చికిత్స విషయంలో నిర్దేశిత ప్రొటోకాల్స్‌ను పాటించేలా చూస్తున్నాం. క్యాన్సర్ రిజిస్ట్రీని కూడా ప్రారంభించాం.

– ఎం.టి. కృష్ణబాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ

బోధనాస్పత్రులపై పటిష్ట పర్యవేక్షణ

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బోధనాస్పత్రులపై పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తన కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) విభాగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ బోధనాస్పత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్, ఇతర అంశాల్లో నాణ్యతపై పర్యవేక్షణ కోసం కొత్తగా జేడీలను నియమించనున్నట్లు తెలిపారు. అన్ని ఆస్పత్రుల్లో ప్రభుత్వమే సొంతంగా సీటీ, ఎమ్మారై స్కానింగ్‌లు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీపీపీ పద్ధతికి స్వస్తి పలికేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల చికిత్స అందించేందుకు అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా 10పడకల సామర్థ్యంతో వార్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన ఐదు వైద్య కళాశాలల్లో అన్ని వసతులను ఈ నెలాఖరులోగా సమకూర్చాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల, డీఎంఈ నరసింహం, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి పాల్గొన్నారు.

జీఐఎస్ ఒప్పందాలకు నేడు ఎస్ఐపీబీ ఆమోదం

- విశాఖ జీఐఎస్‌లో రూ13.11 లక్షల కోట్ల విలువైన 387 ఎంవోయూలు
- ఇప్పటికే 10 ఎస్ఐపీబీల ద్వారా 59 భారీ ప్రాజెక్టులకు ఆమోదం
- వాస్తవరూపంలోకి రూ. 3,39,959 కోట్ల పెట్టుబడులు
- 2,34,378 మందికి ఉద్యోగాలు
- నేడు మరికొన్ని ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

సాక్షి, అమరావతి: విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు (జీఐఎస్)లో చేసుకొన్న పెట్టుబడుల ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన వాస్తవ రూపంలోకి తెస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) పదిసార్లు సమావేశమై 59 భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగే 11వ సమావేశంలో మరికొన్ని కీలక ప్రాజెక్టులకు ఆమోదం తెలపనుంది. ఈ ప్రాజెక్టులకు సీఎస్ అధ్యక్షతన సోమవారం సమావేశమైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. వీటికి ఎస్ఐపీబీ మంగళవారం ఆమోదం తెలుపుతుంది. వీటిని బుధవారం జరిగే కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. మార్చి నెలలో విశాఖలో జరిగిన జీఐఎస్‌లో వివిధ రంగాలకు చెందిన 387 ఒప్పందాలు జరిగాయి. వీటి విలువ రూ.13.11 లక్షల కోట్లు. వీటిలో రూ.3,39,959 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 2,34,378 మందికి ఉపాధి లభించనుంది. వీటిలో ఇప్పటికే పలు ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించాయి. మరికొన్నింటి పనులు వేగంగా జరుగుతున్నాయి. జీఐఎస్‌లో కుదిరిన ఒప్పందాల్లో ఆరు నెలల్లోగా పనులు ప్రారంభించే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో పలు కంపెనీలు వేగంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే విశాఖలో ఏటీసీ టైర్స్ రూ.175 కోట్లతో ఏర్పాటు చేసిన హాఫ్‌వే టైర్స్, రూ. 2,700 కోట్లతో ఏర్పాటు చేసిన గ్రాసిం ఇండస్ట్రీస్ కాస్టిక్ సోడా తయారీ యూనిట్, రూ. 2,000 కోట్లతో ఏర్పాటైన సెయింట్ గోబియాన్ వంటి సంస్థలు ఉత్పత్తి ప్రారంభించాయి. తాజాగా ఒబెరాయ్ గ్రూపు గండికోట, తిరుపతి, విశాఖల్లో ఏర్పాటు చేస్తున్న సెవెన్ స్టార్ హోటళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. మంగళవారం జరిగే ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందే ప్రాజెక్టులను కూడా త్వరితగతిన పట్టాలు ఎక్కించేలా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.

డయాఫ్రమ్ వాల్‌పై మేధోమథనం

- సీడబ్ల్యూసీ, పీపీఏ, డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ, రాష్ట్ర జల వనరుల శాఖ అధికారుల సమావేశం
- డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల సమాంతర నిర్మాణం చేపట్టాలని సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ ప్రతిపాదన
- డ్యామ్ భద్రత దృష్ట్యా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని నిపుణుల ప్రతిపాదన
- రెండింటిపై అధ్యయనం చేసి వారంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ, పీపీఏలకు ఆదేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై కేంద్ర జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో సోమవారం ఢిల్లీలో మేధోమథనం జరిగింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, ఏబీ పాండ్య అధ్యక్షతన ఏర్పాటైన డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) నిపుణులు, నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ), వ్యాప్కోస్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులతోపాటు ప్రధాన కాంట్రాక్ట్ సంస్థ మేఘా, సబ్ కాంట్రాక్ట్ సంస్థలు బావర్, కెల్లర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో తొలుత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పరిస్థితిపై ఎన్‌హెచ్‌పీసీ ఇచ్చిన నివేదిక.. దాని ఆధారంగా సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ నిపుణులు చేసిన ప్రతిపాదనపై పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నేతృత్వంలో ఈ నెల 3న జరిగిన సమావేశంలో డయాఫ్రమ్ వాల్‌పై వచ్చిన రెండు ప్రతిపాదనలపై మేధోమథనం జరిపారు.

కొత్తది కడదామా.. సమాంతర నిర్మాణం చేద్దామా!

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల సమాంతరంగా 'యూ' ఆకారంలో కొత్తది నిర్మించి.. పాత దానితో అనుసంధానించాలని డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ చేసిన ప్రతిపాదనపై చర్చించారు. డ్యామ్ భద్రత దృష్ట్యా గ్యాప్–2లో పూర్తిగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని కేంద్ర జల్ శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, నిపుణులు చేసిన ప్రతిపాదనపై సమగ్రంగా చర్చించారు. ఈ రెండు ప్రతిపాదనల మేరకు పనులు చేపట్టడానికి సాంకేతికంగా, క్షేత్ర స్థాయిలో పనులు చేయడానికి గల సాధ్యాసాధ్యాలు, వాటిని పూర్తి చేయడానికి పట్టే సమయం, అయ్యే వ్యయంపై స్పష్టత ఇస్తూ వారంలోగా నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా, పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జల వనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డిలను కేంద్ర జల్ శక్తి శాఖ ప్రత్యేక కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆదేశించారు. ఈ రెండు ప్రతిపాదనలతో చేపట్టే పనుల వల్ల డయాఫ్రమ్ వాల్ సామర్థ్యం, పనితీరు, డ్యామ్ భద్రత వంటి అంశాలనూ నివేదికలో పేర్కొనాలని సూచించారు. దీనిని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్‌కు నివేదిస్తామని.. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? లేదంటే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో కొత్తది నిర్మించి, పాత దానితో అనుసంధానం చేయాలా? అనే అంశంపై ఆయన తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

‘పట్టు కోసం పట్టుపురుగుల ప్రాణాలు తీయవద్దు.
పత్తి కోసం రైతులు కష్టాలను కొని తెచ్చుకోవద్దు.
మట్టిలో కలవడానికి మొరాయిస్తుంది పాలియెస్టర్.
ఆ దుస్తులతో పర్యావరణానికి హాని కలిగించద్దు.
గడ్డి దారంతో ఫ్యాషన్‌లో కొత్త ట్రెండ్ తీసుకువద్దాం.
స్టైల్ స్టేట్‌మెంట్‌కి కొత్త నిర్వచనం ఇద్దాం’...
...అంటోంది నేచర్ లవర్ శృతి రావల్.



తాను రూపొందించిన హెంప్ డ్రెస్‌తో శృతి రావత్

గడ్డిదారంతో దుస్తులు

● కాదేదీ ఫ్యాషన్‌కనర్హం!

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసిన శృతి అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించింది. పర్యావరణ పరిరక్షణ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే తన సంకల్పానికి వస్త్ర ప్రపంచాన్ని వేదికగా మార్చుకుందామె. ఎకో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ పట్ల తన ఆసక్తిని సాక్షితో పంచుకున్నదీ యువతి.

ఫ్యాషన్ - పర్యావరణం

“నేను పుట్టింది హరియాణాలోని పంచకుల. అమ్మ పుట్టిల్లు పంజాబ్. నాన్నది హరియాణా. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చేటప్పటికి నేను సిక్త్స్ క్లాస్‌లో ఉన్నాను. ఇక నా చదువు, కెరీర్ అంతా హైదరాబాద్‌తోనే ముడివడిపోయింది. ఫ్యాషన్ ప్రపంచాన్ని బాగా అధ్యయనం చేసే కొద్దీ ఈ ఇండస్ట్రీ నుంచి పర్యావరణానికి కలిగే హాని అర్థమైంది. చాలా ఆందోళన కలిగింది. మన వస్త్రాల మోజు భూమిని అతలాకుతలం చేస్తోంది. భూమాతను కలుషితం చేస్తున్న ఇండస్ట్రీలలో ఫ్యాషన్ ఇండస్ట్రీ రెండవది. దీనికి పరిష్కారం ఈ రంగంలోనే వెతకాలనిపించింది. పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాన్ని చూపించాలనేదే నా ప్రయత్నం. నా స్టూడియోకి ‘ఎవోక్’ అని పేరు పెట్టడంలోని ఉద్దేశం కూడా పర్యావరణం పట్ల నిద్ర మేల్కొనండి’ అని పిలుపునివ్వడం.


పేపర్ ప్రజెంటేషన్ సందర్భంగా...

రిస్క్ అని హెచ్చరించారు!

ఎవోక్ ప్రాజెక్ట్ నా బ్రెయిన్ చైల్డ్. ఈ ఎకో ఫ్రెండ్లీ క్లోతింగ్ స్టూడియోని 2020 మార్చిలో ప్రారంభించాను, అదే నెలలో లాక్‌డౌన్ మొదలైంది. ఆ మెటీరియల్‌తో మాస్కులు చేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి విరాళంగా ఇచ్చాను. ఈ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే... ‘రిస్క్ చేస్తున్నావు’ అన్నారు తెలిసిన వాళ్లందరూ. పర్యావరణ పరిరక్షణ గురించి దశాబ్దాలుగా చెప్తున్నా కూడా సమాజంలో తగినంత చైతన్యం రానేలేదు. ఈ గడ్డి దుస్తుల గురించి అసలే తెలియదు. రంగు భరోసా, వస్త్రం మన్నిక ఉంటుందని కూడా తెలియదు. అలాంటప్పుడు మార్కెట్ ఎలా? పెట్టుబడి వెనక్కి వచ్చేదెప్పటికి? అన్నారు. అందరూ అలా అనుకుని తమను తాము సేఫ్‌జోన్‌లో ఉంచుకుంటే చాలా? బాగా లాభాలు వచ్చే రంగాన్నే ఎంచుకోవాలనే స్వార్థం తప్పు కాదు. కానీ లాభాల కోసం కొన్నేళ్లపాటు ఎదురు చూడగలిగిన ఆర్థిక పరిపుష్టి ఉన్నవాళ్లయినా ఒక ప్రయత్నం చేయాలి. ఇరవై ఏళ్ల కిందట ఎవరూ ముందుకు రాకపోతే మనం ఈ రోజు ఎలక్ట్రానిక్ వెహికల్‌ను వాడగలిగేవాళ్లమా? అలాగే వీగన్ డైట్ గురించి కూడా ఎంతోమంది సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చైతన్యవంతం చేశారు. నేను కూడా గత నెల 23వ తేదీన హెంప్, బెంబెర్గ్, టెన్సెల్, సిట్రస్ పీల్ వస్త్రాలతో రూపొందించిన డిజైనర్ వేర్‌తో ఫ్యాషన్ పెరేడ్ నిర్వహించాను. ఎకో ఫ్రెండ్లీ, ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ ఉద్యమంలో మమేకమయ్యే క్రమంలో నేను వెజిటేరియన్‌గా మారిపోయాను” అని చెప్పింది శృతి. ‘భవిష్యత్తులో మనం ప్రతి విషయంలోనూ పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వెతుక్కోవాల్సిందే. అందులో భాగంగా నేను నా ఫ్యాషన్ రంగాన్నే మాధ్యమంగా ఎంచుకున్నాను’ అని చెప్పారు శృతి రావల్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఒక రైతు పొలం దున్ని పత్తి పంట వేసి ఒక కేజీ పత్తి పండించాలంటే ఇరవై వేల లీటర్ల నీరు కావాలి. ఒక టెక్స్‌టైలర్ ఒక టీ షర్టుకి రంగులద్దడానికి రెండున్నర వేల లీటర్ల నీరు కావాలి. పత్తి పండడానికి పట్టే నీటిని భూమి పీల్చుకుంటుంది. ఇది కొంతలో కొంత నయం. కానీ హాట్ డైయింగ్ పద్ధతిలో రసాయన రంగులద్దిన నీరు భూమిని కలుషితం చేస్తుంది. అందుకే నేను గడ్డి మొక్కల దారంతో వడికిన వస్త్రాలను పరిచయం చేస్తున్నాను.

ఆకులతో దారం !

మనదేశంలో ఇలాంటి సంస్థలు నాలుగైదుకి మించిలేవు. ఇక పూర్తి స్థాయి హెంప్ (నార) క్లోతింగ్ స్టూడియో హైదరాబాద్‌లో ఇదొక్కటే. ఆకులను శుభ్రం చేసే ప్రాసెస్‌లో బూజు పట్టకుండా సహజసిద్ధమైన వనరులనే జత చేస్తారు. ఎండిన ఆకులతో దారం వడుకుతారు. మొక్కల ఆకుల దారంతో వస్త్రాలు తయారు చేసే పరిశ్రమలు మనదేశంలో రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో మాత్రమే ఉన్నాయి. ఈ గడ్డి రకం మొక్కలు పత్తిలాగ ఎక్కువ నీటిని తీసుకోవు. పత్తికంటే త్వరగా పెరిగి చేతికి వస్తాయి. వీటి పరిరక్షణ కోసం శ్రమించాల్సిన అవసరం ఉండదు. ఈ దారం ఇప్పుడు చైనా నుంచి దిగుమతి అవుతోంది. ఈ దుస్తులు ఎలా ఉంటాయోననే ఆందోళన అక్కర్లేదు. నేను ధరించింది హెంప్ వీవింగ్ డ్రెస్సే. క్లాత్ మీద డిజైన్‌లు నేను రూపొందించి డిజిటల్ ప్రింట్ చేయిస్తాను. కోల్డ్ డై కలర్స్ కాబట్టి క్లాత్‌తోపాటు ఎక్కువ కాలం మన్నుతాయి.

- శృతి రావల్, ఫౌండర్, ఎవోక్ స్టూడియో, హైదరాబాద్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఏ మంచికి మేలు చేస్తుందో ఏ చెడుకు హాని చేస్తుందో ఇంకా తేలలేదు కాని మనుషుల ఉపాధికి గట్టి పోటీ ఇచ్చేలా ఉంది.
ప్రాంతీయ భాషల్లో మొదటిసారిగా ఏఐతో తయారైన యాంకర్‌ను ఒడియా టివి ప్రవేశపెట్టింది.
ఈ యాంకర్ పేరు లిసా. ఇంగ్లిష్‌లో, ఒడియాలో వార్తలు చదివే లిసా ఒక కొత్త ఎట్రాక్షన్.
ఒడియా టివి కంటెంట్ హెడ్ లితిషా మంగత్ ఈ కొత్త ఆలోచనతో వార్తలకు ఎక్కింది.

వార్తలకు స్వాగతం.. నేను లిసా

న్యూస్‌మేకర్


ఏఐతో తయారైన యాంకర్ లిసా

దూరదర్శన్ న్యూస్‌రీడర్‌ల దగ్గరి నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) వర్చువల్ న్యూస్‌రీడర్ల వరకు మన దేశంలో టెలివిజన్ న్యూస్‌రీడర్ల ప్రస్థానం విశేషంగా కొనసాగుతూ ఉంది. ఒకప్పుడు నేషనల్ డిడి, రీజనల్ డిడిలో గుప్పెడు మందిగా ఉండే న్యూస్‌రీడర్లు ఇవాళ వందలాది ప్రయివేటు చానల్స్ వల్ల వేలమందిగా తయారయ్యారు. అయితే ఇప్పుడు వీరందరికీ ఒక సవాలు వచ్చిపడింది. మీడియా సంస్థలు ఏ.ఐ ద్వారా వర్చువల్ న్యూస్‌రీడర్లను సృష్టించి వారి ద్వారా యాంకర్ సేవలు చేయించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. జాతీయ స్థాయిలో ‘ఆజ్‌తక్’ తొలి వర్చువల్ న్యూస్ రీడర్ ‘సన’ను ప్రవేశపెట్టగా ప్రాంతీయ చానెల్స్‌లో మొదటిసారి ‘ఒడియా టివి’ తన వర్చువల్ న్యూస్‌రీడర్ ‘లిసా’ను ప్రవేశపెట్టింది.



లిసా

నేను లిసా

ఒరిస్సాలో ఒడియా టివి దాదాపు నంబర్ 1 స్థానంలో ఉంది. ఆ చానల్ తొలి వర్చువల్ న్యూస్ రీడర్ పేరే లిసా. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్.ఎల్.ఎం) ద్వారా లిసా న్యూస్ చదవడం, ఇతర ప్రోగ్రామ్స్ నిర్వహించడం చేస్తుంది. ‘సాంకేతికంగా ఇది అంత సులభంగా సాధ్యం కాలేదు. లిసాను సృష్టించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. లిసా ఇప్పటికిప్పుడు అంత ధారాళంగా ఒడియా మాట్లాడలేకపోయినా ముందు ముందు ఆ సమస్యను అధిగమిస్తాం’ అని ఓటివి (ఒడియా టివి) డిజిటల్ బిజినెస్ హెడ్ లితిషా మంగత్ చెప్పింది. ‘టెలివిజన్ రంగంలో మానవ వనరులను వార్తలను సేకరించడానికి సమర్థంగా ఉపయోగించాలి. వారు మంచి వార్తలు తెస్తే వాటిని చదవడం లిసా వంటి వర్చువల్ న్యూస్‌రీడర్లు చేసినా తప్పులేదు’ అని చెప్పిందామె. చక్కటి చీరకట్టులో సంప్రదాయ రూపం, బ్లేజర్‌లో ఆధునిక రూపంతో లిసా కనిపిస్తుంది. సరదాగా చెప్పాలంటే లిసా మేకప్, కాస్ట్యూమ్స్‌కు ఎటువంటి ఖర్చు ఉండదు. కంప్యూటర్‌ను టకటకలాడిస్తే కోరిన డ్రెస్, హెయిర్ స్టయిల్‌తో తెర మీద ప్రత్యక్షమవుతుంది.

ఆధునికతను అందిపుచ్చుకుని...

ఒడియా టివిని లితిషా మంగత్ తన నాయకత్వంలో ముందుకు తీసుకువెళుతోంది. తల్లి జగి మంగత్ 1997లో స్థాపించిన ఒడియా టివిని ఇప్పుడు లితిషా మంగత్ కొత్త ఆలోచనలతో నిర్వహిస్తోంది. లితిషా తండ్రి బైజయంత్ పండా బిజెపి నాయకుడు. రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడు. ఐ.ఐ.ఎం అహ్మదాబాద్‌లో చదువుకున్న లితిషా న్యూయార్క్ ఫిల్మ్ అకాడెమీలో చదువుకుని వచ్చి టివి పగ్గాలు అందుకుంది. ‘ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకోవాలంటే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. లిసా అటువంటి ప్రయత్నమే’ అంటుంది లితిషా. స్త్రీలు వాణిజ్య, వ్యాపార రంగాలలో విశేష ప్రతిభ చూపగలరనీ, వారిని అడ్డుకోకపోతే అంతేచాలని అభిప్రాయపడే లితిషా ఆ మేరకు యువతలో చైతన్యం కోసం ప్రసంగాలు చేస్తూ ఉంటుంది.

బ్యూటిప్

మెరిపించే క్రీమ్

రెండు టేబుల్ స్పూన్ల బియ్యంలో రెండు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్ వేసి రాత్రంతా నానబెట్టుకోవాలి. ఉదయాన్నే రోజ్‌వాటర్‌తోపాటు బియ్యాన్ని మెత్తగా రుబ్బాలి. ఇందులో కుంకుమ పువ్వ రేకులు, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, కాసింత కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వేసి మిశ్రమం క్రీమ్‌లా మారేంత వరకు కలుపుకుని గాజు సీసాలో వేసి నిల్వచేసుకోవాలి.

రోజూ ఉదయం, రాత్రి పడుకునే ముందు ఈ క్రీమ్‌ను ముఖానికి రాసుకుని మర్దన చేయాలి. క్రమం తప్పకుండా వారం రోజుల పాటు ఈ క్రీమ్ రాసుకోవడం వల్ల నల్లమచ్చలు, ట్యాన్ తగ్గి, ముఖ చర్మం కాంతిమంతంగా మారుతుంది.



● పసుపు రైతు ఆవిష్కరణ.. ఎకరానికి రూ.55 వేల నుంచి 30 వేలకు తగ్గిన ఖర్చు.
● టర్మరిక్ ప్లాంటర్ ద్వారా ఇద్దరు కూలీలతో రోజుకు మూడెకరాల్లో విత్తుకోవచ్చు.
● స్వల్పమార్పులతో చేమ, కంద పంటలనూ విత్తుకునే అవకాశం.

సాగుబడి
పునర్వసు కార్తె : జూలై 6 నుంచి

సృజనాత్మకం

పసుపు విత్తే పరికరం

రైతును మించిన శాస్త్రవేత్త లేడంటారు.. కొందరు రైతులను చూసినప్పుడు నిజమే అనిపిస్తుంది. రైతు శాస్త్రవేత్త ఈమని శివరామిరెడ్డి ఇందుకో నిదర్శనం. సాగులో ఏ సమస్య వచ్చినా తగిన పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నించటం ఈ సృజనాత్మక సేంద్రియ రైతు ప్రత్యేకత! ఆయన తయారు చేసుకున్న టర్మరిక్ ప్లాంటర్ పరికరం ద్వారా.. పసుపు విత్తన మోతాదుతో పాటు కూలీల ఖర్చును భారీగా తగ్గించగలిగారు. అంతా కలిపి పసుపు విత్తే దశలో ఎకరానికయ్యే ఖర్చును రూ. 55 వేల నుంచి రూ. 30 వేలకు తగ్గించగలిగారు. పనిలో పనిగా పసుపు నాణ్యతను, దిగుబడిని కూడా పెంచుకుంటున్నారు.





1. శివరామిరెడ్డి తయారు చేసుకున్న పరికరంతో ఎత్తుమడులపై పసుపు విత్తుతున్న దృశ్యం
2. 3. ఎత్తుమడులపై రెండు వరుసల్లో సమదూరంలో పెరుగుతున్న పసుపు, కంద పంటలు
4. పసుపు పంటను తవ్వే ఈ పరికరం కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నదే

మూడు దశాబ్దాల వ్యవసాయ అనుభవం ఉన్న ఈమని శివరామిరెడ్డి స్వస్థలం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామం. అయిదెకరాల మెట్ట భూమి ఉంది. మరికొంత భూమిని కౌలుకు సాగు చేస్తుంటారు. పసుపు, అరటి, కంద, కాలీఫ్లవర్, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారు. మరో విశేషం ఏమిటంటే, ఆయన వ్యవసాయమంతా సేంద్రియ పద్ధతిలోనే! జీవన ఎరువులను వాడుతున్నారు. పసుపు సాగుకు భారీ పెట్టుబడులు అవసరమనే విషయం తెలిసిందే. విత్తనానికే అధిక మొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. దీనికి తోడు కూలీల కొరత సమస్య. సాధారణ పద్ధతిలో ఎకరాలో పసుపు విత్తటానికి హీనపక్షం ఎనిమిది మంది కూలీలు అవసరం. ఎడ్ల నాగలి దున్నే కూలీలు కరువయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో.. విత్తనం నాటేందుకు ఏదైనా పరికరం తయారు చేసుకుంటే ఈ సమస్యలు తగ్గుతాయా? అని ఆయన ఆలోచించి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాల్లో నుంచే టర్మరిక్ ప్లాంటర్ పురుడు పోసుకుంది. సాగులో సమస్యలను అధిగమించేందుకు ఈమని శివరామిరెడ్డి కనుగొన్న అనేక పరికరాల్లో ‘పసుపు నాటే యంత్రం (టర్మరిక్ ప్లాంటర్)’ ఒకటి మాత్రమే.

ఎకరానికి రూ.25 వేలు ఆదా

యూట్యూబ్‌లో బంగాళదుంపల సాగులో వాడే పరికరాన్ని చూసి పసుపు సాగుకు అవసరమైన విధంగా మార్పులు చేసి, తయారు చేయించారు. వెల్డర్‌ను పిలిపించి, అవసరమైన ఇనుమును కొనుగోలు చేసి ఇంటి దగ్గరే దీన్ని చేయించారు. రూ.1.2 లక్షల ఖర్చుతో రూపొందించిన పరికరాన్ని పొలంలో పరీక్షించి చూడగా చక్కటి ఫలితం కనిపించింది. దీన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి, ఇద్దరు మహిళా కూలీలతో ఒక్క రోజులో మూడు ఎకరాల్లో పసుపు విత్తుతున్నారు. సగం విత్తనం కలిస్తోంది. సాధారణ పద్ధతిలో పసుపు విత్తాలంటే ఎకరాకు రూ.55 వేలు ఖర్చవుతుంది. శివరామిరెడ్డి టర్మరిక్ ప్లాంటర్ వాడితే ఆ ఖర్చు రూ.29,800లకు తగ్గుతుంది. తన పొలంలో పసుపు విత్తేందుకు వినియోగించటమే కాకుండా తోటి నలుగురైదుగురు రైతులకు కూడా ఇచ్చి.. తక్కువ ఖర్చుతో పసుపు విత్తుకునేందుకు తోడ్పడుతున్నారు.

ఇద్దరు కూలీలతో మూడెకరాలు..

టర్మరిక్ ప్లాంటర్‌ను ట్రాక్టర్‌కు అనుసంధానించి ఉపయోగిస్తున్నారు. సైకిల్ చైన్ తరహాలో, వీల్ చైన్‌తో ఇది పనిచేస్తుంది. ట్రాక్టర్ నడకకు అనుగుణంగా చైన్ తిరుగుతుంది. పైన ఉండే కంటెయినర్‌లో పసుపు విత్తనం పోస్తారు. అది దిగువకు పడుతుంటే, చెరోవైపున కూర్చొని ఉండే మనుషులు ఆ విత్తనాన్ని.. పైకి కిందకు తిరుగుతుండే గిన్నెల్లో పెడుతుంటారు. ఒక్కో వైపు 17 చొప్పున మొత్తం 34 గిన్నెలుంటాయి. చక్రం తిరుగుతుంటే అవి దిగువకు వెళుతుంటాయి. అక్కడ రెండువైపులా ఉండే గొట్టాలు మట్టిలో నాలుగు అంగుళాల లోతులో బెజ్జం పెడతాయి. గిన్నెలోంచి దిగువకు వచ్చే విత్తనం.. గొట్టంలో నుంచి నేరుగా అదే బెజ్జంలోకి పడిపోతుంది. ఆ తర్వాత అడుగున ఉండే రేకు విత్తనంపై మట్టిని కప్పేస్తుంది.. ఆ విధంగా ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన టర్మరిక్ ప్లాంటర్ సహాయంతో ఎత్తుమడులపై పసుపు విత్తటం అన్నమాట! రెండు విత్తనాల మధ్య ఆరు అంగుళాల దూరం ఉంటుంది. ఎత్తుమడులపై రెండు వరుసల్లో నిర్ణీత దూరంలో క్రమపద్ధతిలో విత్తటం వల్ల గాలి, వెలుతురు ధారాళంగా అందుతుంది. వర్షాలు ఎక్కువ కురిసినా, నీరు నిలబడినా పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

సగానికి తగ్గిన విత్తనం

టర్మరిక్ ప్లాంటర్‌తో ఖర్చు చాలా ఆదా అవుతోంది. ఎద్దు నాగలితో విత్తటానికి ఎకరాకు ఎనిమిది మంది కూలీలు కావాల్సి వుంటుంది. రూ.250 చొప్పున రూ.2 వేలు పెట్టాలి. ఎద్దు నాగలికి మరో రూ.వెయ్యి చెల్లించాలి. ఎకరాకు 1,300 కిలోల విత్తనం వినియోగిస్తుంటారు. ప్రస్తుత ధరల్లో క్వింటా రూ.4 వేలనుకున్నా 13 క్వింటాళ్లకు రూ.52 వేలు అవుతుంది. ట్రాక్టర్‌కు జోడించిన టర్మరిక్ ప్లాంటర్‌తో విత్తితే ఇద్దరు కూలీలు సరిపోతారు. ప్లాంటర్ అద్దె రూ.3,500. ఎకరానికి 650 కిలోల విత్తనం సరిపోతుంది. అంటే, రూ.26 వేలతో అయిపోతుంది. పైగా ఇద్దరు మహిళలతోనే రోజుకు మూడు ఎకరాల్లో విత్తుతున్నారు.

మరికొన్ని పరికరాలు..

పసుపు విత్తడానికి ఉపయోగపడే పరికరంతో మొదలు పెట్టి.. పసుపు పండిన తర్వాత హార్వెస్టింగ్ పరికరాన్ని, పసుపును ఆవిరితో ఉడికించేందుకు మరొక యంత్రాన్ని కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నారు. గెలలు నరికిన తర్వాత అరటి చెట్లను ముక్కలు చేసి పచ్చిరొట్ట ఎరువుగా మట్టిలో కలిపేసే పరికరాన్ని కూడా తయారు చేసుకోవటం విశేషం.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి


● అరటి పంట వ్యర్థాలను భూమిలో కలియదున్నే ఈ పరికరం కూడా శివరామిరెడ్డి తయారు చేసుకున్నదే

ఖర్చుతో పాటు తెగుళ్లు తక్కువ.. దిగుబడి ఎక్కువ..



ఎద్దునాగలితో పసుపు విత్తినప్పుడు ఒక చోట వత్తుగా, మరో చోట పలుచగా పడే అవకాశం ఉంది. మేం తయారు చేసుకున్న టర్మరిక్ ప్లాంటర్‌తో విత్తినప్పుడు క్రమపద్ధతిలో సమదూరంలో విత్తనాలు నాటగలుగుతున్నాం. నాణ్యమైన దిగుబడి, అధికంగా వస్తోంది. ఎత్తుమడులపై రెండు వరుసలుగా విత్తటం వల్ల తెగుళ్లకు అవకాశం తక్కువ. చక్రంపై తిరిగే గిన్నెల సైజును మార్చుకుంటూ ఇదే పరికరంతో చేమ, కంద పంటలను విత్తుతున్నాం. ఈ ప్రయోగం విజయవంతం కావటంతో ఆసక్తిచూపిన కొందరు రైతులకు ఇదే పరికరం చేయించి ఇస్తున్నా. మొదటిసారి తయారు చేయడానికి 20 రోజులు పట్టింది. ఖర్చు రూ.1.20 లక్షలైంది. ఇప్పుడు వారం రోజుల్లో రూ.90–95 వేలతోనే అయిపోతోంది. వీటితోపాటు మరికొన్ని పరికరాలను కూడా తయారు చేసుకోవటంతో వ్యవసాయ పనులు సులభంగా మారటం సంతోషంగా ఉంది.

- ఈమని శివరామిరెడ్డి (70134 66716), మెల్లెంపూడి, తాడేపల్లి మం., గుంటూరు జిల్లా.

సరైన ఆదాయ మార్గం సీమ పందుల పెంపకం

తక్కువ కాలంలో మంచి నికరాదాయం పొందాలనుకుంటే సీమ పందుల పెంపకం చేపట్టడం ఒక్కటే మార్గం అంటున్నారు యువ మహిళా రైతు రాచెల్లి అనూష. తెలంగాణ రాష్ట్రం జిల్లా కేంద్రం సిద్దిపేటకు 12 కిలో మీటర్ల దూరంలోని మల్యాలకు చెందిన అనూష సీమ పందులను పెంచుతూ చక్కటి ఆదాయాన్ని గడిస్తున్నారు.

పట్టభద్రురాలైన అనూష తన భర్త మల్లేశం ప్రోత్సాహంతో తన నాలుగు ఎకరాల పొలంలో మూడేళ్ల క్రితం నుంచి స్వయంగా వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక కష్టనష్టాల పాలయ్యారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, నాటు కోళ్లు, కంజు పిట్టలు, కుందేళ్లు, కొర్రమీను చేపలు.. ఏవి పెంచినా కలిసిరాలేదు. మూడేళ్లు తిప్పలు పడిన తర్వాత వెటర్నరీ కళాశాలకు చెందిన నిపుణులు డా. ప్రసాద్, డా. విద్య సలహా మేరకు సీమ పందుల ఫాంను ఏర్పాటు చేసుకొని చక్కని ఆదాయం పొందుతున్నారు.

పందులు పెంచటం ఏమిటని బంధువులు వారించినా పట్టించుకోకుండా భర్త సహకారంతో 2020 మార్చిలో 14 సీమ పందులను కొని తెచ్చుకొని పెంపకం ప్రారంభించారు. లార్జ్ వైట్ యార్క్ షేర్, ల్యాండ్రెస్, డ్యూరాక్, లార్జ్ బ్లాక్ యార్క్ షేర్ వంటి సంకర జాతి పందులను ఆమె పెంచుతున్నారు. ఫాంలో ఇప్పుడు వాటి సంఖ్య 150కి పెరిగింది. ఫాం సమీపంలోనే ఇంటిని నిర్మించుకొని నిరంతరం తానే స్వయంగా అన్ని పనులూ చేసుకోవటం ద్వారా అనూష చక్కటి ఫలితాలు పొందుతున్నారు.


● గడ్డి వేస్తున్న అనూష

మార్కెటింగ్ సమస్య లేదని అంటూ.. కర్ణాటక, అస్సాం తదితర రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వచ్చి సీమ పందులను కొనుక్కెళ్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అనేక జిల్లాల నుంచి రైతులు వచ్చి ఫాంను చూసి, పిల్లలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారన్నారు. వారానికో రోజు పంది మాంసాన్ని కిలో రూ. 280 చొప్పున ఫాం దగ్గరే విక్రయిస్తున్నారు.

మార్కెటింగ్ సమస్య లేదు!



సీమ పందులకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. పోటీ తక్కువ. శ్రమ తక్కువ. ఆదాయం ఎక్కువ. మార్కెటింగ్ సమస్య లేదు. ఒక ఎకరం భూమి సాగు చేస్తే ఎంత ఆదాయం వస్తుందో రెండు పందులను పెంచితే అంతే ఆదాయం వస్తుంది. దాణా, గడ్డి రోజుకు రెండు సార్లు వేయాలి. ఎప్పుడైనా వీలుకాకపోతే సాయంత్రం వేయకపోయినా పర్వాలేదు. 200 పందులను ఒక్కరే చూసుకోవచ్చు. పందులను సాదుకుంటూ వ్యవసాయం కూడా చేసుకోవచ్చు.

- రాచెల్లి అనూష, యువ రైతు

75 రోజుల్లో 20 కేజీలు

కోతకు అమ్మే పందులను, బ్రీడింగ్ కోసం అమ్మే పందులను ప్రత్యేక షెడ్లు వేసి వేర్వేరుగా పెంచుతున్నారు. పంది పిల్ల 75 రోజుల్లో 20 కేజీల బరువు పెరుగుతుందని అనూష వివరించారు. బ్రీడింగ్ కోసం 20 కేజీల బరువు పెరిగిన తర్వాత విక్రయిస్తున్నారు. మాంసం కోసం కోతకైతే సుమారుగా 80 కిలోలకు పైగా బరువు పెరిగిన తర్వాత విక్రయిస్తున్నారు. బ్రీడింగ్ పందులకు గడ్డితో పాటు రెండు పూటలా దాణా పెడుతున్నారు. కోతకు వెళ్లే పందులకు హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని కూడా మేపుతున్నారు. పశు వైద్యుడు డా. అభిలాష్ సూచనల మేరకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. అనేక వ్యాక్సిన్లతో పాటు, ఇతర ఇంజక్షన్లను క్రమం తప్పకుండా ఇస్తూ నాణ్యమైన మేతను అందిస్తే సీమపందుల పెంపకం సులభమేనని అంటారు అనూష భర్త మల్లేశం (97044 99873).

– గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి, సిద్దిపేట ; ఫోటోలు: కె. సతీష్ కుమార్



హైదరాబాద్ ఎఫ్‌సీకి విఘ్నేశ్ బదిలీ

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) మాజీ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తరఫున ఆడేందుకు డిఫెండర్ విఘ్నేశ్ దక్షిణామూర్తి ఒప్పందం కుదుర్చుకున్నాడు. మైసూర్‌కు చెందిన ఈ 25 ఏళ్ల డిఫెండర్ ముంబై సిటీ ఎఫ్‌సీ నుంచి బదిలీ అయ్యాడు. అయితే ఎంత మొత్తానికి బదిలీ అయ్యాడో ఆ రెండు ఫ్రాంచైజీలు వెల్లడించలేదు. 2020–21 సీజన్‌లో ముంబై ఐఎస్‌ఎల్ ట్రోఫీ సాధించడంలో విఘ్నేశ్ తన వంతు పాత్ర పోషించాడు. 2018లో 'శాఫ్' చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచిన జట్టులోనూ విఘ్నేశ్ సభ్యుడుగా ఉన్నాడు.

భారత్, బంగ్లాదేశ్ మహిళల రెండో టి20 నేడు



మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో బంగ్లాదేశ్‌తో నేడు మిర్పుర్‌లో జరిగే రెండో టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో ఉంది. బంగ్లా మహిళల జట్టు కంటే భారత జట్టే అన్ని రంగాల్లో పటిష్టంగా ఉంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో, వెబ్‌సైట్‌లో తిలకించవచ్చు.

పార్థ్ సాలుంకే 'స్వర్ణ' చరిత్ర

ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్



లిమెరిక్ (ఐర్లాండ్): భారత ఆర్చరీ ప్లేయర్ పార్థ్ సాలుంకే ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో పసిడి చరిత్ర లిఖించాడు. ఈ టోర్నమెంట్‌లో అతను పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచాడు. మొత్తంమీద ఈ పోటీల్లో భారత బృందం మునుపెన్నడు లేని విధంగా ఈ టోర్నీలోనే అత్యధికంగా 11 పతకాలు సాధించిన జట్టుగా నిలిచింది. అండర్–21 పురుషుల వ్యక్తిగత రికర్వ్ కేటగిరీలో మహారాష్ట్రకు చెందిన 19 ఏళ్ల సాలుంకే... ఆర్చరీలో ఘనాపాటిలైన కొరియన్‌ను కంగుతినిపించాడు. ఫైనల్లో పార్థ్ 7–3తో ఏడో సీడ్ సంగ్ ఇంజున్‌ను ఓడించాడు. ప్రత్యేకించి పురుషుల రికర్వ్‌లో బంగారు పతకం సాధించిన తొలి ఆర్చర్‌గా పార్థ్ సాలుంకే ఘనత వహించాడు. మహిళల రికర్వ్‌లో ఇదివరకే దీపిక కుమారి (2009, 2011), కొమలిక బారి (2019, 2021) బంగారు పతకాలు సాధించారు. మహిళల అండర్–21 వ్యక్తిగత రికర్వ్ కేటగిరీలో భారత్ ఖాతాలో కాంస్యం చేరింది. భజన్ కౌర్ 7–1తో చైనీస్ తైపీకి చెందిన సు సిన్ యూపై నెగ్గింది.

జొకోవిచ్‌దే పైచేయి

- 14వసారి క్వార్టర్ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్
- నాలుగు సెట్‌ల పోరులో హుర్కాజ్‌పై నెగ్గిన సెర్బియా స్టార్
- ఐదో సీడ్ సిట్సిపాస్‌కు చుక్కెదురు



జొకోవిచ్

లండన్: కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించే దిశగా సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఈ సెర్బియా స్టార్ 14వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి మూడు రౌండ్ మ్యాచ్‌ల్లో రెండున్నర గంటల్లోపే విజయాన్ని అందుకున్న జొకోవిచ్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో మాత్రం అంత సులువుగా గెలుపు దక్కలేదు. 2021 సెమీఫైనలిస్ట్, ప్రపంచ 18వ ర్యాంకర్ హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)తో జరిగిన మ్యాచ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 7–6 (8/6), 7–6 (8/6), 5–7, 6–4తో నెగ్గి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. 3 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 18 ఏస్‌లు సంధించగా, హుర్కాజ్ 33 ఏస్‌లతో అదరగొట్టాడు. తొలి సెట్‌లో జొకోవిచ్ మూడుసార్లు సెట్ పాయింట్లను, రెండో సెట్‌లో రెండుసార్లు సెట్ పాయింట్లను కాపాడుకోవడం గమనార్హం. ఈ మ్యాచ్ ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు జరిగింది. టోర్నీ నిబంధనల ప్రకారం రాత్రి 11 గంటల వరకే ఆటను కొనసాగించాలి. ఆదివారం రెండు సెట్‌లు ముగిసిన తర్వాత మ్యాచ్‌ను సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం ఆటను కొనసాగించగా... మూడో సెట్‌ను హుర్కాజ్ గెల్చుకున్నాడు. అయితే నాలుగో సెట్‌లో జొకోవిచ్ తన అనుభవాన్నంతా రంగరించి పోరాడాడు. ఏడో గేమ్‌లో హుర్కాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఎనిమిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకొని 5–3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అనంతరం పదో గేమ్‌లో జొకోవిచ్ తన సర్వీస్‌ను కాపాడుకొని సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. వింబుల్డన్ టోర్నీ చరిత్రలో జొకోవిచ్‌కిది 90వ విజయం కావడం విశేషం.

మరోవైపు ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) కథ ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అమెరికా ప్లేయర్ క్రిస్టోఫర్ యుబ్యాంక్స్ 3–6, 7–6 (7/4), 3–6, 6–4, 6–4తో సిట్సిపాస్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరాడు. జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6–4, 6–2తో తొలి రెండు సెట్‌లు గెల్చుకున్నాడు. అనంతరం లెహెస్కా గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలగడంతో మెద్వెదెవ్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కింది.

మూడో రౌండ్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7–5, 6–3తో జేకబ్ ఫియర్నెలీ–జోనస్ మండే (బ్రిటన్) జోడీపై నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకుంది.

ఓటమి అంచుల నుంచి...



మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఓటమి అంచుల నుంచి గట్టెక్కి తొలిసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరింది. 14వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6–7 (4/7), 7–6 (7/2), 6–3తో గెలిచింది. రెండో సెట్‌లో స్కోరు 5–6 వద్ద స్వియాటెక్ తన సర్వీస్‌లో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని స్కోరును 6–6తో సమం చేసింది. టైబ్రేక్‌లో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచిన ఆమె మూడో సెట్‌లోని నాలుగో గేమ్‌లో బెన్‌చిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆ తర్వాత తన సర్వీస్‌లను కాపాడుకొని గెలిచింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో స్వితోలినా (ఉక్రెయిన్) 2–6, 6–4, 7–6 (11/9)తో మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్)పై, రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–4, 6–0తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై, ఆరో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6–0, 6–3తో రెండుసార్లు చాంపియన్ క్విటోవా (చెక్ రిపబ్లిక్)పై, మాడిసన్ కీస్ 3–6, 7–6 (7/4), 6–2తో మిరా ఆండ్రీవా (రష్యా)పై గెలిచారు. డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) తొలి సెట్‌లో 4–1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ఆమె ప్రత్యర్థి బీట్రిజ్ హదద్ మయా (బ్రెజిల్) గాయం కారణంగా వైదొలిగింది.

లక్ష్య సేన్ అదరహో...

కెనడా ఓపెన్ టైటిల్ సొంతం ● ఫైనల్లో ప్రపంచ పదో ర్యాంకర్‌పై గెలుపు



కాల్గరీ: ఏడాదిన్నర తర్వాత భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ మరో అంతర్జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో లక్ష్య సేన్ చాంపియన్‌గా అవతరించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–18, 22–20తో ప్రపంచ పదో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ షి ఫెంగ్ లీ (చైనా)పై గెలుపొందాడు. గత ఏడాది జనవరిలో ఇండియా ఓపెన్ టైటిల్ సాధించాక లక్ష్య సేన్ నెగ్గిన మరో అంతర్జాతీయ టైటిల్ ఇదే కావడం విశేషం. టైటిల్ నెగ్గిన లక్ష్య సేన్‌కు 31,500 డాలర్ల (రూ. 25 లక్షల 99 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. గత ఏడాది ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో వ్యక్తిగత స్వర్ణ పతకం గెలిచిన లక్ష్య సేన్ ఈ సంవత్సరం తాను పాల్గొన్న 12వ టోర్నీలో తొలిసారి విజేతగా నిలిచాడు. షి ఫెంగ్ లీపై గతంలో నాలుగుసార్లు నెగ్గిన లక్ష్య సేన్‌కు ఈసారీ గట్టిపోటీనే ఎదురైంది. 50 నిమిషాలపాటు సాగిన ఈ పోరులో లక్ష్య సేన్ కీలకదశలో విజృంభించి పాయింట్లు గెలిచాడు. తొలి గేమ్‌లో స్కోరు 15–15తో సమంగా ఉన్నపుడు లక్ష్య సేన్ వరుసగా మూడు పాయింట్లు గెలిచి 18–15తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో స్కోరు 5–6 వద్ద ఉన్నపుడు షి ఫెంగ్ లీ వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి 11–6తో ముందంజ వేశాడు.

అనంతరం ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ షి ఫెంగ్ లీ 20–16తో నాలుగు గేమ్ పాయింట్లు సంపాదించాడు. అయితే లక్ష్య సేన్ దూకుడుగా ఆడి ఊహించనిరీతిలో వరుసగా ఆరు పాయింట్లు గెలిచాడు. తద్వారా రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 'ఒలింపిక్ అర్హత సంవత్సరం కావడం, దానికితోడు అన్నీ నాకు ప్రతికూల ఫలితాలు వస్తున్న సమయంలో ఈ విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ఈ టోర్నీ కొనసాగినకొద్దీ నా ఆటతీరు మెరుగైంది. ఫైనల్లో రెండో గేమ్‌లో వెనుకబడిన దశలో సంయమనం కోల్పోకుండా ఆడాలని నిర్ణయించుకున్నాను. ఇది ఫలితాన్నిచ్చింది' అని ఉత్తరాఖండ్‌కు చెందిన 21 ఏళ్ల లక్ష్య సేన్ వ్యాఖ్యానించాడు.

4 ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్‌లో లక్ష్య సేన్ నెగ్గిన టైటిల్స్. గతంలో అతను డచ్ ఓపెన్ (2019), సార్లార్‌లక్స్ ఓపెన్ (2019), ఇండియా ఓపెన్ (2022)లలో విజేతగా నిలిచాడు.

2 ఈ ఏడాది బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో టైటిల్ గెలిచిన రెండో భారతీయ ప్లేయర్ లక్ష్య సేన్. హెచ్‌ఎస్ ప్రణయ్ మలేసియా మాస్టర్స్ టోర్నీలో టైటిల్ గెలిచాడు.

గుకేశ్‌కు ఐదో స్థానం



జాగ్రెబ్ (క్రొయేషియా): సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఐదో స్థానంలో నిలిచాడు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సంయుక్తంగా ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లో విశ్వనాథన్ ఆనంద్‌పై గుకేశ్ గెలుపొందడం విశేషం. ఓవరాల్‌గా ర్యాపిడ్, బ్లిట్జ్ రెండు ఫార్మాట్‌లలో కలిపి తమిళనాడుకు చెందిన గుకేశ్ 19.5 పాయింట్లు సాధించాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు బరిలోకి దిగిన ఈ టోర్నీలో ఆనంద్ 16.5 పాయింట్లు సంపాదించాడు. 26 పాయింట్లతో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విజేతగా నిలిచాడు.

భారత వాలీబాల్ జట్టుకు నిరాశ



మనామా (బహ్రెయిన్): ప్రపంచ అండర్–21 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. గ్రూప్ లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు పరాజయం చవిచూసింది. తద్వారా నాకౌట్ దశకు అర్హత సాధించలేకపోయింది. పూల్ 'సి'లో ఉన్న భారత జట్టు తొలి మ్యాచ్‌లో 17–25, 14–25, 25–20, 19–25తో పోలాండ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో 19–25, 25–22, 27–29, 13–25తో బల్గేరియా చేతిలో... మూడో మ్యాచ్‌లో 25–18, 27–29, 20–25, 22–25తో కెనడా చేతిలో ఓడిపోయింది. పదేళ్ల తర్వాత మళ్లీ ఈ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన భారత జట్టు తదుపరి 9 నుంచి 16 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడుతుంది.

సినిమా

లేడీ లక్...



● నవీన్ పొలిశెట్టి, అనుష్క

నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ సినిమా ఆగస్టు 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. రథన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'లేడీ లక్..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని సోమవారం రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను కార్తీక్ పాడారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. చెఫ్ అన్విత రవళిగా అనుష్క, స్టాండప్ కమెడియన్ సిద్ధుగా నవీన్ పాత్రలు మనసులను హత్తుకునేలా ఉంటాయి. 'లేడీ లక్..' సాంగ్‌లో నవీన్ ఎనర్జీ, అనుష్క చార్మింగ్ లుక్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నీరవ్ షా.

ఐదు భాషల్లో డబుల్ ఇస్మార్ట్



● చార్మి, రామ్, పూరి జగన్నాథ్

హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో 'డబుల్ ఇస్మార్ట్' సినిమా షురూ అయింది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, చార్మి నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం ప్రారంభమైంది. 'ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్' అంటూ రామ్ డైలాగ్ చెప్పిన తొలి సీన్‌కి చార్మి క్లాప్ ఇవ్వగా, పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ''ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి జగన్నాథ్ చాలా పెద్ద స్పాన్ ఉన్న కథ రాశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందనుంది. 'ఇస్మార్ట్ శంకర్' కంటే ఈ సినిమాలో రామ్‌ని మాసియర్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పూరి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 2024 మార్చి 8న 'డబుల్ ఇస్మార్ట్'ని రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి.

ఆర్ఆర్ఆర్‌కు సీక్వెల్ ఉంది.. కానీ...



● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి విజయేంద్రప్రసాద్ కథ అందించారు. 'ఆర్ఆర్ఆర్'కు సీక్వెల్ చేసే చాన్స్ ఉందని విజయేంద్రప్రసాద్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన మరోసారి స్పందించారు. ''ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా 'ఆర్ఆర్ఆర్' సీక్వెల్‌ను హాలీవుడ్ ఫిల్మ్ రేంజ్‌లో చేసే ఆలోచన ఉంది. ఈ సీక్వెల్‌కు రాజమౌళి దర్శకత్వం వహించవచ్చు లేదా ఆయన పర్యవేక్షణలో ఎవరైనా హాలీవుడ్ డైరెక్టర్ తెరకెక్కించవచ్చు'' అని పేర్కొన్నారు విజయేంద్రప్రసాద్. ఇక రాజమౌళి ప్రస్తుత సినిమాలో మహేశ్‌బాబు హీరోగా నటించనున్నారు. ఈ చిత్రం తర్వాత మహాభారతం నేపథ్యంలో రాజమౌళి సినిమా చేసే అవకాశం ఉందన్నట్లుగా విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

ఎవర్నీ కాను..



● షారుక్ ఖాన్

''ఎవరు నేను.. ఎవర్నీ కాను.. తెలియదు. తల్లికి ఇచ్చిన మాట కావొచ్చు. నేరవేరని లక్ష్యం కావొచ్చు. నేను మంచివాణ్ణా? చెడ్డవాణ్ణా.. పుణ్యాత్ముణ్ణా.. పాపాత్ముణ్ణా.. నీకు నువ్వే తెలుసుకో...'' అని షారుక్ ఖాన్ చెప్పే డైలాగ్స్‌తో విడుదలైంది 'జవాన్' ప్రివ్యూ వీడియో. షారుక్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం 'జవాన్'. నయనతార, విజయ్ సేతుపతి, ప్రియమణి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాలో దీపికా పదుకోన్ ఓ స్పెషల్ గెస్ట్ రోల్ చేశారు. ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబరు 7న రిలీజ్ కానుంది.

అందుకే మళ్లీ విడుదల చేస్తున్నాను - ఆర్. నారాయణమూర్తి



● ఆర్. నారాయణమూర్తి

''విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, కష్టాలు, వారి తల్లిదండ్రుల కన్నీళ్లను 'యూనివర్సిటీ'లో చూపించాను. వేసవి, వడగాల్పుల వల్ల ఈ చిత్రాన్ని ప్రేక్షకులు సరిగ్గా చూడలేకపోయారు.. అందుకే మళ్లీ విడుదల చేస్తే జనాలకు బాగా చేరువ అవుతుందని రిలీజ్ చేస్తున్నాను'' అని ఆర్. నారాయణమూర్తి అన్నారు. ఆర్. నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యూనివర్సిటీ' జూన్ 9న విడుదలైంది. ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ''పదో తరగతి పేపరు లీకేజీలు, గ్రూప్ 1, 2లాంటి ఉద్యోగ పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీలు జరుగుతుంటే విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ ఏం కావాలి? అనే సందేశంతో ఈ సినిమా తీశాను. విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాను'' అన్నారు.

ఫన్.. థ్రిల్



● శివాని, శ్రీ కమల్

''నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన యూత్‌ఫుల్ ఫన్ అండ్ థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్ 'జిలేబి'. విజయభాస్కర్ తనయుడు శ్రీ కమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివానీ రాజశేఖర్ హీరోయిన్‌గా నటించగా, రాజేంద్రప్రసాద్ ఓ కీలక పాత్ర పోషించారు. అంజు అశ్రాని సమర్పణలో గుంటూరు రామకృష్ణ నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 21న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

ప్రేమ.. సస్పెన్స్...



● దుషారా విజయన్, అర్జున్ దాస్

''సున్నితమైన అంశాలను వసంత బాలన్ చక్కగా తెరపై చూపిస్తుంటారు. ఒకవైపు లవ్, మరోవైపు సస్పెన్స్... రెండింటికీ సమ న్యాయం చేస్తూ 'బ్లడ్ అండ్ చాక్లెట్'ని తీశారు. ఈ చిత్రం నాకు చాలా బాగా నచ్చింది'' అని డైరెక్టర్ శంకర్ అన్నారు. అర్జున్ దాస్, దుషారా విజయన్ జంటగా నటించిన చిత్రం 'బ్లడ్ అండ్ చాక్లెట్'. వసంత బాలన్ దర్శకత్వంలో ఎస్ పిక్చర్స్ పతాకంపై ప్రముఖ దర్శకుడు శంకర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 21న విడుదల కానుంది. ఈ మూవీని తెలుగులో ఎస్ఆర్‌డీఎస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. జీవీ ప్రకాష్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను డైరెక్టర్ శంకర్ విడుదల చేశారు. ''జీవీ ప్రకాష్ నాలుగు అద్భుతమైన పాటలు అందించారు. నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలుస్తుంది'' అన్నారు వసంత బాలన్ .

ఈ సినిమా నాకు ప్లస్ - విరాజ్ అశ్విన్



''అనగనగా ఓ ప్రేమకథ' (2018)తో హీరోగా పరిచయం అయ్యాను. కానీ నా కెరీర్‌కు సరైన థియేట్రికల్ రిలీజ్ హిట్ ఫిల్మ్ లేదు. 'థ్యాంక్యూ బ్రదర్'కు మంచి స్పందన వచ్చినప్పటికీ ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజైంది. 'బేబీ' హిట్ అయి, నా కెరీర్‌కు ప్లస్ అవుతుందని నమ్ముతున్నా'' అన్నారు విరాజ్ అశ్విన్. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో విరాజ్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ విరాజ్ పాత్ర చేశాను. 'బేబీ' ట్రయాంగిల్ స్టోరీలా అనిపించినా కథనం, క్లయిమాక్స్ కొత్తగా ఉంటాయి. ఈ కథ ఓ అమ్మాయి చుట్టూ తిరుగుతుంది. స్కూల్ డేస్‌లో ఆనంద్‌ను ప్రేమించిన అదే అమ్మాయితో ఆమె కాలేజీ డేస్‌లో నేను లవ్‌లో పడతాను. ఈ చిత్రం 'ప్రేమదేశం', 'ప్రేమిస్తే' తరహాలో ఉంటుందని కొందరు ఊహిస్తున్నారు. కానీ ఫ్రెష్ అప్రోచ్ ఉన్న లవ్‌స్టోరీ 'బేబీ'. ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేష్ గారు నాకు మామయ్య. ఇండస్ట్రీలో చాలా అనుభవం ఉన్న ఆయన 'బేబీ' ట్రైలర్ చూసి, సినిమా హిట్ అవుతుందని చెప్పారు. ప్రస్తుతం 'మరీచిక' అనే మూవీ చేస్తున్నాను'' అన్నారు.

ట్రైలర్ బాగుంది - సత్యదేవ్

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ నెల 21న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను లాంచ్ చేసిన హీరో సత్యదేవ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కాన్సెప్ట్ నాకు ముందే తెలుసు. కానీ ఇంత ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందనుకోలేదు. ట్రైలర్ బాగుంది. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమాలో నా పాత్ర మాసీగా ఉంటుంది'' అన్నారు సంజయ్ రావు. ''నా కొడుకు సంజయ్ హీరోగా ఎదిగినందుకు హ్యాపీ. సినిమాల ఎంపికలో తనకి సలహాలివ్వను'' అన్నారు బ్రహ్మాజీ. ''మనుషులకంటే జంతువులే విధేయంగా ఉంటాయి. ఐశ్వర్యా రాయ్ చెట్టుని పెళ్లి చేసుకుంది. ఈ రెండు పాయింట్లను అల్లుకుని ఈ సినిమా కథ రాశా. ఈ చిత్రంలో అడల్ట్ కంటెంట్ లేదు. డాగ్‌కు మేల్ వాయిస్ పెట్టాం. అందులో ఓ ట్విస్ట్ ఉంది. థియేటర్స్‌లో చూడండి'' అన్నారు శ్రీధర్. ''ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అప్పిరెడ్డి.



● సంజయ్ రావు, ప్రణవి, సత్యదేవ్

మిషన్ ఏంటి?



● హేలీ అట్వెల్, టామ్ క్రూజ్

టామ్ క్రూజ్ నటించిన చిత్రం 'మిషన్: ఇంపాజిబుల్–డెడ్ రికనింగ్ పార్ట్ వన్'. క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో రేపు(బుధవారం) విడుదలవుతోంది. ''మిషన్: ఇంపాజిబుల్–ఫాల్ అవుట్ (2018)కి సీక్వెల్, 7వ విడత 'మిషన్: ఇంపాజిబుల్' ఫిల్మ్ సిరీస్‌గా రూపొందిన చిత్రం 'మిషన్: ఇంపాజిబుల్–డెడ్ రికనింగ్ పార్ట్ వన్'. ఏతాన్ హంట్ (టామ్ క్రూజ్), అతని ఐఎమ్‌ఎఫ్ (ఇంపాజిబుల్ మిషన్ ఫోర్స్) బృందం ఓ ప్రమాదకరమైన మిషన్‌ను ప్రారంభిస్తారు. ఆ మిషన్ ఏంటి? టామ్ క్రూజ్ ఇప్పటివరకూ చేయని, ఈ మూవీలో చేసిన ప్రమాదకరమైన స్టంట్ ఏంటి? అనేది సినిమాలో చూడాల్సిందే'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 64	65,344
నిఫ్టీ ▲ 24	19,356

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,654	▽	7
డోజోన్స్	33,896	▲	161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,274	▲	17
డాక్స్	15,673	▲	70
షాంఘై	3,204	▲	7
నికాయ్	32,190	▽	199

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,656
బంగారం (99.5 స్వచ్ఛత)	50,421
వెండి (కిలో)	70,631

హ్యుందాయ్ ఎక్స్‌టర్ వచ్చేసింది

ధర రూ.5.99 లక్షల నుంచి • మైలేజీ 19.4 కిలోమీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.5.99 లక్షల నుంచి మొదలుకుని రూ.9.31 లక్షల వరకు ఉంది. టాటా మోటార్స్ పంచ్ కారుకు ఇది పోటీనివ్వనుంది. మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లతో 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. మైలేజీ లీటరుకు 5–స్పీడ్ మాన్యువల్ ట్రిమ్ 19.4 కిలోమీటర్లు, 5–స్పీడ్ ఆటోమేటిక్ ట్రిమ్ 19.2 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. సీఎన్‌జీ ట్రిమ్ కేజీకి 27.1 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది. ఈ వేరియంట్ ధర రూ.8.23 లక్షలు ఉంది.

కారు హంగులు..

ఫుట్‌వెల్ లైటింగ్, వాయిస్ ఆధారిత స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, వెహికిల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్, డ్యూయల్ కెమెరాతో డ్యాష్‌క్యామ్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, పార్కింగ్ అసిస్ట్, ఇన్‌సైడ్ రేర్ వ్యూ మిర్రర్, హెడ్‌ల్యాంప్ ఎస్కార్ట్ సిస్టమ్, రేర్ డీఫాగర్, ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, సెంట్రల్ లాకింగ్, వంటి హంగులు ఉన్నాయి. 391 లీటర్ల బూట్ స్పేస్, గ్రౌండ్ క్లియరెన్స్ 185 ఎంఎం ఉంది.

వ్యయం రూ.950 కోట్లు..

ఎక్స్‌టర్ రాకతో దేశంలో పూర్తి శ్రేణి ఎస్‌యూవీ తయారీ సంస్థగా నిలిచామని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ ఈ సందర్భంగా తెలిపారు. 'ఈ మోడల్ అభివృద్ధికి రూ.950 కోట్లు ఖర్చు చేశాం. భారత్‌లో వచ్చే 10 ఏళ్లలో తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటాం' అని కూడా ఆయన తెలిపారు.

విక్రయాలు మెరుగ్గా..

హ్యుందాయ్ ఖాతాలో ఎక్స్‌టర్ ఎనిమిదవ ఎస్‌యూవీ కావడం విశేషం. ఆరు ఎస్‌యూవీ ఉప విభాగాల్లో మోడళ్లను ఆఫర్ చేస్తున్న ఏకైక కంపెనీ తామేనని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీవోవో తరుణ్ గర్గ్ తెలిపారు. ఎక్స్‌టర్ చేరికతో ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ అమ్మకాలు నెలకు 20–22 వేల యూనిట్లు ఉంటాయన్నారు. జనవరి–జూన్ కాలంలో 10.5% వృద్ధితో 2.96 లక్షల యూనిట్ల అమ్మకాలు సాధించామన్నారు.



ఎక్స్‌టర్‌తో ఉన్సూ కిమ్, తరుణ్ గర్గ్ (కుడి) →

మార్కెట్లకు ఆర్‌ఐఎల్ దన్ను

- 64 పాయింట్లు ప్లస్‌తో 65,344కు సెన్సెక్స్
- 24 పాయింట్లు పెరిగి 19,356కు చేరిన నిఫ్టీ

ఆటుపోట్ల మధ్య లాభాలు

ముంబై: స్వల్ప ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు అంతంత మాత్రంగా బలపడ్డాయి. సెన్సెక్స్ 64 పాయింట్లు పుంజుకుని 65,344 వద్ద నిలవగా.. నిఫ్టీ 24 పాయింట్ల లాభంతో 19,356 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 353 పాయింట్లు ఎగసి 65,633 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం ఒక దశలో 19,436కు చేరినప్పటికీ 19,327 వద్ద ఇంట్రాడే కనిష్టాన్నీ చవిచూసింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్ల పెంపు సంకేతాలు ఇవ్వడంతో వారాంతాన పతనమైన మార్కెట్లు కోలుకున్నాయి. ఇండెక్స్ హెవీవెయిట్ ఆర్‌ఐఎల్ మార్కెట్లకు అండగా నిలవగా.. ఐటీ కౌంటర్లు మందగించాయి.

మెటల్, ఆయిల్ అప్

ఎన్ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్ ఇండెక్స్ 1.7 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.6 శాతం చొప్పున బలపడ్డాయి. ఐటీ, కన్స్యూమర్ డ్యురబుల్స్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఆటో 1.2-0.6 శాతం మధ్య డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఆర్‌ఐఎల్ దాదాపు 4 శాతం జంప్‌చేయగా.. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సన్ ఫార్మా, హిందాల్కో 3.3–1.3 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, పవర్‌గ్రిడ్, టీసీఎస్,



హెచ్‌యూఎల్, నెస్లే, విప్రో, బీపీసీఎల్, యాక్సిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ 3-1 శాతం మధ్య నీరసించాయి.

చిన్న షేర్లు వీక్

మార్కెట్లు పుంజుకున్నప్పటికీ బీఎస్‌ఈలో స్మాల్, మిడ్‌క్యాప్స్ 0.5–0.25 శాతం మధ్య వెనకడుగు వేశాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,299 నష్టపోగా.. 1,393 మాత్రమే లాభపడ్డాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.8 శాతం నీరసించి 77.84 డాలర్లకు చేరగా.. డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా బలపడి 82.58 వద్ద నిలిచింది. నగదు విభాగంలో వారాంతాన రూ. 790 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 588 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. డీఐఐలు సైతం రూ. 288 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

సైయంట్ డీఎల్‌ఎం లిస్టింగ్ భళా



ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసుల కంపెనీ సైయంట్ డీఎల్ఎం భారీ లాభాలతో లిస్టయ్యింది. ఇష్యూ ధర రూ. 265తో పోలిస్తే బీఎస్‌ఈలో 51 శాతం ప్రీమియంతో రూ. 401 వద్ద లిస్టయ్యింది. ఆపై ఒక దశలో 61% దూసుకెళ్లి రూ. 426ను అధిగమించింది. చివరికి 59 శాతం(రూ. 156) లాభంతో రూ. 421 వద్ద ముగిసింది. ఎన్ఎస్‌ఈలో సైతం రూ. 403 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి రూ. 427 వరకూ ఎగసి చివరికి రూ. 422 వద్ద స్థిరపడింది. వెరసి రూ. 157 లాభంతో ముగిసింది.

వేదాంత చిప్ ప్లాంటుకు బ్రేక్

- జేవీ నుంచి తప్పుకున్న ఫాక్స్‌కాన్
- వేరే సంస్థలతో జట్టు కట్టనున్న వేదాంత

న్యూఢిల్లీ: భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటు నెలకొల్పేందుకు దేశీ దిగ్గజం వేదాంతతో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ (జేవీ) నుంచి హాన్ హయ్ టెక్నాలజీ గ్రూప్ (ఫాక్స్‌కాన్) తప్పుకుంది. మరిన్ని వైవిధ్యమైన అవకాశాలను అన్వేషించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. 'పరస్పర అంగీకారం మేరకు, వేదాంతతో జాయింట్ వెంచర్ విషయంలో ముందుకు సాగ



రాదని నిర్ణయించుకున్నాం. వేదాంత యాజమాన్యంలోని సంస్థకు మాకు ఎటువంటి సంబంధం ఉండదు. మా పేరును జోడించి ఉంచడం వల్ల గందరగోళానికి దారి తీస్తుంది కాబట్టి దాన్ని తొలగించుకునే ప్రయత్నాల్లో ఉన్నాం' అని ఫాక్స్‌కాన్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, భారత ప్రభుత్వ మేకిన్ ఇండియా ఆకాంక్షల సాకారానికి పూర్తి తోడ్పాటు అందిస్తామని, స్థానిక అవసరాల మేరకు భాగస్వామ్యాలు కుదుర్చుకుంటామని పేర్కొంది.

తైవాన్‌కు చెందిన కాంట్రాక్ట్ ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్, వేదాంత .. గుజరాత్‌లో దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడితో దేశీయంగా తొలి సెమీకండక్టర్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు గతేడాది జేవీ కుదుర్చుకున్నాయి. ఏడాది పైగా దీనిపై కసరత్తు చేశాయి. సాంకేతిక భాగస్వామిగా యూరప్ సంస్థ ఎస్‌టీ మైక్రోఎలక్ట్రానిక్స్‌తో జట్టు కట్టేందుకు ప్రయత్నించినా చర్చలు ముందుకు సాగలేదు. దీంతో ప్రస్తుతం వేదాంత-ఫాక్స్‌కాన్ జేవీకి బ్రేక్ పడింది. ఫోన్లు, ఫ్రిజ్‌లు, కార్లలో ఉపయోగించే చిప్‌లు కేవలం కొన్ని దేశాల్లోనే తయారవుతున్నాయి. భారత్ కూడా చిప్‌ల తయారీలోకి ప్రవేశించడంపై దృష్టి పెట్టి ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీనికి స్పందనగా వేదాంత-ఫాక్స్‌కాన్, ఐఎస్ఎంసీ, ఐజీఎస్ఎస్ దరఖాస్తు చేసుకున్నాయి. అయితే, వేదాంత జేవీ మినహా మిగతా రెండింటి విషయంలో పెద్దగా పురోగతి లేదు.

ప్రాజెక్టుకు కట్టుబడి ఉన్నాం..

కాగా సెమీకండక్టర్ ప్రాజెక్టుకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని వేదాంత స్పష్టం చేసింది. చిప్ ప్లాంటు ఏర్పాటులో భాగస్వాములయ్యేందుకు పలు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది. 'సెమీకండక్టర్ల విషయంలో ప్రధాని విజన్‌ను సాకారం చేసేందుకు, మరింతగా కృషి చేస్తాం' అని వేదాంత పేర్కొంది.



భారత్ లక్ష్యాలపై ప్రభావం ఉండదు

వేదాంతతో జేవీ నుంచి ఫాక్స్‌కాన్ వైదొలగడమనేది భారత్ నిర్దేశించుకున్న చిప్ ఫ్యాబ్రికేషన్ ప్లాంటు ఏర్పాటు లక్ష్యాలపై ప్రభావం చూపబోదు.

– రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర ఐటీ మంత్రి

ప్రత్యక్ష పన్ను వసూళ్లు 16 శాతం అప్

జూలై 9 వరకూ రూ.4.75 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) జూలై 9వ తేదీ వరకూ 16 శాతం పెరిగి (2022–23 ఇదే కాలంతో పోల్చి) రూ.4.75 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఎకానమీ క్రియాశీలతకు ఇది ప్రతిబింబమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.18.23 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు జరగాలన్నది బడ్జెట్ లక్ష్యం. 2022–23 వసూళ్ల (రూ.16.61 లక్షల కోట్లు) ఇది 9.75 శాతం అధికం. కాగా, ఏప్రిల్ 1 నుంచి జూలై 9 మధ్య రూ.42,000 కోట్ల రిఫండ్స్ కూడా జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-7-2023	
విశాఖ	435–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
రిటైల్ ధర (డజను)	72.00
10-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.85

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 55వ కోర్సు(ఏప్రిల్ 2024)కు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 55
- **కేటగిరీ వారీగా ఖాళీలు:** ఎన్‌సీసీ పురుషులు-50, ఎన్‌సీసీ మహిళలు–05.
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఎన్‌సీసీ–సి సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
- **వయసు:** 01.01.2024 నాటికి 19 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్–1, స్టేజ్–2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.08.2023.
- **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

ఈఐఎల్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులు

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్) డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** సీఏ/సీడబ్ల్యూఏ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 47 ఏళ్లు మించకూడదు. కనీసం 19 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.1.2 లక్షలు నుంచి రూ.2.8 లక్షలు చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2023.
- **వెబ్‌సైట్:** www.engineersindia.com

హెచ్‌సీఎల్, బాలాఘట్‌లో 184 అప్రెంటిస్‌లు

మధ్యప్రదేశ్ బాలాఘట్‌లోని హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్(హెచ్‌సీఎల్).. ఆధ్వర్యంలోని మలాంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్ కోసం అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 184
- **ట్రేడులు:**మేట్,బ్లాస్టర్, ఫిట్టర్,టర్నర్,వెల్డర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, సర్వేయర్, మాసన్, హార్టికల్చర్ అసిస్టెంట్ తదితరాలు.
- **విభాగాలు:** మైన్స్, డీజిల్, గ్యాస్, ఎలక్ట్రిక్, సివిల్, మెకానికల్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పదో తరగతి/10+2/ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెరిట్, ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఎంపికచేస్తారు
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.08.2023.
- **వెబ్‌సైట్:** www.hindustancopper.com

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో 55 అప్రెంటిస్‌లు

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్.. గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 55
- **విభాగాలు:** కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్,ఇన్‌స్ట్రుమెంటేషన్–కంట్రోల్ ఇంజనీరింగ్.

అర్హత

- **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
  స్టైపెండ్: నెలకు రూ.10,500 చెల్లిస్తారు.
- **టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
  స్టైపెండ్: నెలకు రూ.9400 చెల్లిస్తారు.
- **అప్రెంటిస్‌షిప్ వ్యవధి:** ఒక ఏడాది.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.08.2023.
- **వెబ్‌సైట్:** www.ipr.res.in

ఎండీఎస్‌ఎల్, ముంబైలో 466 ట్రేడ్ అప్రెంటిస్‌లు

ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్.. వివిధ ట్రేడ్‌లలో ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 466
- **ట్రేడుల వివరాలు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు.
- **అర్హత:** ఖాళీలని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
- **ఆన్‌లైన్ పరీక్ష తేది:** ఆగస్టు 2023.
- **వెబ్‌సైట్:** www.mazagondock.in

ఇంటర్‌తోనే.. బీఈడీలో ప్రవేశం

- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)
- ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో ప్రారంభం
- దేశవ్యాప్తంగా 42 యూనివర్సిటీల్లో మొత్తం 3950 సీట్లు
- నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ఆధారంగా ప్రవేశాలు
- 2023-24కు తొలి ఎన్‌సీఈటీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

కొత్తగా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్(ఐటీఈపీ) ప్రారంభమైంది! ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో 42 విద్యాసంస్థల్లో ఈ కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నారు. అందుకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ)ను నిర్వహించనుంది. తాజాగా.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌సీఈటీ 2023 దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీఈటీ వివరాలు, ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ ప్రాధాన్యత, ప్రవేశం కల్పించనున్న ఇన్‌స్టిట్యూట్స్ తదితర వివరాలు..

దేశంలో ఉపాధ్యాయ విద్యను పర్యవేక్షిస్తున్న సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు.. ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పేరుతో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు ఐఐటీలు, నిట్‌లు, ఆర్‌ఐఈలు సహా పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ముందుకొచ్చాయి.

అర్హతలు

ఈ కొత్త ప్రోగ్రామ్‌లో భాగంగా బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకామ్ బీఈడీ అందించనున్నారు. దీనికి దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ బీఈడీలో చేరాలనుకునే అభ్యర్థులు ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో, బీకాం బీఈడీలో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

42 ఇన్‌స్టిట్యూట్స్.. 3950 సీట్లు

- ఎన్‌టీఏ సమాచారం ప్రకారం-ఎన్‌సీఈటీ స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలోని 42 విద్యాసంస్థలు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశం కల్పించనున్నాయి. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లో మొత్తం 3950 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలంగాణలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ బీఈడీ(50 సీట్లు), బీఎస్సీ బీఈడీ(50 సీట్లు), బీకాం బీఈడీ(50 సీట్లు); గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్–లక్సెట్టిపేట మంచిర్యాలలో బీఏ బీఈడీలో 50 సీట్లు ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి జాతీయ సంస్కృత విద్యాలయం-తిరుపతిలో బీఏ బీఈడీలో 50 సీట్లు; డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ -ఎచ్చెర్లలో బీఏ బీఈడీలో 50 సీట్లు; బీఎస్సీ బీఈడీలో 50సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి.

ఎన్ఐటీలు, ఐఐటీల్లోనూ

సాంకేతిక విద్యకు కేరాఫ్‌గా భావించే ఎన్ఐటీలు, ఐఐటీలు కూడా ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశం కల్పిస్తుండటం విశేషం. ఎన్ఐటీ–కాలికట్, ఎన్ఐటీ–వరంగల్, ఎన్ఐటీ–పుదుచ్చేరిలతోపాటు ఐఐటీ–ఖరగ్‌పూర్ బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు చొప్పున అడ్మిషన్ కల్పించనున్నాయి.

ఎన్‌సీఈటీ.. నాలుగు విభాగాలు

- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎన్‌సీఈటీ పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఆ వివరాలు..
- **విభాగం–1:** ఈ విభాగంలో రెండు లాంగ్వేజ్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో లాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఎన్‌టీఏ పేర్కొన్న 33 లాంగ్వేజ్‌లలో ఏవైనా రెండు లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది.
- **విభాగం–2: డొమైన్ సంబంధిత సబ్జెక్ట్:** ఈ విభాగంలో మొత్తం 26 డొమైన్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. అభ్యర్థులు తమ ఆసక్తికి అనుగుణంగా మూడు డొమైన్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- **విభాగం–3: టీచింగ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి.
- **విభాగం–4: జనరల్ టెస్ట్:** ఈ విభాగంలో 25 ప్రశ్నలు అడుగుతారు.
- మొత్తంగా 160 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు. అదే విధంగా ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.



ఎన్‌టీఏ ఎన్‌సీఈటీ 2023

పదమూడు భాషల్లో పరీక్ష

ఎన్‌సీఈటీని.. ఇంగ్లిష్, హిందీతోపాటు మరో 13 భాషల్లో నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణ అభ్యర్థులు ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూలలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

స్కోర్ ఆధారంగా దరఖాస్తు

ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్ ఆధారంగా ఆయా యూనివర్సిటీలు /ఇన్‌స్టిట్యూట్స్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత దశలో సదరు ఇన్‌స్టిట్యూట్స్ అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులు, ప్రవేశ పరీక్ష స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తాయి.

బెస్ట్ స్కోర్‌కు మార్గాలివే

లాంగ్వేజ్ టెస్ట్

మొత్తం రెండు లాంగ్వేజ్‌లలో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ లాంగ్వేజ్ టెస్ట్‌లలో మెరుగైన స్కోర్‌కు అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలకు సంబంధించి గ్రామర్, కాంప్రహెన్షన్, వాక్య నిర్మాణం , సాహిత్యం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి.

డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్

అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌ల ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ఇంటర్మీడియెట్, పదో తరగతి స్థాయి అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. విద్యార్థులు తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన ఫార్ములాలు,అప్లికేషన్స్,సిద్ధాంతాలు, నిర్వచనాలు, భావనలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా బీఎస్సీ బీఈడీ అభ్యర్థులు సైన్స్, మ్యాథ్స్‌లలోని ముఖ్యమైన కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ టెస్ట్

ఈ విభాగం కోసం హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్–డీ కోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై పట్టు సాధించాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

బీఈడీ ప్రవేశ పరీక్షల్లో ఎంతో కీలకంగా నిలిచే ఈ విభాగంలో మంచి మార్కుల కోసం విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజీకి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.

ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. అదే విధంగా నూతన విద్యా విధానం–ఉద్దేశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూన్ 26– జూలై 19, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** జూలై 20 – జూలై 21, 2023
- **పరీక్ష కేంద్రాల కేటాయింపు:** జూలై 26, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు నుంచి;
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చిత్తూరు, గూడూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం , మహబూబ్‌నగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nta.ac.in, https://ncet.samarth.ac.in

క్లుప్తంగా...

డీవైఈవో పోస్టుల భర్తీకి చర్యలు

సాక్షి, అమరావతి: విద్యా శాఖలో 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారులు/గ్రేడ్-1 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టుల(డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు సోమవారం ఏపీపీఎస్సీ జీఓ నంబర్ 86ని విడుదల చేసింది. పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఆయా పోస్టులకు రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లు అందగానే నోటిఫికేషన్ వెలువడనుంది. ఇటీవల విద్యా శాఖపై సమీక్ష చేసిన సీఎం వైఎస్ జగన్.. విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ఈ పోస్టులను భర్తీ చేయాలని, వీలైనంత వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డీవైఈవో పోస్టుల భర్తీని చివరిసారిగా 2007లో చేపట్టారు.

నెలాఖరుకల్లా 'నాడు-నేడు' పూర్తవ్వాలి

- పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కె.భాస్కర్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో చేపట్టిన ముఖ్యమైన పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులు, అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లకు పాఠశాల విద్యా శాఖ మౌలిక సదుపాయాలు కమిషనర్ కె.భాస్కర్ ఆదేశించారు. సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జూనియర్ కాలేజీల్లో కాంపౌండ్ వాల్స్ మినహా మిగతా పనులన్నీ ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులు ఆగస్టులో చేపట్టాలని సూచించారు. ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా ఒకేషనల్ విద్యా శాఖ అధికారులు పనులు వేగంగా పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే నాడు-నేడు రెండో దశ కింద స్కూళ్లలో చేపట్టిన పనులను కూడా ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. స్కూళ్లలో కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలను సెప్టెంబర్‌లో చేపట్టాలని సూచించారు. నాడు-నేడు రెండో దశ పనుల పురోగతిని ప్రతి మంగళవారం, శుక్రవారం వెబ్ఎక్స్ సమావేశం ద్వారా సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా విద్యా శాఖ అధికారులు, ప్రాజెక్టు అదనపు కో-ఆర్డినేటర్లు హాజరుకావాలని.. లేకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్జీరంగా వర్సిటీ కళాశాలల్లో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో వ్యవసాయ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా మంగళవారం నుంచి విద్యార్థులు ఈ నెల 27వ తేదీ వరకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంతో ఏం సాధిస్తారు?

- టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

సాక్షి, అమరావతి: 'ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెట్టి ఈ ముఖ్యమంత్రి ఏం సాధిస్తారు? విదేశాల్లో బిచ్చగాళ్లు కూడా ఇంగ్లిష్‌లోనే మాట్లాడుతారు. అక్కడ నిరుద్యోగం లేదా! జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులపై బలవంతంగా ఇంగ్లిష్ మీడియాన్ని రుద్దుతున్నారు' అని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు విమర్శించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ విద్యార్థులపై ఇంగ్లిష్ మీడియం చదువులను రుద్దడం వల్ల 8 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమయ్యారని ఆరోపించారు.

పవిత్ర జెరూసలేం యాత్ర ప్రారంభం

సాక్షి, అమరావతి: పవిత్ర జెరూసలేం యాత్ర-2023 ప్రారంభమైంది. యాత్రకు వెళుతున్న వారికి దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా సబ్సిడీ అందించడంలో ప్రభుత్వం రికార్డు సృష్టిస్తోంది. ఈ యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి రూ.1.45 లక్షలు అవుతుంది. ఇందుకోసం ప్రభుత్వం కొంత మొత్తాన్ని సబ్సిడీగా అందిస్తోంది. యాత్రికుల్లో ఏడాదికి రూ.3 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి రూ.60 వేల చొప్పున, రూ.3లక్షలకు పైగా వార్షిక ఆదాయం కలిగిన వారికి రూ.30 వేల చొప్పున సబ్సిడీ ఇస్తోంది. ఈ యాత్ర పది రోజులపాటు సాగుతుంది. ఈ ఏడాది(2023-24) బడ్జెట్‌లో ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.1.50 కోట్లను కేటాయించినట్టు ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శేఖర్ తెలిపారు. ఈ ఏడాది 280 మంది యాత్రికులకు ప్రభుత్వ సాయం అందేలా ఆమోదం లభించిందని చెప్పారు. 46 మందితో కూడిన తొలి బృందం సోమవారం పయనమైందన్నారు.



ఒక వ్యక్తి రోజులో ఎక్కువ భాగం గడిపే చోటు ఏదైనా ఉందంటే అది ఉద్యోగం/ వృత్తిపరమైన విధులు నిర్వర్తించే ప్రదేశమే. ఎవరికైనా ఇది తప్పనిసరే అయినా.. ఆయా ఉద్యోగాలు/వృత్తి ప్రదేశాలకు వ్యక్తుల అనారోగ్యాలకు సంబంధం ఏర్పడుతోంది. సాధారణ జలుబు నుంచి తీవ్రమైన అనారోగ్యాలకు కారణమయ్యే దాకా.. వివిధ ఉద్యోగాలు, వృత్తుల ప్రభావం పడుతోంది. ఆరోగ్యం క్షీణించడం మొదలయ్యే వరకు కూడా చాలా మంది ఈ సమస్యను గమనించలేని పరిస్థితి ఉంటుంది. ఇటీవలికాలంలో వృత్తి వ్యాపకాల ప్రభావం గతంలో కంటే మరింత పెరిగిందని.. శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఇబ్బంది పెరుగుతోందని నిపుణులు అంటున్నారు. వీటినే ఆక్యుపేషనల్ హజార్డ్స్‌గా చెప్తున్నారు. ఈ సమస్యలు రాకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆక్యుపేషనల్ హెల్త్‌పై అవగాహన కలిగిస్తున్న పలు సంస్థల అధ్యయనాలు ఏయే రంగాల్లో పనిచేస్తున్నవారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నది తేల్చి చెప్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

చేసే పనీ.. చేటు చేయొచ్చు..!

- వివిధ రకాల వృత్తులు, ఉద్యోగాలతో అనారోగ్యాలు
- సాధారణ జలుబు నుంచి కేన్సర్ల దాకా.. మణికట్టు నొప్పి నుంచి వెన్నెముక వ్యాధుల దాకా..
- తెలియకుండానే 'ఆక్యుపేషనల్ హజార్డ్స్' బారినపడుతున్న వైనం
- రాత్రిపూట పనిచేస్తున్నా, షిఫ్టులు మారుతున్నా ప్రమాదమే!
- ముందు జాగ్రత్తపడితేనే సమస్య నుంచి తప్పించుకో వచ్చంటున్న నిపుణులు

వినికిడికి.. 'ధ్వని' దెబ్బ



ఎక్కువ ధ్వని వెలువడే పరిశ్రమలు, ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు వినికిడి సమస్యల బారినపడుతున్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. ఏవైనా పరిశ్రమల్లో ఒక ఉద్యోగి 8గంటల పాటు 90 డెసిబుల్స్ ధ్వనిలో పనిచేయవచ్చు. 95 డెసిబుల్స్ ఉంటే 4 గంటలు, 100 డెసిబుల్స్ ఉంటే 2 గంటలు మాత్రమే పనిచేయాలి. అదే 115 డెసిబుల్స్, ఆపైన తీవ్రతతో ధ్వని ఉంటే.. ఒక్క నిమిషం కూడా ఉండొద్దు. అంతేకాదు.. ఇయర్ ప్లగ్స్, ఇయర్ కెనాల్స్ వంటివి వాడాలి.

శుభ్రత.. ఆరోగ్యానికి లేదు భద్రత

విభిన్న రకాల ఆవరణలను శుభ్రపరిచే వారికీ ఆరోగ్యపు ముప్పు తప్పడం లేదు. టాయిలెట్, బాత్రూం, ఫ్లోర్ క్లీనర్లు వాడినప్పుడు విష వాయువులు వెలువడతాయి. అవి చాలా ప్రమాదకరం.

వెన్నెముక కష్టాలు..

కంప్యూటర్ స్క్రీన్ ముందు ఎక్కువ గంటలు కూర్చుని పనిచేసేవారికి వెన్ను భాగం, చేతులు, కళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇటీవల ఈ రకమైన కెరీర్‌ను ఎంచుకుంటున్నవారు పెరిగారు. చాలా మంది వెన్నెముక సమస్యలు, స్లిప్డ్ డిస్క్, కండరాల ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

పూల డిజైనర్‌కూ డేంజర్

అందంగా, ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ పూల డిజైనర్ వృత్తి కూడా సమస్య రేపేదే. పూల డిజైనర్ కాండం నుంచి పూలను కత్తిరించి, అందంగా అమర్చే సమయంలో వాటికి దగ్గరగా ఉంటారు. ఆ పూల మొక్కల కోసం వినియోగించే బలమైన పురుగుమందుల ప్రభావానికి లోనవుతారు.

అనారోగ్య 'గనులు'



గనులలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు వారు పీల్చే కలుషిత గాలి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నెమ్మదిగా ఊపిరితిత్తులు పాడవుతాయి. ఎన్ని జాగ్రత్తలు, గట్టి టోపీలు, అగ్నిమాపక భద్రత పరికరాలు, గాగుల్స్ వంటివి వాడినా ప్రమాదం తప్పని పరిస్థితే ఉంటోందని నిపుణులు తేల్చారు.

భవన నిర్మాణం.. ఆరోగ్య ధ్వంసం

నిర్మాణ రంగంలో ప్రతి ఒక్కరికీ, వారు కార్మికులు, ఉద్యోగులు, డిజైనర్లు ఎవరైనా సరే.. ఎక్కువసేపు అక్కడే గడిపితే ప్రమాదకరమే. సిమెంట్, మట్టి, ఇసుక ధూళి, పెయింట్లు, మరికొన్ని నిర్మాణ ఉత్పత్తులు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి.

సమస్యల కర్మాగారాలు

కర్మాగారాల్లో భారీ యంత్రాలు, ప్రమాదకరమైన పదార్థాలు ఉంటాయి. పెద్ద శబ్దాలు వెలువడతాయి. ఇవన్నీ వ్యక్తుల ఆరోగ్యానికి హానికరమే. ఫ్యాక్టరీ కార్మికులు, మేనేజర్లు లేదా ఫ్లోర్ వర్కర్లలో వినికిడి లోపం సాధారణంగా మారుతోంది.

బీపీఓలలో.. బాడీ క్లాక్‌కు బ్రేక్

బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (బీపీఓ) సెంటర్లలో రాత్రి షిఫ్టులలో పనిచేయడం, నిరంతర రాత్రి షిఫ్టులు, తరచూ షిఫ్టులు మారడం వంటివి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పగటిపూట నిద్రపోతున్నా, షిఫ్టులు మారుతున్నా శరీరంలోని జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ప్రభావితమవుతుంది. దీర్ఘకాలిక నష్టానికి కారణమవుతోంది. రాత్రి షిఫ్టులలో పనిచేసేవారిలో హైపర్ టెన్షన్, డయాబెటిస్‌తోపాటు సెప్టిక్ అల్సర్లు, గ్యాస్ట్రిక్ అల్సర్లు వస్తున్నాయి.

ముందు జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

'ఆక్యుపేషనల్ హజార్డ్స్' బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. తాము చేస్తున్న వృత్తి వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో గుర్తించి.. వాటి నుంచి తప్పించుకునే అంశాలను పాటించాలని స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చుని పని చేసేవారు.. మధ్యలో కాసేపు లేచి నడవడం, అటూ ఇటూ దూరంగా ఉన్న వస్తువులను చూడటం, వీలైతే చిన్నచిన్న వ్యాయామాలు చేయడం మంచిదని చెప్తున్నారు. అపరిశుభ్ర, కాలుష్య పరిస్థితుల్లో పనిచేసేవారు మాస్కులు, గ్లౌజులు వంటివి కచ్చితంగా వాడాలని సూచిస్తున్నారు. వైద్యులను సంప్రదించి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో సలహాలు తీసుకుని పాటించాలని స్పష్టం చేస్తున్నారు.

వృత్తికో వ్యాధి తప్పట్లేదు

అనేక రకాల పరిశ్రమలు, వృత్తులు, ఉద్యోగాలు వివిధ రకాల అనారోగ్యాలకు కారణమవుతున్నాయి.

- ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఊపిరితిత్తుల సమస్యలు, అతిగా నిలబడడం వల్ల వెరికోసిటీస్, వినికిడి సమస్యలు వస్తున్నాయి.
- పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు ఆక్యుపేషనల్ స్ట్రెస్ ఎక్కువగా ఉంటోందని, డయాబెటిస్, హైపర్ టెన్షన్ బారినపడుతున్నారని అధ్యయనాలు తేల్చాయి. గట్టిగా మాట్లాడుతూ బోధించడం వల్ల గొంతు సమస్యలూ కనిపిస్తున్నాయని అంటున్నాయి.
- లారీలు, కంటైనర్లు వంటి భారీ వాహనాల డ్రైవర్లకు వెన్ను సమస్యలు, ఆస్టియో ఆర్థరైటిస్, వాహనాల వైబ్రేషన్ వల్ల రక్తపోటు సమస్యలు వస్తున్నాయి. కన్నార్పకుండా రోడ్లను చూస్తుండటం వల్ల కళ్లు పొడిబారుతూ దృష్టి సమస్యలు వస్తున్నట్టు గుర్తించారు.
- సిలికా పరిశ్రమలో పనిచేసేవారు ఊపిరితిత్తులకు సంబంధించిన సిలికోసిస్‌కు గురవుతారు. ఆస్బెస్టాస్ పరిశ్రమల్లో పనిచేసేవారు పలు రకాల కేన్సర్లకు, చక్కెర పరిశ్రమలో పనిచేసేవారు బెగసోసిస్ వంటివాటికి గురవుతారు.

అవగాహన కల్పిస్తున్నాం

వృత్తి, ఉద్యోగపరమైన బాధ్యతల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటిపై తరచుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గత వారం ట్రాఫిక్ పోలీసులకు వచ్చే సమస్యలపై సదస్సు ఏర్పాటు చేశాం. కొత్తగా పుట్టుకొస్తున్న ప్రొఫెషన్ల వల్ల కూడా కొత్త ఆరోగ్య సమస్యలు మొదలవుతున్నాయి. ఈ తరహా ఆక్యుపేషనల్ హజార్డ్స్‌కు చికిత్సలు లేవు. నివారణే శరణ్యం. అందువల్ల ఆయా రంగాల్లో విధులు నిర్వర్తిస్తున్నవారు అవగాహన పెంచుకుని, ముందు జాగ్రత్తలు పాటించడం మంచిది.

– డాక్టర్ విజయ్‌రావు, జాతీయ అధ్యక్షుడు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్

పాఠశాలల్లో పాత భవనాల తొలగింపు

- వినియోగానికి వీలు కాని 7 వేల తరగతి గదులు తొలగింపు
- కొత్తగా 13 వేల తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం
- నవంబర్‌కి అదనపు తరగతి గదులు సిద్ధం.. డిసెంబరు చివరికి ప్రహరీల నిర్మాణం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలల్లో ఉన్న పాతవి, శిథిలమైన భవనాలు, తరగతి గదులను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'మనబడి నాడు-నేడు' పథకం కింద కొత్త భవనాలు నిర్మించిన స్కూళ్లలో వినియోగించని భవనాలు, తరగతి గదులు 7 వేలకు పైగా ఉన్నట్టు ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. వీటిని వెంటనే తొలగించి ఆ ప్రాంతాన్ని చదును చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమగ్ర శిక్షలోని నాడు-నేడు మౌలిక సదుపాయాల కల్పన కమిషనర్ ఒకట్రెండు రోజుల్లో ఇందుకు చర్యలు చేపట్టనున్నారు.

కొత్తగా 13 వేల తరగతి గదులు

గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను, విద్యను నిర్లక్ష్యం చేయడంతో స్కూళ్లలో భవనాలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. అవి ఎప్పుడు కూలతాయోనని పిల్లలు భయంతో గడిపేవారు. చాలామంది ప్రైవేటు పాఠశాలలకు వలసపోయారు. తాగు నీరు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు అల్లాడారు. నాలుగేళ్ల క్రితం వైఎస్ జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా రంగాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దడంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వం పాఠశాల విద్యను పటిష్టం చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడానికి 'మనబడి నాడు-నేడు' పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో 15,715 పాఠశాలల్లో నిరంతర నీటి సదుపాయంతో మరుగుదొడ్లు, తాగు నీరు, అన్ని రకాల మరమ్మతులు, ఫ్యాన్లు, లైట్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్స్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కిచెన్ షెడ్లు, ప్రహరీల నిర్మాణం పూర్తిచేసింది. రెండో దశలో మరో 16 వేల పాఠశాలల్లోను ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ చర్యలతో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఆ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందులో 13 వేల అదనపు తరగతి గదులను ఈ ఏడాది నవంబర్‌కి అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. దీంతోపాటు నాడు-నేడు రెండు దశల్లో పనులు పూర్తయిన పాఠశాలలకు అన్నింటికీ డిసెంబరు నాటికి ప్రహరీల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఐఎఫ్‌పీల వినియోగంపై దృష్టి పెట్టండి

- అన్ని పాఠశాలలకు విద్యుత్ సదుపాయం తప్పనిసరి
- జిల్లా కలెక్టర్లు, డీఈవోలకు ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో (ఐఎఫ్‌పీ) ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు ఉండాలని పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. నాడు-నేడు మొదటి దశపూర్తయిన అన్ని పాఠశాలల్లో వీటి వినియోగాన్ని నిర్ధారించాలని సోమవారం జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఐఎఫ్‌పీల వినియోగానికి అనువుగా అన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల కృష్ణా జిల్లా గుడివాడ మండలంలోని కొన్ని పాఠశాలలను సందర్శించగా, విద్యుత్ సౌకర్యం లేక ఐఎఫ్‌పీలు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. బిగించిన వెంటనే వినియోగించుకునేందుకు అనువుగా ఉండే ఐఎఫ్‌పీలపై ఎస్‌సీఈఆర్టీ చానల్‌లో ప్రత్యేకంగా వీడియో అందుబాటులో ఉంచామన్నారు. ఫేజ్-1లో నాడు-నేడు పనులు పూర్తయిన అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని జిల్లా అధికారులకు తెలిపారు. ఈ నెల 25 నాటికి 6,731 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీ స్క్రీన్లు ఉండాలన్నారు. ప్రస్తుతం ఈ ప్యానెళ్ల వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికే 50 శాతం మందికి శిక్షణ పూర్తయిందని, ఈనెల 15 నాటికి మిగిలిన వారికీ శిక్షణ ముగుస్తుందని ప్రవీణ్ ప్రకాశ్ వివరించారు.

సరికొత్త ప్ర'యోగం'!

- తొలిసారి మహారాష్ట్రలోని ఫ్యాబ్ ల్యాబ్‌కు ఏపీ సైన్స్ అధికారుల బృందం
- నిపుణుల అభిప్రాయాలు, ల్యాబ్‌లోని విశేషాలు తెలుసుకునే అవకాశం
- విద్యార్థులకు ప్రయోగాల మీద ఆసక్తిని పెంపొందించడంపై అధ్యయనం
- ప్రభుత్వ పాఠశాలలను సైన్స్ ప్రయోగాలకు కేంద్రాలుగా తీర్చిదిద్దడంపై సర్కారు దృష్టి



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఏపీ అధికారులు

విశాఖ విద్య: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సైన్స్ ప్రయోగాలకు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. విద్యార్థులకు ప్రయోగాలపై ఆసక్తిని పెంపొందించి సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాల సైన్స్ అధికారులు (డీఎస్‌వో), ఎస్‌సీఈఆర్టీ, యునిసెఫ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, సమగ్ర శిక్ష విభాగాలకు చెందిన నోడల్ అధికారులతో కూడిన బృందాన్ని మహారాష్ట్రలోని పుణే సమీపాన పాబల్ అనే గ్రామంలో ఉన్న విజ్ఞాన ఆశ్రమానికి పంపించింది. కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ నిర్వహిస్తున్న విజ్ఞాన ఆశ్రమంలోని సైన్స్ ప్రయోగాలకు సంబంధించిన ఫ్యాబ్ ల్యాబ్‌లో సోమవారం ప్రారంభమైన ప్రతిష్టాత్మక వర్క్‌షాప్‌లో ఈ బృందం పాల్గొన్నది. నాలుగు రోజులు నిర్వహించనున్న ఈ వర్క్‌షాప్‌లో నిపుణుల అనుభవాలు, సూచనలు తెలుసుకోవడంతోపాటు ఫ్యాబ్ ల్యాబ్‌లో స్థానికంగా లభించే ముడిసరుకుతో విద్యార్థులు వినూత్న పరికరాలను ఎలా తయారు చేయాలి... అవి స్థానిక ప్రజలకు ఎలా ఉపయోగపడతాయి... అనే అంశాలపై జిల్లా సైన్స్ అధికారులు అధ్యయనం చేయనున్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారుల నేతృత్వంలో అన్ని జిల్లాల్లోనూ డివిజన్, మండలాల వారీగా పాఠశాలల్లో సదస్సులు ఏర్పాటుచేసి ఫ్యాబ్ ల్యాబ్‌లో అధ్యయనం చేసిన ఉత్తమ నమూనాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని 26 జిల్లాల సైన్స్ అధికారులు ఇతర రాష్ట్రాలకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లడం విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి అని ఉమ్మడి విశాఖ, కృష్ణా జిల్లాల సైన్సు అధికారులు కప్పాల ప్రసాద్, మైనం హుస్సేన్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల ల్యాబ్‌లలో ఉత్తమ ఫలితాలు

రాష్ట్రంలోని 713 ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యాన ఇప్పటికే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో రూ.20లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఈ ల్యాబ్‌లలో సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, గణితం వంటి అంశాల్లో విద్యార్థులను వినూత్న ఆలోచనలవైపు మళ్లించేలా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ ల్యాబ్‌ల ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం మరొక అడుగు ముందుకేసి 'నాడు-నేడు' ద్వారా అభివృద్ధి చేస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోంది. తద్వారా ఇంగ్లిష్ మీడియం చదువుతోపాటు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో విద్యార్థులు రాణించేలా పాఠశాలల్లోని ల్యాబ్‌లు ఉపయోగపడతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

శరవేగంగా భూముల రీ సర్వే

తొలి దశలో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి

- దేశంలోనే ప్రప్రథమంగా ఆ గ్రామాలకు డిజిటల్ రికార్డులు
- ఆధునిక పద్ధతుల్లో రీ సర్వే
- అక్షాంశ, రేఖాంశాలతో సహా రైతుల భూములకు హద్దులు
- ఎవరూ అక్రమ పద్ధతుల్లో మార్చలేని విధంగా హద్దుల నిర్ధారణ
- ప్రతి భూ కమతానికి ఒక విశిష్ట సంఖ్య
- 12,230 గ్రామాల్లో పూర్తయిన డ్రోన్ సర్వే.. త్వరలో డ్రోన్, ఏరియల్ సర్వేలు పూర్తయ్యే అవకాశం
- 3,092 గ్రామాల్లో సర్వే పూర్తి.. నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే శరవేగంగా జరుగుతోంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పటికే అనేక మైలురాళ్లు అధిగమించింది. తొలి దశలో 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, దేశంలోనే ప్రప్రథమంగా ఆ గ్రామాలకు డిజిటల్ రికార్డులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ ఒక్క గ్రామంలో కూడా భూముల రీ సర్వే పూర్తి చేయలేదు. అన్ని రాష్ట్రాల్లోనూ బ్రిటిష్ కాలం నాటి భూమి రికార్డులే ఇప్పటికీ చెలామణిలో ఉన్నాయి. వాటి ఆధారంగానే భూముల కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కానీ మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం 2 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి కొత్త భూముల రికార్డులను డిజిటల్ రూపంలో తయారు చేసింది. ఆ గ్రామాల్లోనే గ్రామ సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రైతుల భూముల హద్దులను అక్షాంశ, రేఖాంశాలతో సహా ఎవరూ అక్రమ పద్ధతుల్లో మార్చలేని విధంగా నిర్ధారించింది. ప్రతి భూ కమతానికి ఒక విశిష్ట సంఖ్యను కూడా కేటాయించింది. ఏపీలో రూపొందుతున్న డిజిటల్ భూ రికార్డులు ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు సైతం మోడల్‌గా నిలిచాయి. ఇప్పటికే పలు రాష్ట్రాలు మన మోడల్‌పై అధ్యయనం చేశాయి. రీ సర్వే ఎలా చేయాలనే అంశంపై ఏపీ సర్వే అధికారులతో ఆ రాష్ట్రాల అధికారులకు శిక్షణ కూడా ఇప్పిస్తున్నాయి. ఉత్తరాఖండ్, పాండిచ్చేరిలో ఈ శిక్షణ తరగతులు జరగ్గా, మరికొన్ని రాష్ట్రాలూ ఇదే బాటలో ఉన్నాయి.

క్షేత్ర స్థాయి నిజనిర్ధారణలోనూ దూకుడు

ఇప్పటివరకు అందిన ఓఆర్ఐలతో క్షేత్రస్థాయి నిజనిర్ధారణను వేగంగా చేపడుతున్నారు. రైతులు చూపించే వాస్తవ సరిహద్దులను డ్రోన్ చిత్రాలతో పోల్చి చూసే అతి ముఖ్యమైన నిజనిర్ధారణ 4,283 గ్రామాల్లో 57 లక్షలకుపైగా ఎకరాల్లో పూర్తయింది. దీంతో ఆయా గ్రామాల్లోని భూముల కమతాలకు సర్వే నంబర్లకు బదులుగా ఇచ్చే ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లు 43.42 లక్షలు జారీ చేశారు. మిగిలిన 2,246 గ్రామాల్లో నిజనిర్ధారణ జరుగుతోంది. ఆ తర్వాత మరోసారి రైతుల సమక్షంలో జరిగే గ్రౌండ్ వాలిడేషన్ (క్షేత్ర స్థాయి ధ్రువీకరణ) 3,428 గ్రామాల్లో (37.39 లక్షల ఎకరాలు) పూర్తవగా 855 గ్రామాల్లో జరుగుతోంది. ఇప్పటివరకు 3,092 గ్రామాల్లో (28.33 లక్షల ఎకరాలు) సర్వే పూర్తయినట్లు నంబర్ 13 నోటిఫికేషన్లు జారీ చేశారు. ఈ లెక్కలనుబట్టి రీ సర్వే ఎంత శాస్త్రీయంగా, పక్కాగా వేగంగా జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

1.08 లక్షల చదరపు కిలోమీటర్లలో డ్రోన్, ఏరియల్ సర్వే పూర్తి

రాష్ట్రంలో అత్యంత ఆధునిక పద్ధతుల్లో రీ సర్వే జరుగుతోంది. ఇందులో భాగంగా చేపట్టిన డ్రోన్, ఏరియల్ సర్వేలు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. మొత్తం 1.26 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కొలవాల్సివుండగా 1.08 లక్షల చదరపు కిలోమీటర్లను ఈ సర్వే ద్వారా ప్రభుత్వం కొలిచింది. 17,460 గ్రామాలకుగాను 12,230 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయింది. ఈ గ్రామాల్లో డ్రోన్లు, విమానాల ద్వారా 1.8 కోట్ల ఎకరాల కొలతలను పూర్తి చేశారు. అతి త్వరలో మిగిలిన గ్రామాల్లోనూ ఈ సర్వే పూర్తికానుంది. డ్రోన్, ఏరియల్ సర్వే ద్వారా తీసిన చిత్రాలను అభివృద్ధి చేసి 6,529 గ్రామాల ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ)లను సర్వే బృందాలకు అందించారు. మిగిలిన గ్రామాల ఓఆర్ఐలను నిర్ణీత సమయంలో సర్వే బృందాలకు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943